సమగ్ర సమాచార పత్రిక
www.mudranews.in
# ముద్ర
హైదరాబాద్
శుక్రవారం, 06.02.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 106
పేజీలు: 12 వెల: రూ. 5

## రేవంత్ రెడ్డి..శ్వేత పత్రం విడుదల చేసే
# దమ్ముందా?

ఎంపీ బండి సంజయ్



- కరీంనగర్ కు రూ.1400 కోట్లు విడుదల చేశానని చెప్పడం పెద్ద జోక్
- రెండేళ్ల పాలనలో కరీంనగర్ కు నయాపైసా ఇయ్యలే
- నన్ను కోసినా నయాపైసా లేదని చెప్పిన రేవంత్ రెడ్డి
- ఎన్నికలొస్తున్నాయని అబద్ధాలు
- దొంగ మాటలతో కొంపలు ముంచే సీఎం మాటలు నమ్మి మోసపోకండి

03




## మున్సిపల్ ఎన్నికలు ముగిసేలోపు
## కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావును
# అరెస్ట్ చేయాలి

కాళేశ్వరం, ఈ కార్ రేసింగ్ కేసులపై చర్యలకు బీజేపీ అనాసక్తి

- ఎవరెన్ని శాపనార్థనాలు పెట్టినా మరో ఎనిమిదేళ్లు మాదే అధికారం
- కాంగ్రెస్ ను దెబ్బతీసేందుకు బీజేపీ, బీఆర్ఎస్ ల కుమ్మక్కు రాజకీయాలు
- ప్రజాప్రభుత్వంపై విషం చిమ్ముతున్నారు
- వరంగల్, కరీంనగర్ జంట నగరాలుగా అభివృద్ధి
- బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి పరివాహక ఆలయాల అభివృద్ధి

09

మున్సిపల్ ఎన్నికలు ముగిసేలోపు కాళేశ్వరం, ఫార్ములా ఈ కార్ రేసింగ్ కేసుల్లో కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులను అరెస్ట్ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌ను దెబ్బతీసేందుకు బీజేపీ–బీఆర్ఎస్‌లు కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నాయని తీవ్ర ఆరోపణలు చేస్తూ, తెలంగాణ అభివృద్ధి ఆగదని స్పష్టం చేశారు.

## బీఆర్ఎస్
# ఎక్కడ?

- మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్–బీజేపీ మధ్యే అసలు పోటీ
- ఒకప్పుడు ఎదురులేని బీఆర్ఎస్.. ఇప్పుడు మూడో స్థానానికి
- ఉత్తర తెలంగాణ పట్టణాలే రాబోయే అసెంబ్లీకి సెమీ ఫైనల్
- రేవంత్ రెడ్డి ప్రత్యేక ఫోకస్.. మంత్రులకు బాధ్యతల పంపకం
- హిందుత్వ కార్డుతో బీజేపీ దూకుడుగా ప్రచారం
- నాయకత్వ లోపం, వలసలే గులాబీ దళానికి శాపం

ఉత్తర తెలంగాణలో మారిన రాజకీయ సమీకరణాలు



**ముద్ర, తెలంగాణ బ్యూరో:** రెండేండ్ల కిందట వరకు ఎదురులేకుండా సాగిన బీఆర్ఎస్ హవా.. ఇప్పుడు తగ్గుతున్నట్లుగా మారింది. అసెంబ్లీ ఎన్నికల్లో చావుతప్పి కన్ను లొట్టపోయినట్లుగా మారి.. పార్లమెంట్ ఎన్నికల్లో చచ్చిపోయిన ఆనాటి టీఆర్ఎస్.. ఇప్పటి బీఆర్ఎస్.. ఇప్పుడు బలం చూపించిన చోటే అష్టకష్టాలు పడుతోంది. స్థానిక ఎన్నికల్లో ఆ పార్టీ బలహీనత స్పష్టమవుతోంది. తాజా మున్సిపల్ ఎన్నికల రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. ఉత్తర తెలంగాణలో బీజేపీ వర్సెస్ కాంగ్రెస్ మధ్యే ప్రధాన పోటీ కనిపిస్తోంది.

ఉత్తర తెలంగాణలోని అదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ వంటి ఉమ్మడి జిల్లాల్లో మున్సిపల్ ఎన్నికల ప్రచారం పతాక స్థాయికి చేరింది. గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల ఫలితాలను బట్టి చూస్తే, ఈ ప్రాంతంలో బీజేపీ బలంగా పుంజుకోగా, అధికార కాంగ్రెస్ తన పట్టు నిలబెట్టుకునే ప్రయత్నం చేస్తోంది. అయితే, గత దశాబ్ద కాలంగా ఈ ప్రాంతంలో తిరుగులేని శక్తిగా ఉన్న బీఆర్ఎస్ ఇప్పుడు తీవ్రమైన నైరాశ్యంలో కనిపిస్తోంది. క్షేత్ర స్థాయిలో ద్వితీయ శ్రేణి నాయకత్వం ఇతర పార్టీల వైపు మొగ్గు చూపుతుండటం, కేసీఆర్ వంటి అగ్రనేతలు మున్సిపల్ ఎన్నికలపై దృష్టి సారించకపోవడం వల్ల గులాబీ దళం డీలా పడినట్లు భావిస్తున్నారు.

**ఉత్తర తెలంగాణలో గెలుపు పార్టీలకు కీలకం**

ఉత్తర తెలంగాణలోని ప్రధాన పట్టణాలు ఇప్పుడు ఎన్నికల రణక్షేత్రాలుగా మారాయి. ఈసారి ఎన్నికలు

మిగతా 02లో

## టీమిండియాతో
# మ్యాచ్ ఆడం

- టీ20 వరల్డ్‌కప్–2026లో భారత్‌తో మ్యాచ్ బహిష్కరిస్తున్నాం
- క్రీడల్లో రాజకీయాలు వద్దంటూ కారణం చెప్పిన షరీఫ్
- బంగ్లాదేశ్‌కు మద్దతు పేరుతో భారత్‌పై పరోక్ష సందేశం?

పాక్ ప్రధాని

11



# ఖర్గే vs నడ్డా

నరవణే పుస్తకంపై వివాదం



- రాజ్యసభ వేదికగా ప్రతిపక్ష-ప్రభుత్వం మధ్య మాటల యుద్ధం
- పార్లమెంటరీ విధానంపై ఖర్గే ఆరోపణలు, నడ్డా కౌంటర్
- లోక్‌సభ అంశాలు రాజ్యసభలో చర్చకు రావద్దన్న జేపీ నడ్డా
- తీవ్ర వాగ్వాదం అనంతరం రాజ్యసభ నుంచి ప్రతిపక్ష ఎంపీల వాకౌట్

09

## ఓలా, ఉబర్ లకు చెక్.. ఇక
# భారత్ ట్యాక్సీ

డ్రైవర్‌కు పూర్తి ఆదాయం.. కమిషన్ జీరో




- సహకార పద్ధతిలో దేశ తొలి టాక్సీ యాప్
- ఓలా–ఉబర్ దోపిడీకి కేంద్రం కౌంటర్
- ఢిల్లీ నుంచి దేశవ్యాప్త విస్తరణ లక్ష్యం
- భద్రత, బీమాతో కొత్త ప్రయాణ అనుభవం

02

## గ్రామ పంచాయతీలకు
# కేంద్ర నిధులు

పెండింగ్ లో ఉన్న 15వ ఆర్థికసంఘం నిధుల విడుదల




- తొలి విడతగా రూ.259.36 కోట్లు రిలీజ్
- పంచాయతీ ఎన్నికలు పూర్తవడంతో తొలగిన సాంకేతిక అడ్డంకులు
- ఇప్పటివరకు రాష్ట్రానికి రావాల్సిన మొత్తం రూ.3 వేల కోట్లు
- విడతల వారీగా నిధుల విడుదలకు కేంద్రం నిర్ణయం

03

## మరో భర్త బలి..

ప్రియుడి కోసం భర్తకు ఉరితాడు



- వాకింగ్‌కి తీసుకెళ్లి భర్తను ప్రియుడితో చంపించేసింది..
- కొత్త పెళ్లి కూతురు కిరాతకం, పెళ్లయిన 3 నెలలకే దారుణం
- వాకింగ్ పేరుతో హత్య.. రోడ్డు ప్రమాదం నాటకం
- భార్యకు గాయం లేదు.. దొంగతనం డ్రామా
- హనీమూన్ హత్య కేసు 2.0 ఇది

02

*"నూరేళ్ల జీవితం.. మూడు ముళ్ల బంధం.. అగ్నిసాక్షిగా చేసుకున్న ప్రమాణాలు.. ఆ పవిత్ర బంధంపై నమ్మకంతో ఆమె అడుగులో అడు గు కలిపి నడిచాడా భర్త. తన భార్యే కదా అని నమ్మి ఆమె వెంటే వెళ్లాడు.. కానీ తనని నడిపిస్తోంది నూరేళ్ల సావాసం వైపు కాదు, మృత్యువు ఒడిలోకి అని పాపం ఆ అమాయకుడికి తెలియదు. చీకటి మాటున భార్య వేసిన మృత్యుపాశం, భర్త ప్రాణాలను బలి తీసుకుంది. ప్రేమ పేరుతో ఒకరు, పెళ్లి బంధాన్ని కాలరాస్తూ మరొకరు చేసిన ఈ దారుణం.. మానవ సంబంధాలపై ఉన్న నమ్మకాన్నే వెక్కిరిస్తోంది.*

## గద్వాల రాజకీయం..
# గందరగోళం

ఎమ్మెల్యే బండ్ల, కాంగ్రెస్ జిల్లా ఇంచార్జి సరిత రాజకీయ రచ్చ



- ఇంతకాలం కాంగ్రెస్ కు సేవాలందించిన సరిత, బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లో చేరిన ఎమ్మెల్యే బండ్ల
- బండ్ల చేరికను మొదటి నుంచి వ్యతిరేకిస్తున్న సరిత వర్గం
- ఎమ్మెల్యేగా అనర్హత వేటుపడుతుందని బీఆర్ఎస్ లో ఉన్నానని ఎమ్మెల్యే ప్రకటన
- ప్రస్తుత మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల తరపున ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే

10



## గ్రూప్-1కు
# గ్రీన్ సిగ్నల్

- 562 నియామకాలకు మార్గం సుగమం
- గ్రూప్–1 నియామకాల్లో అవకతవకలేవని హైకోర్టు స్పష్టం
- సింగిల్ బెంచ్ విధించిన స్టేను కొట్టివేసిన డివిజన్ బెంచ్
- టీజీపీఎస్సీ నిర్వహించిన పరీక్షలు సక్రమమేనన్న ధర్మాసనం

03

## మూడు ముక్కలుగా
# 'గ్రేటర్ హైదరాబాద్'

03



- జీహెచ్ఎంసీ బ్రేక్.. మూడు కార్పొరేషన్లకు గ్రీన్ సిగ్నల్
- హైదరాబాద్, శేరిలింగంపల్లి, మల్కాజిగిరి... కొత్త మ్యాప్ రెడీ
- ఫిబ్రవరి 10తో ముగియనున్న జీహెచ్ఎంసీ గడువు – అదే రోజున విభజన ఉత్తర్వులా?

## నాలుగు వారాల్లో
## పూర్తి స్థాయి డీజీపీని
# నియమించండి

యూపీఎస్సీ, రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశాలు



- డీజీపీ ఎంపికపై హైకోర్టు తీర్పును సమర్థించిన సర్వోన్నత న్యాయస్థానం
- శివధర్ రెడ్డి నియామకంపై దాఖలైన పిటిషన్‌పై కీలక విచారణ

03

## ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు
# అలర్ట్

మూడో విడత బిల్లుల చెల్లింపులో కీలక మార్పులు



- ఉపాధి హామీ (వీబీ జీరామ్‌జీ) పథకానికి అనుసంధానం
- జాబ్‌కార్డు ఉన్నవారికి 90 రోజుల పని కల్పించి వేతనం చెల్లింపు
- జాబ్‌కార్డు లేని ఇందిరమ్మ లబ్ధిదారులకు కొత్త కార్డుల మంజూరు
- మొదటి, రెండో, నాలుగో విడతల చెల్లింపుల్లో ఎలాంటి మార్పులు లేవు

**ముద్ర, తెలంగాణ బ్యూరో :** ఇందిరమ్మ లబ్ధిదారులకు అలర్ట్. బిల్లుల చెల్లింపులో స్వల్ప మార్పులు చోటు చేసుకున్నాయి. ఇప్పటి వరకు పూర్తి బిల్లులను ప్రభుత్వం చెల్లించగా.. ఇక నుంచి మూడో విడత బిల్లులను మాత్రం వీబీ జీరామ్‌జీ పథకానికి అనుసంధానం చేశారు. అంటే ఉపాధి హామీ పథకం కింది ఈ బిల్లు లను చెల్లించనున్నారు. జాబ్ కార్డు లేని లబ్ధిదారులకు కొత్తగా కార్డులు మంజూరు చేస్తున్నారు. ప్రభుత్వం పేదల సొంతింటి కలను నిజం చేసేం దుకు ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులను ఎల్–1, ఎల్–2, ఎల్–3 కేటగిరులుగా విభజించి ప్రస్తుతం ఎల్–1 కేటగిరిలో ఉన్న వారి ఇండ్ల నిర్మాణానికి ఆర్థిక సాయం చేస్తున్నారు. మొత్తం నాలుగు విడ తల్లో రూ. 5 లక్షలు ఇంటి నిర్మాణానికి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నారు. అయితే బిల్లుల చెల్లింపులో ప్రభుత్వం తాజాగా కొన్ని మార్పులు చేసింది. మొదటి, రెండు, నాలుగు విడతలు మినహా మిగిలిన మూడో

మిగతా 02లో

ముద్ర వింత

కర్ణాటకలోని ఉడుపికి చెందిన శంతను శెట్టిగర్ (33)కు భారీ లాటరీ తగిలింది. తన స్నేహితుడితో కలిసి అబుధాబీ బిగ్ టికెట్‌లో దాదాపు రూ.49 కోట్లు గెలుచుకున్నాడు



## దేశంలోని టాప్ 10 పార్టీలు



**భారతీయ జనతా పార్టీ (BJP)**

దేశంలో అతిపెద్ద పార్టీ; జాతీయవాదం, హిందుత్వం, అభివృద్ధి రాజకీయాలే ప్రధాన అజెండా.

# ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు అలర్ట్

**(మొదటి పేజీ తరువాయి)**

విడత బిల్లుల చెల్లింపుల్లో ఈ మార్పులు చేసింది. ఈ విడతలో బిల్లులను వీబీ జీరామ్‌జీ పథకానికి అనుసంధానం చేశారు. జాబ్‌కార్డు కలిగి ఉన్న ఇందిరమ్మ లబ్ధిదారులకు 90 రోజులు పని కల్పించి..

ఇందిరమ్మ లబ్ధిదారులకు అలర్ట్. బిల్లుల చెల్లింపులో స్వల్ప మార్పులు చోటు చేసుకున్నాయి. ఇప్పటి వరకు పూర్తి బిల్లులను ప్రభుత్వం చెల్లించగా.. ఇక నుంచి మూడో విడత బిల్లులను మాత్రం వీబీ జీరామ్‌జీ పథకానికి అనుసంధానం చేశారు. అంటే ఉపాధి హామీ పథకం కింది ఈ బిల్లులను చెల్లించనున్నారు. జాబ్ కార్డు లేని లబ్ధిదారులకు కొత్తగా కార్డులు మంజూరు చేస్తున్నారు. ప్రభుత్వం పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులను ఎల్–1, ఎల్–2, ఎల్–3 కేటగిరులుగా విభజించి ప్రస్తుతం ఎల్–1 కేటగిరిలో ఉన్న వారి ఇండ్ల నిర్మాణానికి ఆర్థిక సాయం చేస్తున్నారు. మొత్తం నాలుగు విడతల్లో రూ. 5 లక్షలు ఇంటి నిర్మాణానికి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నారు. అయితే బిల్లుల చెల్లింపులో ప్రభుత్వం తాజాగా కొన్ని మార్పులు చేసింది. మొదటి, రెండు, నాలుగు విడతలు మినహా మిగిలిన మూడో విడత బిల్లుల చెల్లింపుల్లో ఈ మార్పులు చేసింది. ఈ విడతలో బిల్లులను వీబీ జీరామ్‌జీ పథకానికి అనుసంధానం చేశారు. జాబ్‌కార్డు కలిగి ఉన్న ఇందిరమ్మ లబ్ధిదారులకు 90 రోజులు పని కల్పించి.. ఆ వేతనం డబ్బులను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయనున్నారు.




తెలంగాణ ప్రభుత్వం ఒక్కో ఇంటికి రూ.5 లక్షలు చెల్లిస్తున్న విషయం తెలిసిందే. పునాది వరకు పూర్తి చేస్తే రూ.లక్ష, గోడలు నిర్మించిన తర్వాత మరో లక్ష, స్లాబ్ వేసిన తర్వాత రూ. 1.40 లక్షలు, పని పూర్తయిన తర్వాత రూ.లక్ష చొప్పున మొత్తం రూ. 4.40 లక్షలు చెల్లించనున్నారు. అయితే మూడో దశలో స్లాబ్ వేసిన తర్వాత.. ఉపాధిహామీ కింద రోజుకు రూ.307 చొప్పున 90 రోజులకు రూ.27,630 చెల్లించనున్నారు. స్వచ్ఛభారత్ మిషన్ కింద బాత్‌రూం నిర్మించుకుంటే రూ.12 వేలు, ప్రధానమంత్రి గ్రామీణ ఆవాస్ యోజన కింద మరో రూ.21వేల చొప్పున మొత్తం రూ.60 వేలను లబ్ధిదారుల బ్యాంకు అకౌంట్లలో జమ చేయనున్నారు.

అయితే గత రెండేళ్లుగా ఉపాధిహామీలో కొత్తగా జాబ్‌కార్డుల జారీ నిలిచిపోయిన విషయం తెలిసిందే. ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన వారిలో చాలా మంది జాబ్‌కార్డులు లేని వారు ఉన్నట్లు గుర్తించారు. దీంతో వీరు ఈ పథకాన్ని వినియోగించుకోలేని పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో వారికి ప్రత్యేకంగా ఉపాధి జాబ్ కార్డులు జారీ చేయాలని రేవంత్ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు క్షేత్రస్థాయిలో అధికారులు చర్యలు చేపట్టారు. అర్హుల పరిశీలన అనంతరం జాబితాలను తయారు చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపించారు. వీరిలో కొందరికి ఇప్పటికే నూతన జాబ్ కార్డులు మంజూరయ్యాయి. త్వరలోనే మిగిలిన ప్రక్రియ పూర్తి చేయనున్నట్లుగా సంబంధిత అధికారులు వెల్లడించారు.



# మరో భర్త బలి..

రాజస్థాన్‌లోని శ్రీగంగానగర్ జిల్లాలో చో టుచేసుకున్న హత్య కేసు రాష్ట్రవ్యాప్తంగా సంచ లనం సృష్టించింది. పెళ్లైన కేవలం మూడు నెల లకే ఓ నవవధువు తన ప్రియుడితో కలిసి భర్త ను హత్య చేయించిన ఘటన వెలుగులోకి వ చ్చింది. ఈ కేసు గతంలో దేశాన్ని షాక్‌కు గురి చేసిన మేఘాలయ 'హనీమూన్ మర్డర్' కేసు ను గుర్తు చేస్తోంది.

అంజు–ఆశిష్‌లకు మూడు నెలల క్రితం వి వాహమైంది. అయితే పెళ్లికి ముందే అంజుకు తన పొరుగువాడు సంజుతో ప్రేమ సంబంధం ఉంది. కుటుంబ సభ్యుల ఒత్తిడితో ఆశిష్‌ను పెళ్లి చేసుకున్న ఆమె, భర్తతో కలిసి జీవిం చేందుకు ఇష్టపడలేదు. ప్రియుడితోనే ఉండాలన్న ఆలోచనతో భర్తే అడ్డంకి అని భావించి, అతడిని తొలగించాలని పక్కా పథకం రచించింది.

**వాకింగ్ పేరుతో మృత్యుపాశం:**

జనవరి 30 రాత్రి భోజనం తర్వాత సరదాగా వాకింగ్‌కు వెళ్దామని భర్తను బయటకు తీసుకెళ్లింది అంజు. ముందే ప్లాన్ ప్రకారం నిర్మానుష్య ప్రాంతంలోని పొదల్లో మాటువేసి ఉన్న సంజు, అతని స్నేహితులు ఆశిష్‌పై దాడి చేసి గొంతు నులిమి హత్య చేశారు. అనంతరం ఈ హత్యను రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించేందుకు శవాన్ని రోడ్డుపై పడేశారు. అంజు కూడా తాను ఏమీ తెలియనట్లు నటిస్తూ, ఎవరో వాహనం ఢీకొట్టి తమను గాయపరిచి నగలు, ఫోన్ దోచుకెళ్లారని స్థానికులకు, పోలీసులకు చెప్పింది.

**పోలీసుల నిఘాతో గుట్టు విప్పు:**

సంఘటనా స్థలంలో ఆశిష్ గొంతుపై ఉన్న గాయాలు, భార్యకు ఒక్క చిన్న గాయం కూడా లేకపోవడం పోలీసులకు అనుమానం కలిగించింది. ఆమె ప్రవర్తన కూడా సహజంగా లేకపోవడంతో కాల్ డేటా రికార్డులను పరిశీలించారు. అందులో అంజు–సంజు మధ్య జరిగిన నిరంతర సంభాషణలు బయట పడ్డాయి. తీవ్రంగా విచారించగా, ప్రియుడితో కలిసి ఉండాలంటే భర్త చనిపోవాల్సిందే అన్న ఆలోచనతోనే హత్యకు ప్రేరేపించినట్లు అంజు ఒప్పుకుంది. ఈ కేసులో అంజు, ఆమె ప్రియుడు సంజుతో పాటు మరో ఇద్దరు అనుచరులను పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. ఈ దారుణ ఘటన, ప్రేమ–వివాహాల పేరుతో జరుగుతున్న నేరాలకు భయంకర ఉదాహరణగా నిలిచింది.

# బీఆర్ఎస్ ఎక్కడ?

**(మొదటి పేజీ తరువాయి)**

జరుగుతున్న మొత్తం 7 మున్సిపల్ కార్పొరేషన్లలో 5 కార్పొరేషన్లు కరీంనగర్, రామగుండం, నిజామాబాద్, మంచిర్యాల, కొత్తగూడెం ఈ ప్రాంతానికే చెందినవి కావడం విశేషం. వీటితో పాటు ఉమ్మడి అదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల్లో సుమారు 35కు పైగా మున్సిపాలిటీలు ఉన్నాయి. ఈ పట్టణాల్లో పట్టు సాధించడం ద్వారా రానున్న అసెంబ్లీ ఎన్నికలకు పునాది వేసుకోవాలని అటు కాంగ్రెస్, ఇటు బీజేపీ పావులు కదుపుతున్నాయి.

**రంగంలోకి దిగిన రేవంత్ రెడ్డి**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉత్తర తెలంగాణపై ప్రత్యేక దృష్టి సారించి, కీలక మంత్రులకు బాధ్యతలు అప్పగించారు. నిజామాబాద్ జిల్లా ఇన్‌ఛార్జ్‌గా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, వరంగల్ బాధ్యతలను మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యవేక్షిస్తున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా మున్సిపాలిటీలను క్లీన్ స్వీప్ చేయాలని కాంగ్రెస్ యోచిస్తోంది. మరోవైపు, బీజేపీ జాతీయ నాయకత్వం హిందుత్వ కార్డును బలంగా వాడుకుంటోంది. ఎంపీలు బండి సంజయ్ , ధర్మపురి అరవింద్ తమ నియోజకవర్గాల్లోని కార్పొరేషన్లను గెలవడం ప్రతిష్ఠాత్మకమని భావిస్తూ వార్డుల వారీగా పర్యటిస్తున్నారు. రెండు పార్టీలు హోరాహోరీగా పోరాడుతున్నాయి.

**బీఆర్ఎస్ డీలాకు కారణాలేంటి?**

బీఆర్ఎస్ పార్టీలో మునుపటి జోష్ కనిపించడం లేదు. మాజీ మంత్రులు మరియు ఎమ్మెల్యేలు సొంత నియోజకవర్గాలకే పరిమితం కావడం, పార్టీ కార్యకర్తలకు భరోసా ఇచ్చే నాయకత్వం లోపించడం ఆ పార్టీని దెబ్బతీస్తోంది. ముఖ్యంగా నిజామాబాద్, కరీంనగర్ వంటి ప్రాంతాల్లో బీజేపీ, కాంగ్రెస్ మధ్యే ద్విముఖ పోటీ నెలకొంది. కవిత పార్టీని వీడటం బీఆర్ఎస్‌కు పెద్ద దెబ్బగా మారింది. చాలా చోట్ల బీఆర్ఎస్ అభ్యర్థులు మూడో స్థానానికి పరిమితమయ్యే ప్రమాదం ఉందని విశ్లేషణలు వస్తున్నాయి. ఫిబ్రవరి 11న జరగనున్న ఈ ఎన్నికలు ఉత్తర తెలంగాణలో ఎవరి బలం ఎంతో తేల్చనున్నాయి. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పట్ల పట్టణ ఓటర్లు మొగ్గు చూపుతారా? లేక పార్లమెంట్ ఎన్నికల్లో మెజారిటీ ఇచ్చినట్లుగానే బీజేపీకి పట్టం కడతారా? అన్నది వేచి చూడాలి.




# ఓలా, ఉబర్ లకు చెక్.. ఇక 'భారత్ ట్యాక్సీ'

**ముద్ర, బిజినెస్ న్యూస్ :**

దేశంలో రవాణా రంగంలో ఓ కొత్త మలుపుగా నిలిచే భారత్ ట్యాక్సీ యాప్‌ను ఈరోజు అధికారికంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రారంభించారు. డ్రైవర్ కేంద్రంగా రూపుదిద్దుకున్న భారత్ టాక్సీ యాప్.. దేశంలోనే తొలి సహకార ఆధారిత టాక్సీ ప్లాట్‌ఫామ్‌గా గుర్తింపు పొందుతోంది. మొదటి దశలో ఢిల్లీ–ఎన్‌సీఆర్ ప్రాంతంలో అందుబాటులోకి రానున్న ఈ యాప్.. తదుపరి దశల్లో ముంబై, బెంగళూరు, చెన్నై వంటి ప్రధాన నగరాలకు విస్తరించనుంది. ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న ర్యాపిడో, ఊబర్, ఓలా వంటి సంస్థలు పీక్ అవర్స్‌లో అధిక ఛార్జీలు వసూలు చేస్తున్నాయన్న ఫిర్యాదుల నేపథ్యంలో కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. ఈయాప్ ద్వారా బైక్, ఆటో, కార్ సేవలు అందుబాటులో ఉంటాయి. రాబోయే రెండేళ్లలో దేశవ్యాప్తంగా అన్ని నగరాలు, పట్టణాలకు ఈ సేవలను విస్తరించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది.

**ప్రయాణీకుల భద్రతకు పెద్దపీట..**

భారత్ టాక్సీ యాప్ ప్రత్యేకత డ్రైవర్ యాజమాన్య నమూనా. ఇప్పటి వరకు పనిచేస్తున్న ప్రైవేట్ టాక్సీ యాప్‌లలో డ్రైవర్లు తమ ఆదాయంలో పెద్ద మొత్తాన్ని కమిషన్ రూపంలో కంపెనీలకు చెల్లించాల్సి వస్తోంది. అదే పరిస్థితికి ప్రత్యామ్నాయంగా భారత్ టాక్సీ ఎటువంటి కమిషన్ వసూలు చేయదు. ప్రయాణికుడు చెల్లించిన మొత్తం పూర్తిగా డ్రైవర్ ఖాతాలోకే చేరుతుంది. ఈ విధానం ద్వారా డ్రైవర్ల ఆదాయం పెరగడమే కాకుండా వారికి హెల్త్ ఇన్సూరెన్స్, యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్, పీఎఫ్ వంటి సామాజిక భద్రతా సౌకర్యాలను కూడా ప్రభుత్వం కల్పించనుంది. ప్రయాణికుల భద్రతకు పెద్దపీట వేస్తూ, రియల్ టైమ్ ట్రాకింగ్ మరియు అత్యవసర సహాయక ఫీచర్లను ఈ యాప్‌లో పొందుపరిచారు. జనవరి 5 నుంచి కొన్ని నగరాల్లో పైలట్ ప్రాజెక్ట్‌గా ప్రారంభమైన ఈ సేవలు ఘనవిజయం సాధించడంతో, ఇప్పుడు విస్తరణకు శ్రీకారం చుట్టారు.




# అధికార పార్టీకి అంతర్గత ముప్పు

ముద్ర, తెలంగాణ బ్యూరో:

రాష్ట్రంలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీకి రెబల్ కంటకం పెను సవాలుగా మారింది. సర్పంచ్ ఎన్నికల్లో జరిగిన తప్పే జరుగుతున్న సూచనలు కనిపిస్తున్నాయి.ఈ మున్సిపల్ ఎన్నికలు అధికార కాంగ్రెస్ పార్టీలో అలజడికి కారణం అవుతున్నాయి. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత గెలుపు గుర్రాలుగా భావించి ఇతర పార్టీల నుండి పెద్ద ఎత్తున నాయకులను చేర్చుకోవడం, పాత క్యాడర్, కొత్తగా వచ్చిన వారి మధ్య సమన్వయం లోపించడం ఇప్పుడు పార్టీకి శాపంగా మారింది. టికెట్ ఆశించి భంగపడ్డ ఆశావాహులు పెద్ద సంఖ్యలో స్వతంత్రులుగా బరిలో నిలవడం, కొన్ని చోట్ల బీ–ఫామ్ దక్కని వారు తిరుగుబాటు అభ్యర్థులుగా ప్రచారం ప్రారంభించడం పార్టీ హైకమాండ్‌కు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది.

**మంత్రులకు తలనొప్పి**

రాష్ట్రంలోని మున్సిపల్ ఎన్నికల్లో గెలుపు బాధ్యతలను మంత్రులపై వేశారు. రెబల్స్ ను బుజ్జగించడం నుంచి అభ్యర్థుల గెలుపు వరకు వీరిదే బాధ్యత. పార్టీ నుంచి వేసిన కొంతమందిని నామినేషన్ల సమయంలోనే బుజ్జగించారు. కానీ, కొంతమంది విన్నారు.. మరికొందరు పోటీలో నిలిచారు. పోటీలో ఉన్నవారితో పార్టీ అభ్యర్థులకు ఇబ్బందులు మొదలయ్యాయి. పార్టీ నేతలు రెండు వర్గాలుగా వీడిపోతున్నారు. దీంతో పార్టీ అభ్యర్థుల గెలుపు కష్టమవుతున్నట్లు అంచనా వేస్తున్నారు. దీనిపై మంత్రులు సమీక్షిస్తున్నా.. వారిని వారిస్తున్నా వినడం లేదు.

**పంచాయతీ ఎన్నికల్లోనూ ఇదే సమస్య**

ఇటీవలే ముగిసిన పంచాయతీ ఎన్నికల్లో రెబల్ అభ్యర్థుల వల్ల పార్టీకి జరిగిన నష్టంపై హైకమాండ్‌కు స్పష్టమైన నివేదిక అందింది. చాలా చోట్ల కాంగ్రెస్ మద్దతు ఉన్న అభ్యర్థుల కంటే, టికెట్ దక్కక రెబల్‌గా పోటీ చేసిన వారే విజయం సాధించారు. గత అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకుని ఈసారి అభ్యర్థుల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలని అధిష్ఠానం సూచించినప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. ఒకే వార్డులో ఇద్దరు ముగ్గురు కీలక నేతలు పోటీ పడటం, వారికి స్థానిక ఎమ్మెల్యేలు , మంత్రుల మద్దతు ఉండటం వల్ల సమస్య మరింత జటిలమైంది.

తమ వర్గం వారికే చాన్సిచ్చిన జిల్లా స్థాయి నేతలు పార్టీలోని వర్గ రాజకీయాలు కూడా రెబల్స్ పెరగడానికి ప్రధాన కారణం. జిల్లా స్థాయి నేతలు తమ వర్గానికి చెందిన వారికే టికెట్లు ఇప్పించుకోవాలనే పట్టుదలతో ఉండటం వల్ల, సమర్థులైన ద్వితీయ శ్రేణి నాయకత్వానికి అవకాశాలు రాలేదు. జగిత్యాల వంటి ప్రాంతాల్లో సీనియర్ నేత జీవన్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వర్గాల మధ్య టికెట్ల పంపిణీలో జరిగిన రగడ రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఇటువంటి విభేదాలు ఓట్ల చీలికకు దారితీసి, ప్రత్యర్థి పార్టీలైన బీజేపీ , బీఆర్ఎస్‌లకు అనూహ్యంగా లాభం చేకూర్చే అవకాశం ఉందని కాంగ్రెస్ నేతలు ఆందోళన చెందుతున్నారు.

**చివరి క్షణంలో తేలిన అభ్యర్థులు**

స్క్రీనింగ్ కమిటీల జాప్యం వల్ల ఆఖరి నిమిషం వరకు అభ్యర్థులపై స్పష్టత లేకపోవడంతో, నిరాశ చెందిన నేతలు ప్రత్యామ్నాయ దారులు వెతుక్కున్నారు. అధికారంలో ఉన్నాం కాబట్టి గెలుపు సులభం అనే ధీమాతో కొందరు నేతలు రెబల్స్‌ను బుజ్జగించడంలో నిర్లక్ష్యం వహించారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఫిబ్రవరి 3వ తేదీతో నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసినప్పటికీ, ఇంకా అనేక వార్డుల్లో రెబల్స్ బరిలో ఉన్నారు. మరి ఈ 'రెబల్' సమస్యను అధిగమించి కాంగ్రెస్ ఆశించిన స్థాయిలో మున్సిపాలిటీలను కైవసం చేసుకుంటుందో చూడాల్సి ఉంది. హోరాహోరీగా సాగుతున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ కు ఇతర పార్టీలతో పాటు రెబల్స్ కూడా పెద్ద సమస్యగా మారారు.

## రేవంత్ పాలనలో 'స్కాం క్యాలెండర్'

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

సీఎం రేవంత్ రెడ్డి పాలనలో జాబ్ క్యాలెండర్ కాదు, నెలకో స్కామ్‌తో 'స్కాం క్యాలెండర్' అమలవుతోందని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు విమర్శించారు. తెలంగాణ భవన్‌లో



మీడియాతో మాట్లాడుతూ, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు కాకుండా వరుస కుంభకోణాలు వెలుగుచూస్తున్నాయని ఆరోపించారు.

అమెరికా పర్యటన తర్వాత సీఎం చేసిన వ్యాఖ్యలు సభ్యసమాజం ఛీకొట్టేలా ఉన్నాయని, సీఎం హోదాకు తగని వికృత భాష ప్రజలను ఆవేదనకు గురిచేస్తోందన్నారు. తెలంగాణ సాధనలో కీలక పాత్ర పోషించిన కేసీఆర్ను తక్కువ చేయడం ద్వారా రాష్ట్ర ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నారని పేర్కొన్నారు.

దావోస్ పర్యటనతో వచ్చిన పెట్టుబడులు, ఉద్యోగాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదని, రుణమాఫీ పూర్తి చేశామన్న మాటలు కూడా నిరూపించలేదని హరీశ్‌రావు ప్రశ్నించారు. కుంభకోణాలపై ప్రశ్నిస్తే డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని, ప్రజలే తగిన సమయంలో సమా ధానం చెబుతారని హెచ్చరించారు.

## సాగు నీటి సంఘాలు చేసే పనులకు
# జీఎస్టీ మినహాయింపు

**ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు**

**అమరావతి, ఫిబ్రవరి 5:**

ప్రతి ఎకరాకు సాగునీరు అందేలా సాగునీటి సంఘాలు కృషి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. సాగునీటి సంఘాలు చేపట్టే పనులకు జీఎస్టీ మినహాయింపు ఇస్తామని ఆయన హామీ ఇచ్చారు. అమరావతిలోని పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన 'నీరు–ప్రగతి, జల హారతి' సాగునీటి సంఘాల భాగస్వామ్య కార్యక్రమంలో సీఎం పాల్గొని ప్రసంగించారు. నీరు మన జీవన విధానంలో అత్యంత కీలకమని, ఒకప్పుడు రాయలసీమలో ఊట కాల్వల ద్వారా సమృద్ధిగా సాగునీరు ఉండేదని గుర్తుచేశారు. కాలక్రమంలో నీటి వనరులపై నిర్లక్ష్యం కారణంగా సమస్యలు వచ్చాయని తెలిపారు. రాయలసీమను ఎడారిగా కాకుండా రతనాల సీమగా మార్చాలనే లక్ష్యంతో ఎన్టీఆర్ సాగునీటి ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారని, హంద్రీనీవా, గాలేరు–నగరి, తెలుగు గంగ వంటి ప్రాజెక్టులు అందుకు నిదర్శనమన్నారు.

దేశంలోనే తక్కువ వర్షపాతం ఉన్న అనంతపురం జిల్లా నేడు పండ్ల తోటల వనంగా మారిందంటే అది ప్రభుత్వ దూరదృష్టి ఫలితమని సీఎం పేర్కొన్నారు. భూగర్భ జలాల పెంపు కోసం లక్షలాది ఇంకుడు గుంతలు తవ్వామని, మైక్రో ఇరిగేషన్‌కు 90 శాతం సబ్సిడీ ఇచ్చి ఉద్యానవనాలను ప్రోత్సహించామని తెలిపారు. నీటిని సమర్థంగా వినియోగిస్తే కరువు అనే మాటే ఉండదన్నారు. సాగునీటి సంఘాల పనితీరు క్షేత్రస్థాయిలో మెరుగ్గా ఉందని సీఎం ప్రశంసించారు. గత ప్రభుత్వంలో సాగునీటి సంఘాలు నిర్లక్ష్యానికి గురయ్యాయని, పెండింగ్ బిల్లులను ప్రస్తుత ప్రభుత్వం క్లియర్ చేసిందన్నారు. ఇటీవల నీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికలు నిర్వహించామని, ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.344 కోట్లతో వేలాది ఆపరేషన్ అండ్ మేనేజ్‌మెంట్ పనులు చేపట్టామని వివరించారు. సాగునీటి సంఘాలు చేసే పనులకు జీఎస్టీ మినహాయింపుతో పాటు, నామినేషన్ పద్ధతిలో పనుల పరిమితిని రూ.10 లక్షలకు పెంచినట్లు తెలిపారు.



పోలవరం ప్రాజెక్టును 2027 జూన్‌కు ముందే పూర్తి చేస్తామని, నదుల అనుసంధానంతో ప్రతి ఎకరాకు నీరు అందించడమే నిజమైన జల హారతిగా అభివర్ణించారు. రాయలసీమ ఎత్తిపోతల పేరుతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
06.02.2026 శుక్రవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**దేశంలోని టాప్ 10 రాజకీయ పార్టీలు**

ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ : స్వాతంత్ర్య ఉద్యమ వారసత్వం కలిగిన పార్టీ; లౌకికత్వం, సంక్షేమమే కేంద్రబిందువు.

# మూడు ముక్కలు..

- త్వరలోనే మూడు విభాగాలుగా గ్రేటర్
- హైదరాబాద్ సహా కొత్తగా శేరిలింగంపల్లి, మల్కాజిగిరి
- త్వరలోనే ఉత్తర్వులు

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**




మరికొన్ని రోజుల్లో జీహెచ్ఎంసీ మూడు ముక్కలుగా మారనుంది. ప్రస్తుత గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పాలకమండలి గడువు ఫిబ్రవరి 10తో ముగియనుంది. ఈ నేపథ్యంలో అదే రోజున జీహెచ్ఎంసీని మూడు భాగాలుగా విభజిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. పరిపాలనను మరింత సమర్థవంతంగా నిర్వహించాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. నగరాన్ని హైదరాబాద్, శేరిలింగంపల్లి, మల్కాజిగిరి అనే మూడు ప్రత్యేక మున్సిపల్ కార్పొరేషన్లుగా విభజించేందుకు ప్రభుత్వం సన్నాహాలు పూర్తి చేసినట్లు విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి.
ఒకే సంస్థ గత కొన్ని సంవత్సరాలుగా వేగంగా విస్తరిస్తున్న హైదరాబాద్ నగరం జనాభా పెరుగుదలతో పాటు నివాస ప్రాంతాలు, వాణిజ్య కేంద్రాలు, ఐటీ హబ్‌లు విస్తృతంగా అభివృద్ధి చెందుతున్నాయి. ఈ పరిస్థితులకు అనుగుణంగా నగర పరిపాలనలో మార్పులు అవసరమన్న అభిప్రాయం ప్రభుత్వ స్థాయిలో బలపడింది. ఈ క్రమంలో ఔటర్ రింగ్ రోడ్ పరిధిలో ఉన్న 27 మున్సిపాలిటీలను ఇప్పటికే జీహెచ్ఎంసీలో విలీనం చేశారు. ఈ చర్యతో ఒక దశలో జీహెచ్ఎంసీ దేశంలోనే అతిపెద్ద మున్సిపల్ కార్పొరేషన్‌గా మారే పరిస్థితి ఏర్పడింది. అయితే విస్తారమైన పరిధిని ఒకే సంస్థ ద్వారా సమర్థంగా నిర్వహించడం సవాలుగా మారడంతో విభజనపై ప్రభుత్వం దృష్టి పెట్టింది.
పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పన, వేగవంతమైన నిర్ణయాలు, పారదర్శక పరిపాలన సాధించడమే ప్రధాన లక్ష్యంగా జీహెచ్ఎంసీని మూడు కార్పొరేషన్లుగా విభజించాలనే ఆలోచనకు ప్రభుత్వం వచ్చింది. ఈ మార్పు ద్వారా ప్రతి ప్రాంతంపై ప్రత్యేక దృష్టి పెట్టే అవకాశం కలుగుతుందని అధికారులు భావిస్తున్నారు. పాలకమండలి గడువు ముగియనున్న ఫిబ్రవరి 10నే ఈ విభజనకు సంబంధించిన ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉండటంతో ఆ తేదీకి ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది.
ఇటీవల తెలంగాణ ప్రభుత్వం రాజధాని పరిధిలోని పోలీసు కమిషనరేట్లను పునర్వ్యవస్థీకరించిన విషయం తెలిసిందే. అదే నమూనాలో మున్సిపల్ పరిధిని కూడా తిరిగి క్రమబద్ధీకరించాలని ప్రభుత్వం భావిస్తోంది. హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కమిషనరేట్లతో పాటు కొత్తగా ప్రతిపాదిత ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ భౌగోళిక సరిహద్దులకు అనుగుణంగా కొత్త కార్పొరేషన్ల రూపకల్పన జరుగనుందని సమాచారం. ఈ విధానం వల్ల పోలీసు పరిపాలనకు మున్సిపల్ పరిపాలనకు మధ్య సమన్వయం మెరుగుపడే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

**కొత్తగా కొన్ని ప్రాంతాలు**

విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం హైదరాబాద్ కార్పొరేషన్ పరిధిలో కోర్ సిటీ ప్రాంతాలు, హైదరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని ప్రధాన ప్రాంతాలు చేరనున్నాయి. శేరిలింగంపల్లి పేరుతో ఏర్పడే కొత్త కార్పొరేషన్ పరిధిలో ఐటీ హబ్ ప్రాంతాలు, సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని అభివృద్ధి చెందుతున్న కాలనీలు, ఫ్యూచర్ సిటీ ప్రాంతాలు ఉండనున్నట్లు తెలుస్తోంది. మరోవైపు మల్కాజిగిరి కార్పొరేషన్ పరిధిలో తూర్పు హైదరాబాద్ ప్రాంతాలు, మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలోని ప్రధాన నివాస ప్రాంతాలు చేర్చే అవకాశం ఉంది.
జీహెచ్ఎంసీ విభజనకు సంబంధించిన ఉత్తర్వులు వెలువడిన తరువాత ఆరు నెలల లోపు కొత్త కార్పొరేషన్లకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. అంటే ఆగస్టు 2026 నాటికి ఈ ఎన్నికలు జరగనున్న అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ మధ్యకాలంలో పరిపాలనకు ఎలాంటి అంతరాయం కలగకుండా ఉండేందుకు ప్రభుత్వం ముందుగానే చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో కీలక ఐఏఎస్ అధికారుల బదిలీలు ఇప్పటికే పూర్తయ్యాయి. ప్రస్తుత జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్‌తో పాటు అదనపు కమిషనర్లుగా సృజన, వినయ్ కృష్ణా రెడ్డి బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉందని సమాచారం. కొత్త కార్పొరేషన్ల ఏర్పాటుకు సంబంధించిన పరిపాలనా ఏర్పాట్లు పూర్తయ్యాక ఈ నియామకాలపై అధికారిక ఉత్తర్వులు వెలువడనున్నాయి. మొత్తంగా హైదరాబాద్ మహానగర పాలనలో ఈ విభజన ఓ కీలక మలుపుగా మారనుందని రాజకీయ, పరిపాలనా వర్గాలు విశ్లేషిస్తున్నాయి.




# నియామకాలు సక్రమమే..

- గ్రూప్–1కు గ్రీన్ సిగ్నల్
- సింగిల్ బెంచ్ స్టే ను కొట్టివేసిన డివిజన్ బెంచ్
- టీజీపీఎస్సీ నిర్వహించిన నియామకాలపై స్పష్టీకరణ
- అవకతవకలపై ఆధారాలు లేవని వ్యాఖ్య

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

రాష్ట్రంలో గ్రూప్1 ఉద్యోగాలపై గత కొంతకాలంగా కొనసాగుతున్న ఉత్కంఠకు ఎట్టకేలకు తెరపడింది. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు ఊరటనిస్తూ హైకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. గ్రూప్1 నియామకాలపై గతంలో హైకోర్టు సింగిల్ బెంచ్ విధించిన స్టే ను సీజే నేతృత్వంలోని డివిజన్ బెంచ్ గురువారం కొట్టివేసింది. ఈ పిటిషన్ విచారణ సందర్భంగా ఇరు పక్షాల వాదనలు విన్న కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. టీజీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్1 నియామకాలు సక్రమమేనని తేల్చి చెప్పింది. పరీక్ష పారదర్శకంగానే జరిగిందని స్పష్టం చేసింది. గ్రూప్ 1 పరీక్షలు నిర్వహణ, ఉద్యోగస్థుల ఎంపికలో అవకతవకలు జరిగినట్లుగా ఎలాంటి ఆధారాలు లభించలేదని చెప్పింది. ఈ తీర్పుతో రాష్ట్రంలో 562 మంది గ్రూప్1 అభ్యర్థులకు లైన్ క్లియర్ అయింది. త్వరలోనే వీరందరూ శిక్షణ, ఉద్యోగ బాధ్యతల్లో చేరేందుకు మార్గం సుగమమైంది. 2023 అక్టోబర్ 21 నుంచి 27 వరకు జరిగిన గ్రూప్1 మెయిన్స్ పరీక్షలకు 21 వేల మంది విద్యార్థులు హాజరయ్యారు. ఆ పరీక్షల ఫలితాలను టీజీపీఎస్సీ గతేడాది మార్చి 10న విడుదల చేసింది. ఈ ఫలితాల్లో అభ్యర్థులకు వచ్చిన మార్కులపై అనేక అనుమానాలు తలెత్తాయి. పరీక్షల్లో జెల్ పెన్నులు వాడటం, కోఠి మహిళా కాలేజీలో పరీక్ష రాసిన అభ్యర్థుల్లో ఎక్కువ మంది ఎంపిక కావడం, తెలుగు మీడియం అభ్యర్థులు తక్కువగా ఎంపిక కావడం, కేవలం 2 సెంటర్ల నుంచే టాపర్లు ఉండటం తదితర అంశాలపై పలువురు అభ్యర్థులు కోర్టును ఆశ్రయించారు. అదే సమయంలో ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు పరీక్షలు రద్దు చేయొద్దని కోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై గతంలోనే విచారణ జరిపిన సింగిల్ హైకోర్టు బెంచ్ ధర్మాసనం గ్రూప్1 ఫలితాలను రద్దు చేస్తూ అప్పట్లో సంచలన తీర్పు ఇచ్చింది. అంతేకాకుండా.. గ్రూప్స్ రాసిన అభ్యర్థుల జవాబు పత్రాలను తిరిగి మూల్యాంకనం చేయాలని ఆదేశించింది. అవసరమైతే పరీక్షను మళ్లీ నిర్వహించాలని ఆదేశిస్తూ ఆ నియామకాలపై స్టే విధించింది. దీంతో అప్పటికే ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సింగిల్ బెంచ్ తీర్పును సవాల్ చేశారు. హైకోర్టు డివిజన్ బెంచ్‌లో అప్పీల్ చేశారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని డివిజన్ బెంచ్ సింగిల్ బెంచ్ ఇచ్చిన స్టేను ఎత్తివేసింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ప్రభుత్వం వెంటనే ఎంపికైన 562 మంది అభ్యర్థులకు నియామక పత్రాలను కూడా అందజేసింది. ఈ నియామకాలు కోర్టు ఇచ్చే తుది తీర్పునకు లోబడి ఉంటాయని హైకోర్టు ధర్మాసనం అప్పుడే స్పష్టం చేసింది. తాజా తీర్పుతో గ్రూప్ 1 అర్హత సాధించిన ఉద్యోగులకు ఊరట లభించింది



## చంద్రహాస్ పై కేసు నమోదు

**ముద్ర, హైదరాబాద్:**

ప్రముఖ టీవీ సీరియల్ ఆర్టిస్ట్ ప్రభాకర్ కొడుకు చంద్రహాస్ హీరో గా తెరకెక్కిన చిత్రం 'బారాబర్ ప్రేమిస్తా' మూవీ ప్రీ రిలీజ్ ఫంక్షన్ లో పాడిన అసభ్యకరమైన పాట సోషల్ మీడియాలో ఎంతటి దుమారం రేపిందో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. రెగ్యులర్ గా బూతులు మాట్లాడే వాళ్ళు కూడా చెవులు మూసుకొని అసహ్యించుకునే పాట అది. సోషల్ మీడియాలో వస్తున్న ఈ తీవ్రమైన నెగెటివిటీని గమనించి, జనాలు నచ్చడం లేదనే విషయం తెలుసుకొని అయినా వెంటనే వీడియో బైట్ విడుదల చేస్తూ క్షమాపణలు చెప్పారని అంతా అనుకున్నారు.

# పంచాయతీలకు తీపి కబురు

- పెండింగ్ లో ఉన్న 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల
- తొలి విడతగా రూ.259.36 కోట్లు రిలీజ్

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**




రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. గత కొంత కాలంగా నిలిచిపోయిన 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేస్తూ కేంద్ర ఆర్థిక శాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు తొలి విడతగా రూ.259.36 కోట్లు కేటాయించింది. రాష్ట్రంలో గ్రామ పంచాయతీల గడువు ముగిసినప్పటికీ ఎన్నికల నిర్వహణలో జాప్యం జరగడంతో కేంద్రం నిధులను పూర్తిగా నిలిపివేసింది. అయితే ఇటీవల పంచాయతీ ఎన్నికలు విజయవంతంగా పూర్తి కావడంతో నిధుల విడుదలకు ఉన్న సాంకేతిక అడ్డంకులు తొలగిపోయాయి. ఈ నిధుల సాధనలో రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క... పంచాయతీ రాజ్ శాఖ ఉన్నతాధికారులతో కలిసి కేంద్ర ప్రభుత్వంతో నిత్యం సంప్రదింపులు జరిపించారు. మరోవైపు ఎన్నికల ప్రక్రియను పూర్తి కావడంతో ఈ నిధులు విడుదలయ్యాయి. రాష్ట్రానికి కేంద్రం ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు సుమారు రూ.3 వేల కోట్ల వరకు నిధులు అందాల్సి ఉంది. ఈ క్రమంలోనే విడతల వారీగా నిధుల విడుదల భాగంగా రూ.259.36 కోట్లు విడుదలయ్యాయి. తాజాగా విడుదలైన నిధులతో గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాలు ఇతర అత్యవసర అభివృద్ధి పనులకు వినియోగించనున్నారు.

# ప్రచారం కోసం పవన్ దగ్గర మోకరిల్లారు..

- తెలంగాణలో బీజేపీకి దిక్కులేదు
- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

**ముద్ర, నిజామాబాద్ :**



తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అంశంపై తాను చేసిన అనుచిత వ్యాఖ్యలపై వివరణ ఇచ్చిన తర్వాతే ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి రావాలని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. గతంలో తెలంగాణ గురించి పవన్ కల్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యల్ని ఈ ప్రాంత ప్రజలు మర్చిపోలేదన్నారు. ప్రజలు పవన్ కల్యాణ్ ను ఒక సినిమా నటుడిగా మాత్రమే ఆదరిస్తారన్న ఆయన తాను కూడా చిరంజీవి అభిమానిని అని అన్నారు. గురువారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఎన్నికల ప్రచారంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల ప్రచారం కోసం పవన్ కళ్యాణ్ దగ్గర మోకరిల్లాల్సిన పరిస్థితి బీజేపీకి ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. అసలు తెలంగాణలో బీజేపీకి దిక్కు లేదని చెప్పారు. బీజేపీ అధ్యక్షుడు అయినా నాయకులు అయినా కాళ్లకు బలుపు కట్టుకుని తిరిగితే ఓట్లు పడే పరిస్థితి లేదన్నారు. అందుకే పవన్ వద్దకు వెళ్లి మోకరిల్లారని అన్నారు.

# శ్వేత పత్రం విడుదల చేసే దమ్ముందా?

- కరీంనగర్ కు రూ.1400 కోట్లు విడుదల చేశానని చెప్పడం పెద్ద జోక్
- రేవంత్ రెడ్డి రెండేళ్ల పాలనలో నయాపైసా ఇయ్యలేదు
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

**ముద్ర, కరీంనగర్:**



కరీంనగర్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లలో రూ.1400 కోట్లు విడుదల చేసిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పడం పచ్చి అబద్ధమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆరోపించారు. సీఎం నిజంగా దమ్ముంటే ఆ నిధులు ఎప్పుడు విడుదలయ్యాయి? ఏయే అభివృద్ధి పనులకు ఖర్చు చేశారో వివరాలతో శ్వేత పత్రం విడుదల చేయాలని ఆయన సవాల్ విసిరారు.
రెండేళ్ల పాలనలో కరీంనగర్‌కు నయాపైసా ఇవ్వని ప్రభుత్వం ఇప్పుడు ఎన్నికలు దగ్గర పడటంతో అబద్ధాలు చెబుతోందని విమర్శించారు. కరీంనగర్-వరంగల్ పట్టణాలను జంట నగరాలుగా మారుస్తామని, డంపింగ్ యార్డును తరలిస్తామని సీఎం చెబుతుండటం పెద్ద జోక్‌లా ఉందని ఎద్దేవా చేశారు. డంపింగ్ యార్డు తరలింపుకు కేంద్రం నుంచి రూ.50 కోట్లు, చెత్త బయో మైనింగ్‌కు మరో రూ.18 కోట్లు మంజూరైనా ప్రత్యామ్నాయ స్థలం చూపకుండా కాంగ్రెస్ ప్రభుత్వమే అడ్డుకుంటోందని ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కరీంనగర్‌లో జరిగిన స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. 'కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలయ్యాయా? మహిళలకు రూ.2,500, అవ్వాతాతలకు రూ.4,000 పెన్షన్, నిరుద్యోగులకు రెండు లక్షల ఉద్యోగాలు ఎక్కడ?' అని ప్రశ్నించారు. తాను కరీంనగర్ కార్పొరేషన్ అభివృద్ధికి రూ.1,500 కోట్ల నిధులు తెచ్చానని, చేసిన పనుల వివరాలతో బుక్‌లెట్‌ను ఇంటింటికి పంపిస్తున్నామని తెలిపారు.
అవినీతి కేసుల్లో కేసీఆర్ కుటుంబాన్ని ఎందుకు అరెస్ట్ చేయడం లేదని సీఎం కేంద్రాన్ని నిందించడం విచిత్రమని అన్నారు. 'మా భుజం మీద తుపాకీ పెట్టి ఇతరులను కాల్చాలని చూస్తే మేం ఆ ట్రాప్‌లో పడం' అంటూ వ్యాఖ్యానించారు. అవసరమైతే కేటీఆర్ కుటుంబం వ్యవహారం తామే చూస్తామని హెచ్చరించారు. ఇదే సమయంలో మతం పేరుతో రెచ్చగొట్టి ఓట్లు దండుకోవాలని కొందరు ప్రయత్నిస్తున్నారని, కానీ తాను అభివృద్ధి పేరుతో ప్రజల ముందుకు వస్తున్నానని బండి సంజయ్ చెప్పారు. మున్సిపల్ ఎన్నికల అనంతరం ఇంటి పన్నులు, నల్లా ఛార్జీలు పెంపు తప్పదని హెచ్చరించారు. పొరపాటున కాంగ్రెస్‌కు ఓటేస్తే అభివృద్ధి ఆగిపోతుందని, ప్రజలు జాగ్రత్తగా నిర్ణయం తీసుకోవాలని కోరారు. కమలం లక్ష్మీదేవి పువ్వు, స్వస్తిక్ శుభ సూచికమని చెబుతూ, బ్యాలెట్ పేపర్‌పై స్వస్తిక్ గుర్తుకు ఓటు వేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# పూర్తిస్థాయి డీజీపీని నియమించండి

- యూపీఎస్సీ, రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశాలు
- హైకోర్టు తీర్పును సమర్థించిన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ బెంచ్

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



వచ్చే నాలుగు వారాల్లోగా రాష్ట్ర డీజీపీ నియామక ప్రక్రియ పూర్తి చేయాలని యూపీఎస్సీ, తెలంగాణ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. గత ఏప్రిల్‌లో తెలంగాణ ప్రభుత్వం పంపించిన ప్రతిపాదనలను పరిగణలోకి తీసుకోవాలని యూపీఎస్సీని ఆదేశించింది. గతేడాది డీజీపీగా బి.శివధర్ రెడ్డి నియామకం విషయంలో హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌పై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం గురువారం విచారణ జరిపింది. ఈ పిటీషన్ లో హైకోర్టు తీర్పును సమర్థించింది. ఈ క్రమంలో నాలుగు వారాల్లో పూర్తి స్థాయి డీజీపీ నియామక ప్రక్రియ పూర్తి చేయాలని యూపీఎస్సీకి, తెలంగాణ ప్రభుత్వానికి ఆదేశించింది. ఈ సందర్భంగా సీజేఐ సూర్యకాంత్ వ్యాఖ్యానిస్తూ ఈ విషయాన్ని సింగిల్ జడ్జి బెంచ్ ముందు ఎందుకు లిస్ట్ చేశారు? ఆయన ఆదేశంలో తప్పేమీ లేదు. కానీ సాధారణంగా ఇలాంటి అంశాలను సీనియర్ జడ్జి విచారించాలని మేము ఆశిస్తామని అన్నారు. ఇదీలావుంటే.. శివధర్ రెడ్డికి డీజీపీగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ గతేడాది సెప్టెంబరు 26న రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసింది. అయితే ఈ నియామకం చెల్లదని, సదరు జీవోను కొట్టేయాలంటూ హైదరాబాద్‌కు చెందిన టీ ధన గోపాలరావు గతేడాది అక్టోబరు 10న హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 'ప్రకాశ్‌సింగ్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసులో డీజీపీల నియామకంపై సుప్రీంకోర్టు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసిందని.. దాని ప్రకారం డీజీపీని తాత్కాలిక పద్ధతిలో నియమించడానికి వీల్లేదని పిటిషనర్ పేర్కొన్నారు. విచారణ జరిపిన హైకోర్టు డీజీపీగా శివధర్ రెడ్డి నియామకానికి సంబంధించిన జీవో కొట్టివేతకు నిరాకరించింది. కానీ డీజీపీ ఎంపిక ప్రక్రియను కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ ఆదేశాలను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీంతో సుప్రీం కోర్టు గురువారం కీలక ఉత్తర్వులు జారీ చేసింది.



# ఈవీఎం గోదాం తనిఖీ

**ముద్ర ప్రతినిధి, ఉమ్మడిరంగారెడ్డి జిల్లా :**

రాజేంద్రనగర్‌లోని ఈవీఎం గోదాంను జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు మయాంక్ మిట్టల్‌తో కలిసి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నారాయణరెడ్డి గురువారం సందర్శించారు. సాధారణ పరిశీలనలో భాగంగా క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహిస్తూ గోదాంలో అమలు చేస్తున్న భద్రతా చర్యలను పరిశీలించారు. ఈసందర్భంగా ఈవీఎం గోదాంను మూసివేసిన సీళ్లను తనిఖీ చేయడంతోపాటు బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వివిప్యాట్లు తదితర ఎన్నికల సామగ్రిని భద్రపరిచిన విధానాన్ని సమీక్షించారు. గోదాం వద్ద ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తు పరిస్థితిని కూడా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లా కలెక్టర్ వెంట రాజేంద్రనగర్ తహశీల్దార్, వేర్‌హౌస్ ఇన్‌చార్జి రాములు, ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
శుక్రవారం 06.02.2026



నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

## న_కలం

## డబ్బు, సంతోషం..
# రెండూ ఒకే రైల్లో ప్రయాణించవు



డబ్బు ఉంటే జీవితంలో అన్నీ దొరుకుతాయనే భావన చాలా మందిలో ఉంటుంది. తగినంత సంపాదన ఉంటే కష్టాలు తీరుతాయని, కోరికలు నెరవేరుతాయని, జీవితం సుఖంగా సాగుతుందని అనుకుంటారు. కానీ డబ్బు ఉన్నంత మాత్రాన సంతోషం కూడా తప్పనిసరిగా వస్తుందా? ఈ ప్రశ్నకు తాజాగా ప్రపంచ కుబేరుడే సమాధానం చెప్పాడు.

ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడిగా చరిత్ర సృష్టించిన ఎలన్ మస్క్ చేసిన ఓ వ్యాఖ్య ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో ఆయన చేసిన పోస్టు "డబ్బుతో సంతోషాన్ని కొనలేమని ఎవరు అన్నారో కానీ, వారు చెప్పింది అక్షరాలా నిజం" అనేక మందిని ఆలోచనలో పడేసింది. ఆ మాటలతో పాటు విచారంగా ఉన్న ఎమోజీని కూడా జత చేయడంతో, ఇంతటి సంపద ఉన్న వ్యక్తి నిజంగా సంతోషంగా లేడా? అన్న సందేహాలు మొదలయ్యాయి.

టెస్లా, స్పేస్ ఎక్స్ వంటి ప్రపంచ ప్రఖ్యాత సంస్థల అధినేత అయిన మస్క్, వందల బిలియన్ల డాలర్ల ఆస్తితో ప్రపంచంలోనే నంబర్ వన్ ధనికుడిగా నిలిచాడు. కేవలం ఐదేళ్ల వ్యవధిలోనే ఆయన సంపద అసాధారణంగా పెరిగింది. ఇంతటి సంపద, పేరు, శక్తి ఉన్నప్పటికీ సంతోషం దూరమైందని చెప్పడం చాలామందికి ఆశ్చర్యాన్ని కలిగించింది.

మస్క్ వ్యాఖ్యపై నెటిజన్ల స్పందనలు విభిన్నంగా ఉన్నాయి. కొందరు దీనిని తాత్వికంగా తీసుకుని "డబ్బు ఆనందాన్ని ఇవ్వదు, కానీ డబ్బు లేకపోతే వచ్చే బాధలు మాత్రం భయంకరంగా ఉంటాయి" అని అంటున్నారు. మరికొందరు వ్యంగ్యంగా స్పందిస్తూ, "అద్దె, అప్పులు, జీవన అవసరాల బాధలు లేనప్పుడు ఇలాంటి మాటలు చెప్పడం సులభం" అంటూ వ్యాఖ్యానిస్తున్నారు. ఇంకొందరు మాత్రం మస్క్ మాటల్లో జీవన సత్యం ఉందని అంగీకరిస్తున్నారు.

నిజానికి డబ్బు మనిషికి అవసరం. తిండి, గూడు, భద్రత, ఆరోగ్యం వంటి మౌలిక అవసరాలు తీరేందుకు అది తప్పనిసరి. కానీ డబ్బే జీవితం కాదు. మనసుకు ప్రశాంతత, సంబంధాల్లో తృప్తి, జీవితానికి అర్థం ఇవన్నీ డబ్బుతో మాత్రమే రాకపోవచ్చు. సంపద పెరిగిన కొద్దీ బాధ్యతలు, ఒత్తిడులు, ఒంటరితనం కూడా పెరిగే అవకాశముంది.

ఎలన్ మస్క్ వ్యాఖ్య మనకు ఒక విషయం స్పష్టంగా చెబుతోంది. డబ్బు ఒక సాధనం మాత్రమే, లక్ష్యం కాదు. నిజమైన సంతోషం కోసం సంపదతో పాటు మనసుకు నచ్చిన జీవితం, ఆరోగ్యం, బంధాలు, అర్థవంతమైన లక్ష్యాలు అవసరం. ప్రపంచ కుబేరుడి మాటలు, మనందరినీ **"మన జీవితంలో నిజంగా కావాల్సింది ఏమిటి?"** అనే ప్రశ్నను మళ్లీ వేసుకునేలా చేస్తున్నాయి.

## రాయలసీమలో
# ఉద్యమబాట పట్టనున్న వైసిపి




వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి బలమైన ప్రాంతం రాయలసీమ. ఆ పార్టీ ఆవిర్భావం నుంచి రాయలసీమ అండగా నిలుస్తూ వస్తోంది. కానీ మొన్నటి ఎన్నికల్లో మాత్రం దారుణంగా ఓడిపోయింది. కేవలం ఏడు చోట్ల మాత్రమే ఆ పార్టీ గెలిచింది. అది కూడా కడపలో నాలుగు సీట్లు, చిత్తూరులో రెండు చోట్ల మాత్రమే గెలవగలిగింది. అయితే రెడ్డి సామాజిక వర్గాన్ని దూరం చేసుకోవడం, అనుకున్న స్థాయిలో రాయలసీమను అభివృద్ధి చేయకపోవడం అంత వ్యతిరేకతకు కారణం అయ్యింది. అయితే రాయలసీమలో బలపడాలని జగన్మోహన్ రెడ్డి గట్టి ప్లాన్ తో ఉన్నారు. అందుకే ఇప్పుడు రాయలసీమలో ఉద్యమ బాట పట్టాలని నిర్ణయించారు.

రేవంత్ రెడ్డితో చంద్రబాబు రహస్య ఒప్పందం మూలంగా రాయలసీమ ఎత్తిపోతల పథకం నిలిపివేశారని సాక్షాత్ తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించడంతో ఇప్పుడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉద్యమ బాట పడుతోంది. అయితే దీనికి రాయలసీమ ప్రజలు ఎంతవరకు మద్దతు ఇస్తారో చూడాలి.వాస్తవానికి తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి రాయలసీమ ప్రాంతంలో ఆ పార్టీకి ఏకపక్ష విజయం దక్కలేదు. రాయలసీమ ప్రాంతంలో 52 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఎన్టీఆర్ హయాంలో సైతం ఆ పార్టీకి 25 నుంచి 30 స్థానాలు లోపు మాత్రమే లభించేవి. కాంగ్రెస్ పార్టీ ఎక్కువగా అక్కడ ప్రభావం చూపేది. ఆ పార్టీ తర్వాత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభావం అధికంగా కనిపించింది.

2014లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చింది. కానీ రాయలసీమలో మాత్రం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎక్కువ స్థానాలు గెలుచుకుంది. 2019లో అయితే మూడు స్థానాలు తప్పించి మిగతా 49 స్థానాలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఖాతాలో పడ్డాయి. అటువంటి చోట మొన్న తెలుగుదేశం కూటమి 45 స్థానాలను కైవసం చేసుకుంది. రాయలసీమ ప్రజలు దారుణంగా తిరస్కరించారు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని.రాయలసీమలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ దెబ్బ తినడానికి ప్రధాన కారణం రెడ్డి సామాజిక వర్గం. బీసీలను టార్గెట్ చేసుకున్న జగన్మోహన్ రెడ్డి రెడ్డి సామాజిక వర్గాన్ని పక్కన పెట్టారు. అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుంచి అక్కున చేర్చుకున్న రెడ్డి సామాజిక వర్గం దీనిని జీర్ణించుకోలేకపోయింది. అందుకే మొన్నటి ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నిలిచింది. దీంతో జగన్మోహన్ రెడ్డికి దారుణ పరాజయం తప్పలేదు.

అయితే ఇప్పుడు దాని నుంచి గుణపాటాలు నేర్చుకున్నారు జగన్మోహన్ రెడ్డి. రాయలసీమ ఎత్తిపోతల పథకం విషయంలో జరిగిన పరిణామాలను తనకు అనుకూలంగా మార్చుకోవాలని చూస్తున్నారు. అయితే రాయలసీమ ఎత్తిపోతల పథకం అనేది జగన్మోహన్ రెడ్డి హయాంలోనే నిలిచిపోయింది. దానికి సక్రమంగా అనుమతులు తీసుకోకపోవడంతో అప్పట్లో తెలంగాణ నుంచి అభ్యంతరాలు వచ్చాయి. దీంతో కేంద్రం అనుమతులు నిలిపివేసింది. కానీ ఇప్పుడు అదే ప్రాజెక్టును చంద్రబాబు నిలిపివేస్తారంటూ వైసీపీ ఆందోళనలు మొదలుపెట్టింది. ఈ అంశంతో బలపడాలని చూస్తున్నారు జగన్మోహన్ రెడ్డి రాయలసీమలో. అయితే కార్యక్రమానికి భారీగా జన సమీకరణ చేస్తున్నారు. తద్వారా రాయలసీమలో వైసిపి బలం తగ్గలేదని నిరూపించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ఇవి రాయలసీమలో పట్టు సాధించేందుకు ఎంతవరకు ఉపయోగపడతాయో చూడాలి.

- కనపర్తి రవి

# తెలంగాణకు నిరాశ మిగిల్చిన కేంద్ర బడ్జెట్!






2026-27 సంవత్సరానికి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 53.47 లక్షల కోట్లతో 2026-27 సంవత్సరానికి ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్లో తెలంగాణకు మళ్లీ మొండి చెయ్యి చూపించింది. రాష్ట్ర విభజన సందర్భంగా ఇచ్చిన హామీలను ఏ ఒక్కటైనా అమలు చేయాలనే ధ్యాసే లేదు. పాలమూరు -రంగారెడ్డి జాతీయ హోదా గురించి మాటైనా లేదు. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, గిరిజన యూనివర్సిటీ, ఖాజీపేట్ రైల్వే కోచ్ ఫ్యాక్టరీ హామీలను ఆటకెక్కించింది. కేంద్ర పథకాలు నిధుల కేటాయింపులు బిజెపి పాలిత రాష్ట్రాలకు పెద్దపీట వేసి.. తెలంగాణ రాష్ట్రానికి రావలసిన నిధులపై తీవ్ర వివక్షను ప్రదర్శించింది. అదేవిధంగా బిజెపి యేతర రాష్ట్రాలకు తీవ్ర వివక్షతను చూపిస్తూ సమాఖ్య సూత్రాలను తుంగలో తొక్కింది. మొత్తంగా ఈ బడ్జెట్ తీరుతెన్నులు చూస్తే కేటాయించిన వాటిలో కూడా దేనికి ఎంత కోత పెడతారో తెలియని స్థితి. పోనీ కార్పొరేట్ల రాయితీల్లో కోత పెట్టారా? దుర్భిని వేసి వెతికిన ఆనవాలు కనపడదు.

★ దశాబ్దాలుగా ఒక హక్కుగా ఉన్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి చట్టాన్ని దయాదాక్షి ణ్యాల మీద ఆధారపడిన ఒక పథకంగా మార్చేశారు. 125 రోజుల పని కల్పిస్తామని కొండంత రాగం తీశారు. అందుకు గాను రూ. 2.35 లక్షల కోట్లు కేటాయించాల్సి ఉండగా 95 వేలకోట్లతో మమ అనిపించారు. ఈ మొత్తం కూడా రాష్ట్రాలు అమలు జరిపితేనే ఖర్చవుతుంది తప్ప లేకుంటే తిరిగి వెనక్కే.

★బడ్జెట్ మూడు లక్ష్యాలతో ముందుకు వెళ్తున్నామని! ఉత్పాదకత ద్వారా దేశ ఆర్థిక వృద్ధి, సామర్థ్యాలను పెంచి అందరికీ ఆకాంక్షలు నెరవేర్చటం, వనరులు అవకాశాలను అందరికీ అందుబాటులోనికి తెచ్చి " సబ్ కాసాత్, సబ్ కా వికాస్" తేవటం అని కర్తవ్యముగా రూపొందించిన బడ్జెట్లో చెప్పారు. మోడీ అధికారానికి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు జిడిపిలో వస్తూ ఉత్పత్తి వాటా 16% నుంచి 13 శాతానికి దిగజారటం తప్ప పెరిగింది ఏమీ లేదు. ఇంతకాలం నుంచి మోడీ చెప్పిన నైపుణ్య వృద్ధి ఒక మేడిపండు, వేల కోట్ల రూపాయలను అక్రమార్కులకు కట్టబెట్టడం తప్ప సాధించింది ఏమీ లేదు.

ఈ దశాబ్ది కాలంలో సంపదల అసమానతలు దేశంలో ఎందుకు విపరీతంగా పెరిగినట్టు? అవకాశాలు అంబానీలు, ఆదాని, టాటా, బిర్లాల వంటి వారికి తప్ప సామాన్యులకు ఎక్కడ ఉన్నాయి.

★ బడ్జెట్ అంటేనే సంపదల సమాకుర్చుకోవడం.. పంపిణీ చేయడం. మోడీ బడ్జెట్ తీరు చూస్తే పేద, మధ్యతరగతులకు, కార్మిక, రైతులు, వ్యవసాయ కార్మికులు, యువతకు వరగ పెట్టింది లేదు.ఆదాయ పన్ను జోలికి వెళ్లకుండా..వేతన జీవులకు నిరాశే.. దక్కని ఆదాయ పన్ను ఊరట - పొదుపు-మదుపుల ఊసేలేని కేంద్ర బడ్జెట్ లెక్కలు.. ఉన్న సబ్సిడీలకు భారీగా కోత.. కేంద్ర బడ్జెట్ కాకి లెక్కల తోనే సరిపోయింది. తెలంగాణకు హై స్పీడ్ రైల్ కారిడార్ల ప్రకటన తప్ప వచ్చింది ఏమిలేదు.అభివృద్ధికి సంబంధించిన కొత్తగా ఒరిగిందేమీ లేదు. హక్కుగా వచ్చే పన్నుల వాటా, కేంద్ర ప్రయోజిత పథకాల మినహా అదనపు నిధులేవి కేటాయించలేదు.

### రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తులను పట్టించుకోని కేంద్రం

★ సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు అనేకసార్లు ప్రధాని మోడీని, కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్ర అవసరాలను వివరించారు. వివిధ ప్రాజెక్టుల కోసం రూ.1.46 లక్షల కోట్లు అవసరమని ప్రతిపాదనలు పంపారు. ఇందులో రూపాయి కూడా ఇవ్వలే. మూసీ, మెట్రో, ట్రిపుల్ ఆర్, ఎయిర్ పోర్టు ప్రాజెక్టులకు కేటాయింపుల్లేవ్. ఐఐఎం, నవోదయ విద్యాలయాల్లేవ్. సెమీ కండక్టర్ మిషన్ లో తెలంగాణను చేర్చాలని అభ్యర్థన కూడా తోచిపించారు. పరిశ్రమల స్థాపన, పీఎం మిత్ర పార్కులకు కేంద్రం చేయూతనివ్వలేదు. అలాగే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, విద్యాసంస్థల అభివృద్ధికి ఆర్థిక సహకారము అందించాలన్న ముఖ్యమంత్రి విజ్ఞప్తులను కేంద్రం పెడచ్చేవినా పెట్టింది. విద్యుత్, మైనింగ్ రంగాల్లోనూ కేంద్రం నుంచి తెలంగాణకు సహాయం అందలేదు. సింగరేణికి కొత్త బొగ్గు బ్లాక్ ల కేటాయింపు, పీఎం కుసుమ్ కింద సోలార్ పంపుసెట్ల కేటాయింపును పట్టించుకోలేదు. పీఎం ఆవాస్ యోజన కింద గ్రామీణ, పట్టణ ఇళ్లకు కేటాయింపులు నామమాత్రంగానే ఇచ్చింది.

దాదాపు 12 విభాగాలకు చెందిన 47 అంశాలపై రాష్ట్రం ఎన్నిసార్లు విన్నవించినా ఆయా ప్రాజెక్టులకు బడ్జెట్లో మోక్షం కలగలేదు.ఈఆర్థికసంవత్సరములో కనీసం రూ.50 వేల కోట్లు ఇవ్వాలని కోరినప్పటికీ కేంద్రం నుంచి ఒక్క పైసా కూడా అదనంగా రాలేదు. కాగా, సెంట్రల్లీ స్పాన్సర్డ్ స్కీం లో కేంద్ర ప్రభుత్వ వాటా కింద రాష్ట్రాలకు రూ. 5.48 లక్షల కోట్లు కేటాయించగా.. ఇందులో తెలంగాణకు రూ. 18 వేల కోట్ల నుంచి రూ. 20 వేలకోట్ల దాకా వస్తాయని అంచనా వేస్తున్నారు.

### ఆహారం, ఎరువులు, ఇంధనంపై సబ్సిడీలు 4.47 శాతం తగ్గింపు

ఆహారం, ఎరువులు, ఇందనంపై 2026-27 లో ప్రభుత్వ వార్షిక సబ్సిడీ వ్యయం రూ. 4, 10,495 కోట్లు( మైనస్ 4.47%)గా కేంద్ర బడ్జెట్లో అంచనా వేశారు. గత సంవత్సరం ఈ బడ్జెట్ పై సబ్సిడీ క్రింద రూ. 4,29,735 కోట్లు. ఆహార సబ్సిడీ క్రింద 2025-26 లో రూ. 2,28,154 కోట్లుకేటాయించగా, 2026-27 కు కేటాయించింది రూ. 2,27,629 కోట్లు మాత్రమే. గత సంవత్సరం పెట్రోలియం సబ్సిడీ కింద రూ. 15,121 కోట్లతో పోలిస్తే 2026-27 ఆర్థిక సంవత్సరంలో రూ.12,085 కోట్లకు తగ్గించింది.

ఈ బడ్జెట్ ప్రజల ఆకాంక్షలకు ప్రతిబింబమని.. ఈ బడ్జెట్ ఇండియా ను 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మారుస్తుందని, దేశంలోని 148 కోట్ల మంది ఆకాంక్షలకు ఈ అద్దం పడుతుందని, వికసిత్ భారత్ నిర్మాణానికి బలమైన పునాదని, క్యాఫిక్స్ అధిక వృద్ధిరేటు మధ్య సరైన సమభూతం పాటించిందని, ద్రవ్య లోటును తగ్గించడం, ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచడం దీని ప్రత్యేకతని, దేశాన్ని గ్లోబల్ డేటా సెంటర్ హబ్ గా మార్చేందుకు పన్ను రాయితులు ఇచ్చామని ప్రధాని నరేంద్ర మోడీ బడ్జెట్ను గొప్పగా చెప్పుకొచ్చారు.

★ ఈ బడ్జెట్ సామాన్యులను పట్టించుకోలేదని, యువతకు ఉద్యోగాలు లేవు.. తయారీ రంగం కుదిలవుతున్నది. ఫారన్ ఇన్వెస్టర్లు స్టాక్ మార్కెట్ నుంచి డబ్బులు తీసుకుపోతున్నారు. రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రపంచ దేశాలనుంచి సవాళ్లు ఎదురవుతున్నాయి. ఈ సంక్షోభాలను కేంద్రం పట్టించుకోలేదు. వీటికి బడ్జెట్లో ఎలాంటి పరిష్కారాలు చూపలేదు. సామాన్యుల సమస్యలను కేంద్రం విస్మరించిందని ప్రధాన ప్రతిపక్షాలు విమర్శలు వెల్లువెత్తు తున్నాయి.



- ఉజ్జిని రత్నాకర్ రావు
-9490952646
(సీనియర్ ట్రేడ్ యూనియన్ నాయకులు-ఏఐటీయూసీ)

# ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్న జీవనశైలి



పెరుగుతున్న జీవనశైలి వ్యాధులు అన్ని వయసుల ప్రజల జీవితం మీద ప్రభావితం చూపుతున్నాయి పాతధరం జీవనశైలిలో భౌతిక శ్రమ ఎక్కువగా ఉండేది కానీ ఆధునిక జీవనశైర్యలు శారీరక శ్రమ తక్కువగా అవుతుంది. దీని ప్రభావంగా ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయి ముఖ్యంగా మన దేశంలో అకాల మృత్యువులకు ఆర్య శాతం వరకు జీవనశైలి వ్యాధులే కారణమవుతున్నాయి ఆధునికత పేరుతో చెప్పి మన ఆరోగ్యాన్ని మనమే నాశనం చేసుకుంటున్నాం మన చేతుల చేత మన ఆరోగ్యాన్ని తుడిచిపెడుతున్నారు జీవనశైలి వ్యాధులలో ముఖ్యంగా గుండె జబ్బులు మధుమేహం అధిక రక్తపోటు లాంటి సమస్యలు అధికంగా ఉన్నాయి. ఫాస్ట్ ఫుడ్ శారీరక వ్యాయామం లోపం తినే విధానం ఒత్తిడి గల జీవనశైలి ఇవన్నీ ముఖ్య కారణాలు మహానగరాల్లో జీవించే ప్రజల్లో ఈ వ్యాధులు ఎక్కువగా కనిపిస్తున్నాయి 30 ఏళ్ల లోపు వారికి హార్ట్ ఎటాక్ వస్తుండడం కేవలం జీవనశైలిలో మార్పుల వల్ల జరుగుతుంది ఆహారం అలవాట్లలో మార్పు ఫిజికల్ యాక్టివిటీ లోపం ఒత్తిడి మరియు నిద్రలేమి వల్ల నానాటికి జీవన శైలి వ్యాధులు పెరుగుతున్నాయి ఆధునిక జీవనశైలిలో మానవుడు ఆరోగ్యాన్ని తాకట్టు పెడుతున్నాడు బిజీ షెడ్యూల్ ఆరోగ్యం పై నిర్లక్ష్యం వంటి వాటితోపాటు స్మార్ట్‌ఫోన్ వినియోగం కూడా ప్రభావం చూపుతుంది జీవనశైలి మార్పులు శరీర ఆరోగ్యమే కాకుండా మానసిక ఆరోగ్యాన్ని కూడా ప్రభావితం చేస్తున్న మానసిక ఆరోగ్యానికి పరిరక్షించే కొన్ని చిట్కాలు ముఖ్యమైనవి. రోజు ఒకే సమయానికి నిద్ర భోజనం కార్యాచరణ ఉండేలా జీవనశైలి సజావుగా ఉండాలి కనీసం 30 నిమిషాలు వ్యాయామం లేదా యోగ ప్రాణాయామం చేయడం మనశ్శాంతికి దోహదం చేస్తుంది. ధ్యానం మరియు శ్వాస నియంత్రణ తో ఒత్తిడిని తగ్గించుకోవచ్చు ఆహారంలో పండ్లు కూరగాయలు ఒమేగా తిరిగి వంటి వాటిని చేర్చాలి నిద్ర పరిపూర్ణం గా ఉండేలా చూసుకోవాలి ఏడు నుంచి 8 గంటలు అవసరం స్నేహితులు కుటుంబ సభ్యులు అనుబంధం కొనసాగించాలి సెల్ఫోన్ వినియోగాలను నియంత్రించాలి.

మనసు ఆరోగ్యంగా ఉండడమే కాకుండా జీవితం సంతృప్తికరంగా మార్పు అవుతుంది. ప్రస్తుతం ఆధునిక జీవనశైలి మనిషిని పోయేంతరంగా మార్చేసింది పనుల ఒత్తిడి సమయపు దాగింపు సామాజిక వర్ధిల్లు అన్ని కలిసి వచ్చి మనుషులను కలవరం చేస్తున్నాయి నిత్యం పరుగులు పెట్టే జీవితంలో మనసుకు తృప్తి లేక శరీరానికి విశ్రాంతి లేకుండా పోతుంది ఈ ఒత్తిడితో శ్వాస కూడా భారంగా అనిపిస్తుంది ఒత్తిడి వల్ల మానవ సంబంధాలు దెబ్బతింటున్నాయి ఆరోగ్యం పాడవుతుంది ఆనందం దూరమవుతుంది ఆర్థిక విజయాల కోసం కష్టపడుతూ మనిషి తన నిస్సారంగా మారుతున్నాడు భౌతిక విజయం కోసం పరిగెత్తే యుగంలో మనసుకు నయం కలిగించే ప్రశాంతత అరుదైపోతుంది ఈ పరిస్థితిలో మన మానసిక ఆరోగ్యాన్ని సంరక్షించుకోవడం అవసరం.

### మానసిక ప్రశాంతత అత్యవసరమైన ఔషధం.

ప్రజలు తమ జీవనశ్యాలని పునః పరిశీలించాలి రోజు క్రమంగా వ్యాయామం సమతుల్య ఆహారం సరైన నిద్ర మానసిక శాంతి కోసం యోగా ధ్యానం లాంటి కార్యక్రమాలు అనుసరించాలి ప్రభుత్వం ఆరోగ్యశాఖ ఈ విషయంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి అలాగే కుటుంబ సభ్యుల మందదు ప్రోత్సహం కూడా ఎంతో అవసరం ఈ నేపథ్యంలో ప్రజలందరూ తమ జీవన శైలిని మెరుగుపరుచుకునే కృషి చేయాల్సిన అవసరం ఉంది అప్పుడే ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణం సాధ్యమవుతుంది నవ్వు జాడలేని ముఖాలు నిరాశతో కూడిన కన్నులు ఇవే ఆధునిక జీవిత గుర్తులు ఈ బతుకు జట్కబండిలో ఏం కోల్పోయామో నెమ్మదిగా తెలుసుకుంటున్న కానీ చాలా ఆలస్యం అయిన తర్వాత ఒత్తిడిలో మునిగిపోయిన ఈ సమాజాన్ని ఓ కాసింత ప్రశాంతత ఇప్పుడు అత్యవసరమైన ఔషధం రోజు వాకింగ్ వెళదాం మిత్రులతో కబుర్లు చెప్పుదాం దగ్గరి మిత్రులు బంధువులతో కాసేపు మాట్లాడి వారి యోగ క్షేమాలు తెలుసుకుందాం ఒత్తిడి కి గురి కాకుండా చూసుకుందాం ఎప్పటి పనిని అప్పుడే చేద్దాం

- కామిడి సతీష్ రెడ్డి
జయశంకర్ భూపాల్ పల్లి జిల్లా,
9848445134

దేశంలోని టాప్ 10 రాజకీయ పార్టీలు
ఆమ్ ఆద్మీ పార్టీ : అవినీతి వ్యతిరేక ఉద్యమం నుంచి పుట్టిన పార్టీ; విద్య, ఆరోగ్యం ప్రధాన ఫోకస్.

# రైతుల భూములకు కచ్చితమైన హద్దులు

- **భూ ఆధార్ కోసం రీ సర్వే ప్రారంభం : కలెక్టర్ సిక్తా పట్నాయక్**

**ముద్ర, నారాయణపేట :**




భూములకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కచ్చితమైన హద్దులు, నిర్దిష్టమైన కొలతలు నిర్ణయించి రైతులకు భూ ఆధార్ అందించేందుకు ప్రభుత్వం భూముల రీ సర్వే చేపట్టిందని కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. ఇప్పటివరకు గ్రామ పటాలు లేని సమస్యాత్మక గ్రామాలను గుర్తించి రీ సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆధునిక సాంకేతిక పరికరాలతో భూముల సరిహద్దులు, కమతాలకు స్పష్టమైన కొలతలు నిర్ధారిస్తామని తెలిపారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలో గుర్తించిన మూడు గ్రామాల్లో రీ సర్వే నిర్వహణకు సంబంధించి ఏడీ సర్వే ల్యాండ్, తహసీల్దార్లు, సర్వేయర్లతో కలెక్టర్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భూ వివాదాలు పెరుగుతున్న నేపథ్యంలో రైతుల భూములకు ఖచ్చితమైన కొలతలు చేసి భూ ఆధార్ ఇవ్వడం ద్వారా సమస్యలకు చెక్ పెట్టవచ్చని ప్రభుత్వం ఈ రీ సర్వేను ప్రారంభించిందని తెలిపారు. రీ సర్వేలో భాగంగా నారాయణపేట మండలంలోని శేర్నపల్లి, నర్వ మండలంలోని జంగం రెడ్డిపల్లి, కొత్తపల్లి గ్రామాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. శేర్నపల్లిలో 1,567 ఎకరాలు, జంగం రెడ్డిపల్లిలో 1,500 ఎకరాలు, కొత్తపల్లిలో 1,167 ఎకరాల విస్తీర్ణంలో రీ సర్వే చేపట్టి గ్రామాల సరిహద్దులు, శివార్లు, ప్రభుత్వ భూములు, రహదారులు, భవనాలు, అటవీ, దేవాదాయ, శిఖం భూములను గుర్తించి పూర్తి స్థాయి మ్యాపులు రూపొందించాల్సి ఉంటుందన్నారు. రీ సర్వే ప్రారంభానికి ముందు ఆయా గ్రామాల్లో టామ్‌టామ్ వేయించి, గ్రామ సభలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలని, పంచాయతీ కార్యాలయాల్లో పట్టాదారుల వివరాలు ప్రదర్శించాలని సూచించారు. శుక్రవారం నుంచి ఎంపిక చేసిన గ్రామాల్లో రీ సర్వే ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

## తిరుమల్ నగర్‌లో కమ్యూనిటీ హాల్ ప్రారంభం

**ముద్ర, మల్కాజిగిరి :**

ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని తిరుమల్ నగర్‌లో రూ. 35లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను కార్పొరేటర్ వై. ప్రేమ్ కుమార్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులన్నింటినీ దశలవారీగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు కమ్యూనిటీ హాల్‌కు మొదటి అంతస్తు ఏర్పాటు చేయాలని కోరగా, కార్పొరేటర్ సంబంధిత అధికారులకు ఫోన్ చేసి వెంటనే ప్రతిపాదన సిద్ధం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తిరుమల్ నగర్ కాలనీ అసోసియేషన్ సభ్యుడు నర్సింగ్ రావు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బాబు తదితరులు పాల్గొన్నారు.



## 'కాంగ్రెస్ వైఫల్యానికి మున్సిపల్ ఎన్నికల్లో గుణపాఠం తప్పదు'

**తాండూరు, ముద్ర :**

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి మున్సిపల్ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని బీఆర్‌ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం తాండూరు పట్టణంలోని తన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన బీఆర్‌ఎస్ మున్సిపల్ ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేశారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్న సమయంలో పార్టీలకతీతంగా ప్రతి వార్డుకు అభివృద్ధి పనుల కోసం రూ. కోటి నిధులు మంజూరు చేయడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. ఈ మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకి ప్రజలు మద్దతు తెలపితే అంతకు రెట్టింపు అభివృద్ధి చేసి చూపిస్తామని హామీ ఇచ్చారు. ప్రతి వార్డులో రహదారులు, త్రాగునీరు, వీధిదీపాలు, మురుగునీటి వ్యవస్థలను మెరుగుపరచడంతో పాటు స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. పట్టణాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే బీఆర్‌ఎస్ లక్ష్యమని స్పష్టం చేశారు. మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డులకు చెందిన యువకులు రోహిత్ రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్లో చేరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎన్నికల ఇంచార్జ్ శ్రీశైల్ రెడ్డి, మాజీ గ్రంథాలయ చైర్మన్ రాజు గౌడ్, మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి పట్లోళ్ల నర్సింలు, సీనియర్ నాయకులు సంపత్ డాక్టర్, శ్రీనివాస్ చారి, నరేందర్ గౌడ్, సలీం, మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్, విజయ్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోవాలి

- **అదనపు ఎస్పీ రాములు నాయక్**

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**




మునిసిపల్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలనే లక్ష్యంతో ఎస్పీ స్నేహ మెహ్రా ఆదేశాల మేరకు జిల్లా అదనపు ఎస్పీ బి.రాములు నాయక్ పోలీసు అధికారులు, సిబ్బందికి ఆన్‌లైన్ ద్వారా ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణలో ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు విధి నిర్వహణలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రధానంగా పోలింగ్ కేంద్రాల వద్ద పాటించాల్సిన డూస్ అండ్ డోంట్స్, ఎన్నికల నియమావళి ప్రకారం 100, 200 మీటర్ల పరిధిలో నిబంధనలను కట్టుదిట్టంగా అమలు చేయడం, అనధికార వ్యక్తుల ప్రవేశాన్ని నిరోధించడం, నిబంధనల ఉల్లంఘన జరిగితే తక్షణమే తీసుకోవాల్సిన చర్యలపై స్పష్టమైన అవగాహన కల్పించారు. ఎన్నికల సమయంలో ఎన్ఫోర్స్‌మెంట్ చర్యలు, అక్రమంగా నగదు, మద్యం తదితర ప్రలోభకర వస్తువుల తరలింపును అరికట్టేందుకు వాహన తనిఖీలు, నగదు స్వాధీనం (క్యాష్ సీజ్) ప్రక్రియలను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. అలాగే ఎన్నికల నిర్వహణలో వర్తించే ముఖ్యమైన చట్ట విభాగాలు (సెక్షన్లు), మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ నిబంధనలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ ఆన్‌లైన్ ఓరియంటేషన్ శిక్షణ ద్వారా క్షేత్రస్థాయి పోలీసు అధికారులు, సిబ్బందిలో ఎన్నికల నిర్వహణపై ఉన్న సందేహాలు నివృత్తి చేసి వారిని పూర్తిస్థాయిలో ఎన్నికల విధులకు సిద్ధం చేసినట్లు అదనపు ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీటీసీ డీఎస్పీ శ్రీనివాసులు, డీఎస్పీ జానయ్య, వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, పరిగి డీఎస్పీ శ్రీనివాస్, తాండూర్ డీఎస్పీ యాదయ్య, సీఐలు, ఎస్ఐలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



## డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపుల్లో జాప్యంపై ఆందోళన

- **ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించిన ఎంపీ ఈటల రాజేందర్**

**ముద్ర, మల్కాజిగిరి :**

మారేడుపల్లిలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపుల ఆలస్యాన్ని నిరసిస్తూ నిర్వహించిన ధర్నాలో ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొని ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఏడాదిన్నర క్రితమే నిర్మాణం పూర్తైన ఇళ్లను ఇప్పటికీ పేదలకు కేటాయించలేకపోతున్న ప్రభుత్వ వైఫల్యంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఒక ఎంపీగా ఈ పని చేయించలేకపోయినందుకు సిగ్గుతో తలదించుకుంటున్నా" అంటూ తన ఆవేదనను వ్యక్తం చేశారు. 2017లోనే ఇళ్ల నిర్మాణం పూర్తయినప్పటికీ కేటాయింపులు జరగకపోవడాన్ని ఈటల ప్రశ్నించారు. ఈ విషయమై కలెక్టర్, శాఖ మంత్రి, ఇన్‌చార్జ్ మంత్రి వరకు విన్నవించినా ఎలాంటి ఫలితం లేకపోయిందన్నారు. కేంద్రం అందిస్తున్న నిధులతో ఇళ్లు నిర్మించినప్పటికీ కనీస సదుపాయాలు కల్పించకపోవడం పేదల పట్ల నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆరోపించారు. వెంటనే ఇళ్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నా మొండా మార్కెట్ డివిజన్ కార్పొరేటర్ కొణతం దీపికా నరేష్ ఆధ్వర్యంలో జరగగా, బీజేపీ నేతలు మల్లారెడ్డి, నర్మద మల్లికార్జున్, జితేందర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.



## రూ.17.33 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

**ముద్ర, శేరిలింగంపల్లి :**

శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలో రూ.17 కోట్ల 33లక్షల 80వేల రూపాయల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీ శంకుస్థాపనలు చేశారు. తారానగర్, రైల్ విహార్, హుడా ట్రేడ్ సెంటర్, నల్లగండ్ల ఫ్లై ఓవర్ పరిసరాలు, సురభి కాలనీ, భాగ్యలక్ష్మి ఎనక్లేవ్, మారుతి నగర్, మాధవ హిల్స్, స్ప్రింగ్ వ్యాలీ, వుడ్‌ల్యాండ్ ప్రీమియర్, శిల్ప గార్డెన్, సెంట్రల్ పార్క్ ఫేజ్1, సెంట్రల్ పార్క్ ఫేజ్2, పెరల్ విలేజ్, క్యామెలెట్ లేఅవుట్, క్రాంతి వనం కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టనున్నారు. అలాగే ఆయా ప్రాంతాల్లో ఓపెన్ జిమ్, కమ్యూనిటీ హాల్, స్పోర్ట్స్ కాంప్లెక్స్, షటిల్, బ్యాడ్మింటన్ కోర్టులు, పార్కుల ప్రహరీల నిర్మాణ పనులు కూడా చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## 7వ వార్డులో కాంగ్రెస్ ప్రచార జోరు

**తాండూరు, ముద్ర :**



తాండూరు మున్సిపల్ పరిధిలోని 7వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి రొయ్యల నాగరాజ్ విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. విజయనగర్ కాలనీ, ఎన్టీఆర్ నగర్, రాయల్ కాంట కాలనీల్లో ఇంటింటా తిరుగుతూ ప్రతి గడపను పలకరించి ఓటర్లను చైతన్యపరిచారు. తనదైన శైలిలో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ విధానాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లొంకా నరసింహులు మాట్లాడుతూ అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి ఓటువేసి రొయ్యల నాగరాజ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే జరిగిన అభివృద్ధికి మించి రెట్టింపు అభివృద్ధి సాధించేందుకు అవకాశం కల్పించాలని కోరారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్తోనే పట్టణానికి సుస్థిర అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు, సర్పంచులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ బ్యాడ్మింటన్‌కు ఎంపికైన క్రీడాకారిణికి అభినందన

**ముద్ర, కాప్రా :**

ఈనెల 13 నుంచి 19వరకు ఇండోనేషియా దేశంలోని బాలీలో జరిగే ఇండోఇండోనేషియా బ్యాడ్మింటన్ సిరీస్‌కు భారత జట్టుకు ఎంపికైన డాక్టర్ ఏఎస్ రావు నగర్ డివిజన్‌కు చెందిన క్రీడాకారిణి దుగ్గిరాల భావన దేవిని ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి గురువారం సైనిక్‌పురిలోని తన స్వగృహంలో అభినందించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గానికి చెందిన క్రీడాకారిణి అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక కావడం గర్వకారణమన్నారు. భవిష్యత్తులో రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని, త్వరలో జరిగే అంతర్జాతీయ క్రీడా పోటీల్లో భారతదేశానికి బంగారు పతకం సాధించాలని ఆకాంక్షించారు. క్రీడలకు, క్రీడాకారులకు తన వంతు సహకారాన్ని ఎల్లవేళలా అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్‌గిరి బ్యాడ్మింటన్ సంఘం జాయింట్ సెక్రటరీ సూర్యనారాయణ పాల్గొన్నారు.

## 'కాంగ్రెస్ వైఫల్యాలకు ప్రజలే సమాధానం ఇవ్వాలి'

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**

మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 9, 13, 14 వార్డుల్లో నిర్వహించిన ప్రచారంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ హయాంలో చేపట్టిన అభివృద్ధిని కొనసాగించే సామర్థ్యం కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని విమర్శించారు. కళ్యాణ్ లక్ష్మి పథకంలో రూ.1,16,000తో పాటు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చి రెండేళ్లు గడిచినా అమలు చేయలేదన్నారు. మహిళలకు నెలకు రూ.2,500, గ్యాస్ సిలిండర్‌పై రూ.500 సబ్సిడీ, వికలాంగులకు రూ.6వేలు, వృద్ధులకు రూ.4వేలు అందిస్తామని చెప్పి ప్రజలను మోసం చేసిన పార్టీ కాంగ్రెస్ పార్టీనే అని ఆరోపించారు. గత పదేళ్లలో బీఆర్‌ఎస్ చేసిన అభివృద్ధి, గత రెండేళ్లలో కాంగ్రెస్ పాలన వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు అందరికీ స్పష్టంగా కనిపిస్తున్నాయన్నారు. అందుకే ప్రజలు కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్‌ఎస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ పట్టణ బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలి

**ముద్ర, కాప్రా :**

తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో 12న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని యూనియన్ నాయకురాలు లత పిలుపునిచ్చారు. గురువారం మల్లాపూర్ యూపీహెచ్‌సీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా వర్కర్లతో కలిసి ఆరోగ్య కేంద్ర డాక్టర్‌కు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఈసందర్భంగా యూనియన్ నాయకురాలు లత, సీఐటీయూ మేడ్చల్ జిల్లా నాయకుడు ఉన్ని కృష్ణ మాట్లాడుతూ ఆశా వర్కర్లపై పనిభారం పెరుగుతున్నప్పటికీ తగిన వేతనం, ఉద్యోగ భద్రత లేకుండా పనిచేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజారోగ్య వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న ఆశా వర్కర్లకు కనీస హక్కులు కూడా కల్పించకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. ఆశా వర్కర్లకు నెలకు కనీస వేతనం రూ.26,000, పెన్షన్ రూ.10,000 మంజూరు చేయడంతోపాటు పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలన్నారు. ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ యూపీహెచ్‌సీ ఆశా వర్కర్స్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తోనే వికారాబాద్‌కు సుస్థిర అభివృద్ధి



**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**

వికారాబాద్ పురపాలక సంఘం ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ వార్డు అభ్యర్థులకు మద్దతుగా ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. 18, 19, 21, 29, 30 వార్డుల పరిధిలోని కన్యాలాల్ బాగ్, ఇందిరా నగర్, గరీబ్ నగర్, అంబేద్కర్ నగర్, బుడగ జంగాల కాలనీ, రామయ్య గూడ ప్రాంతాల్లో ఆయన ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్తోనే వికారాబాద్ మున్సిపాలిటీకి సమగ్ర అభివృద్ధి సాధ్యమని స్పష్టం చేశారు. పట్టణాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. అభివృద్ధి, సంక్షేమం కోసం కాంగ్రెస్ అభ్యర్థులకే ఓటు వేస్తామని కాలనీవాసులు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

దేశంలోని టాప్ 10 రాజకీయ పార్టీలు

తృణమూల్ కాంగ్రెస్

పశ్చిమ బెంగాల్‌లో శక్తివంతమైన పార్టీ. ప్రాంతీయ అస్తిత్వ రాజకీయాలకు గుర్తింపు.

# బీజేపీని గెలిపిస్తే రూ.500 కోట్లు తెస్తా..

- రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో మున్సిపాలిటీలకు ఇచ్చింది గాడిద గుడ్డే
- కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని మున్సిపాలిటీలకు వరదలా నిధులు తీసుకొస్తా
హుజూరాబాద్ రూపురేఖలు మారుస్త.. - కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్



**ముద్ర, కరీంనగర్:**
మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే రాష్ట్రానికి రూ.500 కోట్ల నిధులు తీసుకొస్తానని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికలైనందున కేంద్రం తాజాగా రూ.259 కోట్లు విడుదల చేసిందని తెలిపారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, తాను చొరవ తీసుకోవడం వల్లే నిధులు విడుదలయ్యాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో మున్సిపాలిటీలకు గాడిద గుడ్డు మాత్రమే ఇచ్చిందని ఎద్దేవా చేశారు. హుజూరాబాద్ మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని బీజేపీకి అప్పగిస్తే ఢిల్లీకి పోయి పెద్ద ఎత్తున నిధులు తీసుకొచ్చి హుజూరాబాద్ పట్టణం రూపురేఖలు మారుస్తానని హామీ ఇచ్చారు. హుజూరాబాద్ లో మినీ స్టేడియం నిర్మాణం కోసం కేంద్రం నుండి నిధులు తీసుకొచ్చినా కాంగ్రెస్ ప్రభుత్వం అడుగడుగునా ఆటంకాలు కల్పించడం వల్ల ఇబ్బందులు ఏర్పడ్డాయన్నారు. ఎన్నికలైన వెంటనే స్టేడియం నిర్మాణం పనులు మొదలుపెట్టేలా చర్యలు తీసుకుంటానని, ఎవరు అడ్డు వస్తారో చూస్తానని అన్నారు.
మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం హుజూరాబాద్ పట్టణంలో నిర్వహించిన బహిరంగ సభలో పాల్గొన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి క్రిష్ణారెడ్డి, ఎన్నికల ఇంఛార్జ్ ఎర్రం మహేశ్ సహా స్థానిక నేతలంతా సభకు హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ హుజూరాబాద్ పట్టణానికి పెద్ద ఎత్తున నిధులు తీసుకొచ్చినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం హుజూరాబాద్ అభివృద్ధి కోసం ఎన్ని నిధులిచ్చిందో, ఏయే అభివృద్ధి పనులు జరిగాయో పూర్తి వివరాలతో సహా బుక్ లెట్ ప్రింట్ చేయించి ఇంటింటికీ పంపుతున్నానని తెలిపారు. సీఎస్సార్, ఎంపీ లాడ్స్ నిధులతో కోట్ల రూపాయలు తీసుకొచ్చి హుజూరాబాద్ లో ఆసుపత్రికి మెడికల్ ఎక్విప్ మెంట్స్ ఇచ్చినట్లు వెల్లడించారు. వాటిని మెయింటెనెన్స్ చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానికే ఉంది. కానీ అక్కడ డాక్టర్లు, సిబ్బంది ఆశించిన స్థాయిలో లేరన్నారు. మాకు మోసాలు చేయడం రాదు. దొంగ హామీలివ్వడం చేతకాదు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మోసపు మాటలు నమ్మి మీరు మోసపోయారు. మంచి పాలన కోసం ఒక్కసారి బీజేపీకి అవకాశం ఇవ్వండి.. మీ నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని కేంద్ర మంత్రి బండి సంజయ్ తెలిపారు.

# బీఆర్ఎస్ పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదు

- గుడి పూజారులను.. పల్లకీ మోసిన బోయలను పట్టించుకోలేదు..
- ఓట్ల కోసం వచ్చే బీఆర్ఎస్ నేతల మాటల నమ్మద్దు..
- ధర్మపురి ఎన్నికల ప్రచార సభలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్..



**ముద్ర, జగిత్యాల:**
బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న 10 ఏళ్లలో ఏనాడు పేద ప్రజల సంక్షేమ పట్టించుకోలేదని, అర్హులైన పేదలకు ఒక్కరికి ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. గురువారం ధర్మపురి మున్సిపాలిటి పరిధిలోని 4వ వార్డు, 12వ వార్డుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్లో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో ధర్మపురి ఆలయంలో పని చేస్తున్న పూజారులను పట్టించుకోలేదని, దేవుని పల్లకీ మోసిన బోయలను పట్టించుకోలేదని మంత్రి విమర్శించారు. ధర్మపురి ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే ఆలయంలో పూజారుల సమస్యతో పాటు బోయలు, స్వీపర్ల సమస్యను పరిష్కరించానని మంత్రి తెలిపారు. గతం లో శ్రీలక్ష్మి నర్సింహస్వామి ఆల యం దేవాలయంలో నిర్వహిస్తే కొంత మందికి మాత్రమే కల్యాణం వీక్షించే అవకాశం ఉండేదని తాను ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత గోదావరి నది ఒడ్డున శ్రీలక్ష్మి నర్సింహస్వామి కల్యాణం నిర్వహించి లక్షల మంది ప్రజలు వీక్షించే విధంగా చేశామని మంత్రి గుర్తు చేశారు. ధర్మపురి లక్ష్మినర్సింహస్వామి ఆలయం కీర్తి శేషులు జువ్వాడి రత్నాకర్ రావు చేసిన అభివృద్ధి తప్ప బీఆర్ఎస్ ప్రభుత్వం చేసింది శూన్యమని మంత్రి పేర్కొన్నారు.
ఓట్ల కోసం వచ్చే బీఆర్ఎస్ నేతల మాయ మాటలు నమ్మవద్దని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఓటర్లకు పిలుపునిచ్చారు. మాటల మారాటీలు బీఆర్ఎస్ నాయకులు అని తప్పును పది సార్లు ఒప్పు అనే విధంగా ప్రజలను వాళ్ల నమ్మిస్తారని అన్నారు. బీఆర్ఎస్ మాటలు నమ్మితే మోసపోతామని, ఎవ్వరి ఏకష్టం వచ్చిన నేరుగా తనను సంప్రదించాలని ఓటర్లకు పిలుపునిచ్చారు.

**4వ వార్డు, 12వ వార్డులకు వరాల జల్లు**

ధర్మపురి మున్సిపాలిటి పరిధిలోని 4వ వార్డు, 12వ వార్డులపై మంత్రి అడ్లూరి వరాల జల్లు కురిపించారు. బోయ కులస్తులకు కమ్యూనిటి హాల్ నిర్మాణం చేస్తానని హామీ ఇచ్చారు. గంగా పుత్రులకు సంఘ భవన నిర్మా ణానికి కృషి చేస్తానని మంత్రి అడ్లూరి హామీ ఇచ్చారు. రెండు వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిస్తే 60 రోజుల్లో అధికారులను వెంట బెట్టుకొని వచ్చి డ్రైనేజీ, రోడ్ల సమస్యలను పరిష్కరిస్తానని మంత్రి పేర్కొన్నారు. రెండు వార్డుల్లో అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు అందజేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

## ఎమ్మెల్యే విజయరమణా రావు ఎన్నికల ప్రచారం



**ముద్ర, పెద్దపల్లి:** మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా పెద్దపల్లి మున్సిపల్ 23, 4 వ వార్డుల్లో స్థానిక కార్యకర్తలు నాయకులతో కలిసి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణా రావు ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా గడపగడపకు వెళ్తూ ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు తాండూరి శ్రీమాన్ నారాయణ, కొమ్ము సుధాకర్ గార్లను మెజారిటీ=తో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డుల ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వార్డు ఇంచార్జులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థులను గెలిపించండి

- రాష్ట్ర కన్వీనర్ అంబటి జోజిరెడ్డి




**ముద్ర, కరీంనగర్:** ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థులను గెలిపించాలని పార్టీ రాష్ట్ర కన్వీనర్ అంబటి జోజిరెడ్డి కోరారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ తన ఎన్నికల ప్రచారాన్ని కరీంనగర్ లో ప్రారంభించింది. ఈ కార్యక్రమానికి పార్టీ రాష్ట్ర కన్వీనర్ అంబటి జోజిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ తో కలసి 13వ డివిజన్ ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి పెంట స్వరూప సత్యం, 27 వ డివిజన్ శ్యామల కిరణ్ వెంట ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలుసుకుంటూ విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. సింహం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. ఈ సందర్భంగా జోజిరెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల ఆశించిన ఫలితాలను ఇవ్వడంలో పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. గత బీఆర్ఎస్ పాలనలో కరీంనగర్ స్మార్ట్ సిటీ పేరిట ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేశారని అన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు కూడా ప్రజావ్యతిరేకంగా ఉన్నాయని, ధరల పెరుగుదల, నిరుద్యోగం, ప్రజా రంగ సంస్థల ప్రైవేటీకరణ వల్ల సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ రెండు ప్రభుత్వాల విధానాల వల్ల ప్రజలు విసిగిపోయారని, ప్రజల సమస్యలపై నిజంగా పోరాడే పార్టీ ఫార్వర్డ్ బ్లాక్ మాత్రమేనని జోజిరెడ్డి స్పష్టం చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్, ముత్యాల విజయ్ కుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆధునిక పంటల సాగుతో రైతులకు ప్రయోజనం

- కలెక్టర్ అభిలాష అభినవ్




**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** రైతులకు ఆధునిక పంటల సాగుతో ప్రయోజనం ఉంటుందని, అధికారులు వారిని ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సూచిం చారు. వ్యవసాయ శాఖ అధికారులతో గురువారం జరిగిన సమీక్ష సమావేశంలో నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు వ్యవసాయం లాభసాటిగా మారేలా అధికారులు చేయూతనివ్వాలన్నారు. పంట మార్పిడి అలవాటు చేయాలని తెలిపారు. సహజ ఎరువుల వాడకం పెంచేలా కృషి చేయాలన్నారు. భూసార పరీక్షలు నిర్వహిస్తూ మోతాదుకు మించిన ఎరువుల వాడకం వల్ల కలిగే నష్టాలపై రైతుల్లో విస్తృత అవగాహన కల్పించాలని వివరించారు. క్షేత్ర స్థాయిలో మండల వ్యవసాయ అధికారులు ఎల్లప్పుడూ రైతులకు అందుబాటులో ఉండాలని చెప్పారు. జిల్లాలో ఆయిల్ పామ్ పంటల సాగు విస్తీర్ణం మరింత పెంచాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, ఎడిఎలు విద్యాసాగర్, శ్రీనివాస రాజు, సుజాత, వీణ, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో ఆదరించండి

- మంత్రి పొన్నం ప్రభాకర్

**ముద్ర, కరీంనగర్:**
కరీంనగర్ జిల్లా చొప్పదండిలో పలు అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాలకు మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. రూ.45.15 కోట్లతో కరీంనగర్ జిల్లా రామడుగులో అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటుకు శంకుస్థాపన, రూ.5 కోట్లతో కరీంనగర్ జిల్లా గంగాధర మండలం మధురానగర్ లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో అన్ని రంగాల్లో జిల్లాను ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సారథ్యంలో జిల్లాను అగ్రగామిగా ఉంచేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. తెలంగాణపై విషం చిమ్ముతున్న పవన్ కళ్యాణ్ తో తె లంగాణ బీజేపీ పొత్తు పెట్టుకొని ప్రజల్లోకి వస్తుందని, తెలంగాణ కళ్లు పడితే ఆంధ్రా కొబ్బరి చెట్లు ఎండిపోతున్నాయని పవన్ కళ్యాణ్ విమర్శించారని గుర్తు చేశారు. అటువంటి వ్యక్తులతో పొత్తు పెట్టుకున్న బీజేపీపై ప్రజలు ఆలోచన చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆశీర్వదించి మున్సి పల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని మంత్రి కోరారు.

## నిర్మల్ పురపాలికపై గులాబీ జండా ఎగరాలి

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**
నిర్మల్ మునిసిపాలిటీపై గులాబీ జండా ఎగిరేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. పట్టణంలోని 18, 19 వార్డుల్లో గడప గడపకు బీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ నిర్మల్ ను జిల్లాగా చేసిన గత ముఖ్యమంత్రి కేసీఆర్ ను గుర్తుపెట్టుకొని కారు గుర్తుపై ఓటు వేసి కేసీఆర్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ నియోజకవర్గ ఇంచార్జి రాంకిషన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# అందరికీ న్యాయం చేస్తాం.. కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేయండి

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



**ముద్ర, కరీంనగర్:**
వివిధ డివిజన్లలో పార్టీ టికెట్ ఆశించి టికెట్ రాక పోవడంతో రెబల్స్ గా పోటీలో ఉన్న అభ్యర్థులు, నామినేషన్ వేసి ఉపసంహరించుకున్న నాయకులకు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని అందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో కరీంనగర్ లో మంత్రి శ్రీధర్ బాబు ను కలిసారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబుతో నాయకులు మాట్లాడుతూ కష్ట కాలంలో పార్టీ కోసం పని చేసినం మాకు పార్టీ టికెట్ రాకపోవడం బాధాకరమని అని అన్నారు. ఏదో విధంగా అందరికీ అవకాశం కల్పించి అందరికీ న్యాయం చేస్తామని పార్టీ నిర్ణయానికి కట్టుబడి పనిచేయాలని మీమీ డివిజన్లలో కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని పార్టీ అందరికీ న్యాయం చేస్తుందని శ్రీధర్ బాబు తెలిపారు. ఈ సమావేశంలో ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి, వివిధ డివిజన్ల నుండి నాయకులు షబానా మహమ్మద్, కుదురత్ ఉన్నీసా బేగం, ఖంరోద్దీన్, చర్ల పద్మ, గడమల్ల శ్రీనివాస్, ముల్కల కవిత, అస్థాపురం రమేష్, యనమల మంజుల, జిడి రమేష్, చాంద్ పాషా ఉప్పరి అజయ్, గంగుల దిలీప్, సుదర్శన్, హనీఫ్, యోనా తదితరులు పాల్గొన్నారు.

# మోసపూరిత బిజెపి బీఆర్ఎస్ లతో తస్మాత్ జాగ్రత్త..

కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు





**ముద్ర, కరీంనగర్:**
కార్పొరేషన్ ఎన్నికల సందర్భంగా మాయమాటలతో ముందుకు వస్తున్న మోసపూరిత బీఆర్ఎస్ బిజెపిలకు ప్రజలు గట్టి బుద్ధి చెప్పాలని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జ్ వెలిచాల రాజేందర్ రావు పిలుపునిచ్చారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. గురువారం రాత్రి కరీంనగర్లోని 21, 22, 48, 49వ డివిజన్ లో కార్పొరేటర్ అభ్యర్థులకు మద్దతుగా నిర్వహించిన కార్నర్ మీటింగులో రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి వెలిచాల రాజేందర్ రావు పాల్గొన్నారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి తోపాటు కార్పొరేటర్ అభ్యర్థులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**మానవత్వం చాటిన వెలిచాల రాజేందర్ రావు**

కరీంనగర్ జిల్లా గుమ్లాపూర్‌లో రేవంత్ రెడ్డి బహిరంగ సభకు హాజరైన కరీంనగర్ కాంగ్రెస్ పార్టీ 58వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి సర్దార్ ధన్నాసింగ్ గురువారం సాయంత్రం అకస్మాత్తుగా అస్వస్థతకు గురయ్యారు. విషయం గమనించిన కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్ రావు ఆయనను వెంటనే చొప్పదండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం అంబులెన్స్‌లో కరీంనగర్లోని మెడికవర్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ధన్నాసింగ్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కుటుంబ సభ్యులు రాజేందర్ రావుకు కృతజ్ఞతలు తెలిపారు.

## సుల్తానాబాద్ లో బీజేపీ అభ్యర్థి ప్రచారం



**ముద్ర, పెద్దపల్లి:**
సుల్తానాబాద్ మున్సిపాలిటీ 10వ వార్డు బిజెపి కౌన్సిలర్ అభ్యర్థి తుమ్మ రాజ్ కుమార్ గురువారం గాంధీ నగర్ మెయిన్ రోడ్డు లో ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమలం గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కోశాధికారి కామని రాజేంద్రప్రసాద్ బిజెపి నాయకులు మిట్టపల్లి సదానందం తుమ్మ నిశాంత్.. శ్రీరామ్.. రోహిత్. వెంకటేష్ పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
06.02.2026 శుక్రవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



దేశంలోని టాప్ 10 రాజకీయ పార్టీలు
బహుజన సమాజ్ పార్టీ : దళిత–బహుజన వర్గాల ప్రతినిధిగా ఎదిగిన పార్టీ.
BSP BAHUJAN SAMAJ PARTY TELANGANA



## బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం

**ముద్ర, పరకాల:**

తనపై నమ్మకం ఉంచి ఎనిమిదో వార్డు కౌన్సిలర్ గా గెలిపిస్తే వార్డును అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని 8 వ వార్డు బిఆర్ఎస్ అభ్యర్థి అడుప రాము వార్డు ప్రజలను కోరారు. గురువారం మాజీ ఎమ్మెల్యే చల్ల ధర్మారెడ్డి తో కలిసి ఆయన ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. గడిచిన ఐదు సంవత్సరాల కాలంలో వార్డు అభివృద్ధి కోసం పరకాల మున్సిపాలిటీ నుండి పెద్ద ఎత్తున నిధులు తెచ్చామన్నారు. గడిచిన ప్రభుత్వ కాలంలో మాజీ ఎమ్మెల్యే చల్ల ధర్మారెడ్డి సహాయ సహకారాలతో వార్డులో సిసి రోడ్ల నిర్మాణం మురుగు నీటి కాలువల నిర్మాణం చేయడం జరిగిందన్నారు. వార్డు ప్రజల సంక్షేమం దృష్ట్యా తను శక్తి వంచన లేకుండా పని చేస్తానన్నారు. తనపై నమ్మకంతో రెండోసారి మున్సిపాలిటీ కౌన్సిలర్ గా గెలిపించాలని ఆయన పెద్ద ఎత్తున ప్రచారాన్ని నిర్వహించారు.

# క్లీన్ స్వీప్ చేయాలి

- **మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**ముద్ర ప్రతినిధి, కోదాడ:**

ఈ మున్సిపాలిటీలో క్లీన్ స్వీప్ చేయాలని తెలంగాణ రాష్ట్ర ఆహార పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం కోదాడలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... ఈ నెల 11న జరగనున్న కోదాడ, హుజూర్ నగర్, నేరేడుచర్ల మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి అభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు. కోదాడ నియోజకవర్గం అభివృద్ధి కోసం తాను, తన సతీమణి ఎమ్మెల్యే పద్మావతి అహర్నిశలు కష్టపడుతున్నామని అన్నారు. కోదాడ పట్టణంలో రూ.26 కోట్ల నిధులతో 100 పడకల హాస్పిటల్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని, మోతే మండల ప్రజలు సాగునీటి కోసం దశాబ్దాలుగా



ఎదురు చూస్తున్న పాలేరు నుండి నీటిని తరలించడానికి రూ.300 కోట్లు ఖర్చు చేసి రైతుల కల నెరవేరుస్తున్నామని, కోదాడ పట్టణంలో 200 కోట్ల రూపాయలతో అండరగ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి ప్రణాళిక చేస్తున్నామని, 50 కోట్లతో కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న జవహర్ నవోదయ విద్యాలయాన్నీ బాలాజీనగర్ లో నిర్మాణం జరుగుతుందని, రూ.15 కోట్లతో రాష్ట్రంలో ఆదర్శవంతమైన బస్ స్టాండ్, బస్ డిపో లను కోదాడలో నిర్మిస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో గడచిన 10 ఏళ్ల బిఆర్ఎస్ పాలనలో ఒక్క కొత్త రేషన్ కార్డ్ ఇవ్వలేదని కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అర్హులైన ప్రతి పేదవాడికి కొత్త రేషన్ కార్డ్ ఇస్తున్నామని, రాబోయే రోజులలో అర్హులైన అందరికీ ఇందిరమ్మ ఇళ్లు కూడా ఇస్తామని అన్నారు. రాష్ట్ర ప్రజలకు కుటుంబ పాలన నుండి విముక్తి లభించిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజాపాలన లో ప్రజలు సంతోషంగా ఉన్నారని అన్నారు. బిఆర్ఎస్, బిజెపి, ఇతర పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులకు ఓటు వేస్తే అది చెత్తబుట్టలో వేసినట్లే అని అందుకోసం ఆలోచించి కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుపై ఓటు వెయ్యాలని పిలుపునిచ్చారు .



# మోసం కాంగ్రెస్ నైజం

- **టీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు తథ్యం**
- **ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్**

**ముద్ర, పరకాల:**

కాంగ్రెస్ పార్టీ డీఎన్ఏ లోనే మోసం ఉందని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. పరకాల మున్సిపాలిటీ ఎన్నికలలో భాగంగా బుధ, గురువారాలలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో స్థానిక మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తో కలిసి ప్రచారాన్ని నిర్వహించారు. 6, 7, 8, 9 వార్డులలో అభ్యర్థులతో కలిసి ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. అనంతరం కార్నర్ మీటింగ్లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. పరకాల మున్సిపాలిటీ ఎన్నికల్లో టిఆర్ఎస్ నిలబెట్టిన అభ్యర్థుల గెలుపు తథ్యమన్నారు. పరకాల మున్సిపాలిటీ ఎన్నికల్లో స్థానిక ఎమ్మెల్యే కు అదేవిధంగా కాంగ్రెస్ పార్టీకి ప్రభుత్వానికి గుణపాఠం చెప్పడానికి పరకాల ఓటర్లు సిద్ధంగా ఉన్నారని అన్నారు. పరకాల పట్టణంలోని అన్ని కాలనీలలో సిసి రోడ్లు మురుగు నీటి కాలువలు విద్యుత్ స్తంభాలు పారిశుద్ధ్య సమస్య ఇంటింటికి మిషన్ భగీరథ నీళ్లను పంపిణీ చేసిన ఘనత మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డికి చెందుతుంది అన్నారు. ఆరు మోసపూరిత వాగ్దానాలతో తెలంగాణ ప్రజలు మోసపోయారని రెండు సంవత్సరాల కాలంలో కాంగ్రెస్ నిజ స్వరూపం తెలుసుకొని కర్రు కాల్చి వాత పెట్టడానికి సిద్ధంగా ఉన్నారని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్ల ధర్మారెడ్డి అన్నారు. కాంగ్రెస్ హయాంలో గెలిచిన ఏ ఒక్క అభ్యర్థి పరకాల నియోజకవర్గం తో పాటు పరకాల మండలాన్ని పట్టణాన్ని అభివృద్ధి చేయడానికి ప్రయత్నించలేదని మండిపడ్డారు. మున్సిపాలిటీపై టిఆర్ఎస్ జండా ఎగురుతుందని ఆయన ధీమానే వ్యక్తం చేశారు. 22 వార్డులలో సుమారు 18 వార్డుల వరకు టీఆర్ఎస్ అభ్యర్థులు గెలుపొందుతారని ధర్మారెడ్డి అన్నారు. కార్యక్రమంలో ఆరవ వార్డ్ అభ్యర్థి తుమ్మల రాణి రవి, 8వ వార్డు అభ్యర్థి అడప రాము , ఏడవవాడ అభ్యర్థి దుంపేటి నాగరాజు 9వ వార్డు అభ్యర్థి బండారి కవిత కృష్ణ తో పాటుగా పెద్ద ఎత్తున కార్యకర్తలు నాయకులు ప్రజలు పాల్గొన్నారు.



## ఐటి హబ్ సందర్శించిన పాల్వంచ పీఎం శ్రీ స్కూల్ విద్యార్థినులు

**ముద్ర, ఖమ్మం:**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు లోని పాల్వంచ లో గల ప్రభుత్వ బాలికల పాఠశాల (పి ఎం శ్రీ) విద్యార్థినులు గురువారం ఖమ్మంలోని ఐటి హబ్బును సందర్శించారు. పారిశ్రామిక సందర్శన పేరుతో ఖమ్మం నగరానికి విచ్చేసిన సుమారు 50 మంది విద్యార్థినులకు ఐటీ హబ్ నిపుణులు ఐటీరంగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ఐటి హబ్ సందర్శన, ఐటిపై అవగాహన నేపథ్యంలో సంతోషాన్ని ప్రకటించారు. ప్రత్యేకంగా బస్సు ద్వారా పాల్వంచ నుండి ఖమ్మం వరకు వచ్చిన విద్యార్థులు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఐటీ రంగంపై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ అసిస్టెంట్ పి.మాధవి, టీచర్లు సుధా, కవిత, ఐటీ ఇన్స్పెక్టర్ మౌనిక తదితరులు పాల్గొన్నారు.

# పాల ఉత్పత్తి దారులకు శిక్షణ

**చిలుకూరు, ముద్ర:**

నాబార్డు సహకారంతో ఇంటి గ్రేటర్ రూరల్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో భానుపూరి డైరీ రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంస్థ డైరెక్టర్ల కు మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో నిర్వహించారు. దీనిలో భాగంగా గురువారం పశు వైద్యశాలలో ఏర్పాటు చేసిన శిక్షణలో ముఖ్య అతిథిగా పశు వైద్యాధికారి వీరారెడ్డి పాల్గొని డైరెక్టర్లు కు శిక్షణ ఇచ్చారు. పాడి పరిశ్రమ అభివృద్ధి గురించి ఈ శిక్షణలో డైరెక్టర్లు అవగాహన చేసుకుని ఎఫ్ పి ఓ ను బలోపేతం చేయుటకు సిద్ధంగా ఉండాలని కోరారు. ఎఫ్ పి ఓ ద్వారా ఎన్నో ప్రయోజనకరమైన కార్యక్రమాలు నిర్వహించవచ్చని అందుకు డైరెక్టర్ల మీద చాలా బాధ్యతలు ఉన్నాయని తెలిపారు. చిలుకూరు మండలంలో పాడి పశువులు గణనీయంగా ఉన్నాయని పాడి రైతులకు ఎఫ్ పి ఓ ద్వారా అన్ని విధాల ప్రోత్సాహం సహకారం




అందుతాయని తెలియజేయాలని అన్నారు. సీఈఓ నంద్యాల అఖిల్ రెడ్డి మాట్లాడుతూ.. ఇంటి గ్రేటెడ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఎఫ్ పి ఓ ద్వారా పాడి రైతులను బలోపేతం చేసి రైతులకు కావలసిన వనరులను సమకూర్చుకోవచ్చని, పాడి రైతులందరూ కూడా సభ్యులుగా చేరాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఫ్పీఓ డైరెక్టర్లు కొడారు రాము, నెల్లూరి నాగేశ్వర రావు, కందుకూరి కృష్ణమూర్తి, పులగం ప్రభాకర్, ఉపేందర్, స్వాతి, శిరీష పాల్గొన్నారు.

# పదేళ్ల పాలనలో మోసాలే మిగిలాయి

- **పరకాల ఎమ్మెల్యే రేవూరి విమర్శ**

**ముద్ర, పరకాల:**

తెలంగాణలో 10 సంవత్సరాల టిఆర్ఎస్ పాలనలో ప్రజలకు మోసాలు తప్ప మిగిలింది ఏమి లేదని పరకాల ఎమ్మెల్యే రేవుడి ప్రకాశ్ రెడ్డి విమర్శించారు. గత రెండు మూడు రోజులుగా పరకాల పట్టణంలోనీ వివిధ వార్డులలో విస్తృతంగా తిరుగుతూ అభ్యర్థుల తరపున ప్రచారాన్ని నిర్వహించారు. 6 7 14 17 18 19 వార్డులలో ప్రచారాన్ని నిర్వహించారు. తెలంగాణలో ప్రజలను ఓట్లు అడిగే నైతిక హక్కు, టిఆర్ఎస్ పార్టీకి లేదని ఆయన మండిపడ్డారు. ప్రత్యేక రాష్ట్రం వచ్చింది కేసీఆర్ వల్ల కాదని తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీ సహకారం అందించడం వలన తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించిన విషయాన్ని ప్రజలు ఇప్పటికీ మర్చిపోవడం లేదన్నారు. ఎంతోమంది త్యాగ మూర్తులు మేధావులు ఉద్యమకారులు పోరాట పట్టిన వల్ల ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర అవతరణకు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం



ముందుకు వచ్చిందన్నారు. గడిచిన రెండు సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో ప్రజలు సుభిక్షంగా ఉన్నారని రేవూరి ప్రకాశ్ రెడ్డి తెలిపారు. ప్రజలకు సన్న బియ్యం, ఉచిత విద్యుత్, ఉచిత బస్సు ప్రయాణం లాంటి ఎన్నో రకాలైన సౌకర్యాలను ప్రజలు కోరిన విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న విషయాన్ని ఓటర్లకు వివరించారు. ఈ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి అత్యధిక స్థానాలను కట్టబెడతారు అన్న విశ్వాసాన్ని రేవూరి ప్రకాష్ రెడ్డి వ్యక్తం చేశారు కార్యక్రమంలో వివిధ వార్డుల కు చెందిన అభ్యర్థులు పార్టీ నాయకులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# భువనగిరి ఖిల్లాపై కాంగ్రెస్ జెండా ఎగరాలి

- **ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి**

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

భువనగిరి మున్సిపాలిటీ ఖిల్లా పై కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరాలని భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఓటర్లను కోరారు. భువనగిరి మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి గురువారం భువనగిరి మున్సిపల్ 6,7,18, 34వ వార్డులలో ఇంటింటి ప్రచారంలో పాల్గొని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు జంగిడి వినోద్ కుమార్, కుక్క దువ్వ పద్మ



సోమయ్య, పిట్టల బాలరాజు, సరగడ రాజ్యలక్ష్మి అమర్ ల ను గెలిపించాలని కోరారు.

# ప్రకృతి వ్యవసాయంపై విద్యార్థులకు అవగాహన

**ముద్ర నడిగూడెం:**

మండల పరిధిలోని తెల్లబల్లి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం ప్రకృతి వ్యవసాయం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ వ్యవస్థాపకులు కిసాన్ సేవా రత్న డాక్టర్ మొలుగూరి గోపయ్య మాట్లాడుతూ.. మనతో పాటు మన భవిష్యత్ తరాలు ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం చేయాలన్నారు. గత 60 ఏళ్లుగా చేస్తున్న రసాయన వ్యవసాయం తో భూసారం దెబ్బతిన్నదన్నారు. నేల ఆరోగ్యమే పంట ఆరోగ్యం, పంట ఆరోగ్యమే మన ఆరోగ్యమన్నారు. సహజ సిద్ధ పద్ధతులతో భూసారం పెంచడం, చీడ పీడల నివారణపై ఎలాంటి




పెట్టు బడులు లేకుండా పలు పద్ధతులను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమం లో ప్రధానోపాధ్యాయులు సామినేని శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ఉమా మహేశ్వరరావు, వెంకటరమణ, సైదులు, యాదగిరి, శ్రీహరి, సీతారామయ్య, శ్రీనివాసరావు, రఫీక్ అహ్మద్, విద్యార్థులు పాల్గొన్నారు.



# రేపటి నుంచి సీఎం కప్ క్రీడలు ప్రారంభం

**ముద్ర, ఖమ్మం:**

స్థానిక సర్దార్ పటేల్ స్టేడియంలో ఈ నెల 7న ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి సీఎం కప్పు క్రీడలు ప్రారంభం కానున్నాయని మండల విద్యాశాఖ అధికారి శైలజ లక్ష్మి, ఆర్గనైజింగ్ సెక్రటరీ బియ్యని కృష్ణయ్య, క్రీడల ఇన్చార్జ్ గౌస్ తెలిపారు. గురువారం ఖమ్మంలో జరిగిన సమావేశంలో వారు పత్రికా ప్రకటన ద్వారా వివరాలు వెల్లడించారు. సర్దార్ పటేల్ స్టేడియం లో 7వ తేదీన జరగనున్న ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి క్రీడలు ఉదయం 9 గంటలకు ప్రారంభం అవుతాయని పేర్కొన్నారు. కబడ్డీ, కోకో, వాలీబాల్, ఫుట్బాల్, బాస్కెట్ బాల్, హ్యాండ్ బాల్, నెట్ బాల్, అథ్లెటిక్స్, షటిల్ బ్యాడ్మింటన్, కరాటే, జూడో, చెస్, క్యారమ్స్, యోగ, విజ్లింగ్, సాఫ్ట్బాల్ తదితర క్రీడాంశాలకు పోటీలు జరగనున్నాయని తెలియజేశారు . రఘునాథపాలెం , ఖమ్మం అర్బన్ మండలంలోని క్రీడాకారులందరూ సకాలంలో హాజరై క్రీడలను విజయవంతం చేయవలసిందిగా కోరారు. ఈ సమావేశంలో అఫీషియల్స్ సునీత, నాగుల్ మీరా, జిల్లా కోఆర్డినేటర్ ఆదర్శ్ కుమార్, రాము, పారిజాతం, రోజా, విజయ కుమారి, రామారావు కుదుస్, లాలయ్య తదితరులు పాల్గొన్నారు.

# కుష్టు వ్యాధిని నిర్మూలించాలి

- **కోదాడ డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ ఒంటెపాక అమర్ కుమార్**

**ముద్ర నడిగూడెం:**

స్పర్శ్ లెప్రసీ వ్యాధి నిర్మూలన పక్షోత్సవాలలో భాగంగా నడిగూడెం మండల కేంద్రంలో ని కస్తూర్బా బాలికల వసతి గృహంలో లెప్రసి వ్యాధి పై ప్రతిజ్ఞ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కోదాడ డివిజన్ డిప్యూటీ పారా మెడికల్ అధికారి ఒంటెపాక అమర్ కుమార్ మాట్లాడుతూ..'వివక్షను అంతం చేయడం గౌరవాన్ని కాపాడటం' అనే నినాదంతో ప్రతిజ్ఞ ను అన్ని వసతి గృహాలలో, పాఠశాల లో జనవరి 30 2026 నుండి ఫిబ్రవరి 13 2026 వరకు వైద్య ఆరోగ్య శాఖ చే నిర్వహిస్తారని అన్నారు. కుష్టు వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. శరీరంపై స్పర్శ లేని, రాగి రంగు మచ్చలు, మందమైన మెరిసే జిడ్డు



గల చర్మం, చెవులపై, వీపుపై, ఎదపై నొప్పిలేని బొడిపెలు, అర చేతులు అరికాళ్లలో స్పర్శ కోల్పోవడం, కాళ్లకు చెప్పులు జారిపోవడం, చేతుల నుండి వస్తువులు జారిపోవడం కాళ్లు చేతులు తిమ్మిర్లు కలిగి ఉండడం లాంటి లక్షణాలను గుర్తించి ఆరోగ్య సిబ్బందికి సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి సముద్రాల సూరి హెల్త్ అసిస్టెంట్ తౌనుకునూరి కృష్ణ మూర్తి, ఎ.ఎన్.ఎం సుజాత,కె. జి. బి. వి ఉపాధ్యాయినులు విజయ, సునీత మౌనిక, అనిత పాల్గొన్నారు.

# ఘనంగా స్వర్ణగిరిలో శ్రీ వారికి తిరుప్పావడ సేవ

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

స్వర్ణగిరి దివ్య క్షేత్రంలో గురువారం సందర్భంగా శ్రీ వేంకటేశ్వర స్వామివారికి తిరుప్పావడ సేవ ఘనంగా నిర్వహించారు. సుప్రభాత సేవ అనంతరం శ్రీ మహాలక్ష్మి అమ్మవారు, ముప్పది మూడు కోట్ల దేవతలు కొలువుతీరినట్టి గోపృష్ట దర్శనాన్ని చేయించారు. నిత్యారాధన నిమిత్తం అర్చక స్వాములు వేదమంత్రోచ్చారణలతో సువర్ణ బిందె తీర్థమును బంగారుబావి నుండి తీసుకువచ్చారు. అలంకార ప్రియుడైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి అర్చక స్వాములు మేళతాళ మృదంగ మంగళ ధ్వనుల మధ్య సుగంధ భరితమైన పుష్పమాలలతో తోమాల సేవను నయన మనోహరంగా నిర్వహించారు. మని మయ శోభిత స్వర్ణాభరణాలతో పరిమళభరిత పుష్పమాలలతో శోభాయమానంగా అలంకరించి వేయి నామాల శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి సహస్ర నామార్చన సేవను ఘనంగా నిర్వహించారు.

దివ్య క్షేత్రంలో లోక కళ్యాణం కోసం అర్చక స్వాములు శ్రీ సుదర్శన నారసింహ హవనం, సకల ప్రాణికోటికి ఆహార కొరత లేకుండా ఉండడం. స్వామివారికి జరిపే అన్నకూటోత్సవాన్నే తిరుప్పావడ అంటారని ఆలయ ప్రధాన అర్చకులు దిట్టకవి శ్రవణాచార్యులు తెలిపారు. సుమారు 450 కిలోల అన్నప్రసాదాన్ని, లడ్డు, వడ, తదితర పిండివంటలను శ్రీవారికి



నైవేద్యం చేస్తారు. వేదమంత్రోచ్చారణలతో అర్చించి కర్పూరమంగళ హారతులు సమర్పించారు. స్వామివారి నిత్య కళ్యాణ మహోత్సవాన్ని శ్రీవారి వైభవోత్సవ మండపంలో వేదమంత్రాలతో మంగళ ధ్వనుల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు శ్రీ స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించి ఆనంద పరవశులైనారు. ప్రతిరోజు స్వర్ణగిరి దివ్య క్షేత్రంలో అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడి అన్న ప్రసాద వితరణలో భాగంగా ఈరోజు సుమారు 3000 మందికి పైగా భక్తులు నిత్యాన్న ప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం 6:30 కు ఆదిమధ్యాంతరహితుడైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని మాడవీధులలో శోభాయమానంగా ఊరేగిస్తూ.. తిరువీధి ఉత్సవ సేవను నిర్వహించారు.

## నలుగురు పేకాట రాయుళ్ల అరెస్ట్

**ముద్ర, తుర్కపల్లి :**

మండలంలోని మాధాపూర్ గ్రామ శివారులోని ఖాళీ స్థలంలో పేకాట జరుగుతోందన్న సమాచారంతో తుర్కపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్ఐ తక్యుద్దీన్ తమ సిబ్బందితో కలిసి బుధవారం దాడి నిర్వహించారు.ఈ దాడిలో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులు భూక్య మంగ్యా, లకవాత్ రమేష్, చిలుకూరి వెంకటేష్, యాట రవిలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారినుంచి రూ.9,140నగదు,నాలుగు సెల్ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.., పేకాటతో పాటు ఏవైనా అసాంఘిక లేదా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



## దయాకర్ ను గెలిపించాలి

**ముద్ర, పరకాల:**

పరకాల మున్సిపల్ పరిధిలోని తొమ్మిదవ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బాసాని దయాకర్ గెలుపును కోరుతూ మహిళా కాంగ్రెస్ కార్యకర్తలు విస్తృతంగా ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా నాయకురాలు మాట్లాడుతూ బాసాని దయాకర్ కు వార్డులోని అన్ని వర్గాల ప్రజల మద్దతు లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంగెం మాజీ ఎంపీపీ కందకట్ల కళావతి, 9వ వార్డు కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు దార్న వసుంధర, బాసాని కల్పన తదితరులు పాల్గొన్నారు.

# స్వరూప గెలుపే లక్ష్యంగా ప్రచారం

**ముద్ర, పరకాల:**

పరకాల మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా నాలుగో వార్డు కౌన్సిలర్గా పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి పుల్ల స్వరూపకు మద్దతుగా ఎన్నికల ప్రచారం చేశారు. నాలుగో వార్డు ఇన్ చార్జ్, జిల్లా కోశాధికారి ఎర్ర రామన్నతో పాటు ఆ డివిజన్కు చెందిన బూత్ నాయకులు, కార్యకర్తలు ఇంటింటా ప్రచారంలో పాల్గొన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ ప్రచారంలో పుల్ల



రాజు, సాంబయ్య, ఈశ్వర్, అభిరామ్, లత, దీప, సుజాతతో పాటు వార్డు ప్రజలు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ మద్దతు తెలిపారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
06.02.2026 శుక్రవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**దేశంలోని టాప్ 10 రాజకీయ పార్టీలు**

సమాజ్‌వాదీ పార్టీ : ఉత్తరప్రదేశ్‌లో ప్రభావవంతమైన పార్టీ; సామాజిక న్యాయం ప్రధాన సిద్ధాంతం.

SAMAJWADI PARTY

## రెవెన్యూ రికార్డులను పక్కాగా నిర్వహించాలి

- **కలెక్టర్ హైమావతి**

**సిద్దిపేట, ముద్ర ప్రతినిధి:**



ఆర్ఓఆర్, 1బి తదితర అన్ని రకాల రెవెన్యూ రికార్డులను పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ హైమావతి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లోని ఐడీఓసీ సమావేశ మందిరంలో ఆర్డీవోలు, అన్ని మండలాల తహసీల్దార్లు, అధికారులతో సమావేశం నిర్వహించి గ్రామాలు, మండలాలు, డివిజన్ల వారీగా వివిధ రెవెన్యూ అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ భూముల సంరక్షణ చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను సూచించారు. ముఖ్యంగా తహసీల్దార్ నుంచి కలెక్టర్ లాగిన్ వరకు గల పెండింగ్ భూభారతి దరఖాస్తులను పరిష్కరించడం, ప్రభుత్వ భూముల పరిరక్షణపై సమీక్షించి తగు ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ పాలనలో రెవెన్యూ వ్యవస్థ చాలా ముఖ్యమైందని పేర్కొన్నారు. భూ పరిపాలనలో పారదర్శకత, జవాబుదారీతనం కోసం తెచ్చిన భూ భారతి చట్టాన్ని పారదర్శకంగా అమలు చేసి భూ సమస్యలు లేకుండా ప్రజలకు న్యాయం చేయాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులదేనని స్పష్టం చేశారు. చట్టం ప్రకారం భూభారతి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. త్వరలోనే రెవెన్యూ రికార్డులపై డిప్యూటీ తహసీల్దార్లకు ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా



అదనపు కలెక్టర్ రెవెన్యూ అబ్దుల్ హమీద్, డీఆర్ఓ నాగరాజమ్మ, సిద్దిపేట, హుస్నాబాద్ ఆర్డీవోలు సదానందం, రామ్మూర్తి, జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దార్లు, ఈడియం ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.





## అభ్యర్థులను గెలిపించండి

- **మాజీ ఎమ్మెల్యేలు మైనంపల్లి, పద్మ విస్తృత ప్రచారం**

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

మెదక్ మున్సిపాలిటీలో ఎన్నికల ప్రచారం జోరందుకుంది. గురువారం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత రావు వార్డుల్లో ప్రచారం చేశారు. బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని మాజీ డిప్యూటీ స్పీకర్, ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎం. పద్మ దేవేందర్ రెడ్డి పర్యటించారు.

**అభివృద్ధి కావాలంటే కాంగ్రెస్ కు ఓటెయ్యండి..**

అభివృద్ధి కావాలంటే కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత రావు విజ్ఞప్తి చేశారు. మెదక్ పట్టణంలో 6,7,8,9 వార్డుల్లో అభ్యర్థులు హరిత, శంసునిసా, జయశ్రీ, మధుసూదన్ రావులకు మద్దతుగా ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం పదేళ్లు ఇళ్లు ఇస్తామని మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అందరిని సమానంగా చూస్తదన్నారు. హరీష్ రావు అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. రెండేళ్లలో మెదక్ మున్సిపాలిటీకి రూ.200 కోట్లు తెచ్చామన్నారు. మన ప్రభుత్వం అధికారంలోకి రాగానే రేషన్ కార్డులు ఇచ్చామని పేర్కొన్నారు. ఈ ప్రచారంలో మున్సిపల్ మాజీ చైర్మన్ చంద్రపాల్, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, పట్టణ అధ్యక్షుడు గంగాధర్, మాజీ వైస్ చైర్మన్ రాగి అశోక్, సుభాష్ చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు.

**అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్..**

కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని మాజీ డిప్యూటీ స్పీకర్, బీఆర్ఎస్ జిల్లా పార్టీ అధ్యక్షురాలు పద్మా దేవేందర్ రెడ్డి ఆరోపించారు. మెదక్ పట్టణంలోని 5,7,8,9,10 వార్డుల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు మామిళ్ల ఆంజనేయులు, మాయ అనురాధ శ్రీనివాస్, మాయ గంగామణి మల్లేశం, జుబేర్ అహ్మద్, వనం లత వెంకటేష్ లకు మద్దతుగా ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే రెండేళ్లు గడిచినా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని ఆరోపించారు. అందువల్ల కాంగ్రెస్ కు ఈ ఎన్నికల్లో పోటీ చేసే అర్హత లేదన్నారు. ఆరు గ్యారెంటీల హామీల అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. తాను 25 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నానని, కానీ రెండేళ్లలోనే ప్రభుత్వంపై ఇంత వ్యతిరేకత ఎప్పుడు రాలేదని పేర్కొన్నారు. ప్రజలు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో పార్టీ మెదక్ మండల అధ్యక్షుడు ఎం.అంజాగౌడ్, నాయకులు కిష్టయ్య, వార్డ్ ఇంచార్జిలు గట్టయ్య, షాకీర్, ప్రభాకర్, ఎంబిపూర్ మహేష్, రంగారావు, రాజ్ కుమార్, స్వామి, లాలు నాయక్, ఆంటోని, వినయ్, లింగారెడ్డి, జైపాల్ రెడ్డి, సోములు, ఫాజిల్, కండెల నర్సింలు, గోపాల కృష్ణ, హరి, ఓమర్ ఫారుక్, స్వామి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## హంగర్గఫారంలో పశు వైద్య శిబిరం

**ముద్ర, హైదరాబాద్:**

నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండలంలోని హంగర్గఫారంలో గురువారం లయన్స్ క్లబ్ సహకారంతో పశు సంవర్ధక శాఖ, పీవీ నరసింహారావు తెలంగాణ విశ్వవిద్యాలయం సంయుక్తంగా జాతీయ సేవ పథకంలో ప్రత్యేక ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ కోటగిరి డైమండ్ అధ్యక్షుడు, బీఆర్ఎస్ నాయకుడు తెల్ల రవికుమార్ మాట్లాడుతూ ఉచిత పశు వైద్య శిబిరాలను పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు



## కేసీఆర్ గజ్వేల్ అభివృద్ధి ప్రదాత

- **మాజీ మంత్రి హరీష్ రావు**

**ముద్ర, హైదరాబాద్:**

కేసీఆర్ గజ్వేల్ అభివృద్ధి ప్రధాత అని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గజ్వేల్ నియోజకవర్గంలోని ప్రజ్ఞాపూర్‌లో మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు పర్యటించారు. అక్కడ పార్టీ శ్రేణులు నిర్వహించిన రోడ్‌షోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గజ్వేల్‌లో బీఆర్ఎస్‌ను మళ్ళీ గెలిపించుకోవాలని కోరారు. చెప్పారు. 'కేసీఆర్ రాకముందు గజ్వేల్ ఎట్లుండే..? ఇప్పుడు ఎట్లుందో ఆలోచించాలన్నారు. కేసీఆర్ హయాంలో ప్రతి ఇంటికి నల్లా ద్వారా మంచినీళ్లు అందించారన్నారు. త్యాగాలతో, ఆమరణ దీక్షతో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన మహనీయుడు, తెలంగాణ జాతిపిత కేసీఆర్ అన్నారు. రేవంత్‌రెడ్డీ దళితబంధు బంద్ పెట్టి రాష్ట్రాన్ని ఆగమాగం చేస్తున్నారని మండిపడ్డారు.



## సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

- **సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవి కుమార్**

**సిద్దిపేట(హుస్నాబాద్), ముద్ర ప్రతినిధి:**



కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 12న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవి కుమార్ కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. గురువారం హుస్నాబాద్ మున్సిపల్ కమిషనర్ కు, మండల పరిషత్ కార్యాలయంలో సమ్మె నోటీసు అందించారు. అనంతరం మండలంలోని వివిధ గ్రామాల్లో సీఐటీయూ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నడూ లేనంతగా కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ లను తెచ్చిందని ఆరోపించారు. కార్మిక వర్గాన్ని యాజమాన్యులకు ఊడిగం చేసే కట్టు బానిసలుగా మార్చే విధంగా 29 చట్టాలను రద్దు చేసిందని మండిపడ్డారు. వీటి ఫలితంగా స్వాతంత్రం పూర్వం కార్మిక వర్గ నాయకత్వం ఎన్నో పోరాటాలు, త్యాగాలు చేసి సాధించుకున్న చట్టాలను రద్దు చేసిందన్నారు. కార్మిక వర్గాన్ని ఆధునిక బానిసలుగా మార్చేందుకు కుట్రలు చేసిందని మండిపడ్డారు.

నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వీటితో పాటుగా జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి వీ బీ జీ రాంజీ అనే పేరుతో చట్టాన్ని కాస్త స్కీముగా మార్చే ప్రయత్నం చేస్తోందన్నారు. ఉపాధి లేకుండా చేయడమే దీని ఉద్దేశమన్నారు. దీని ఫలితంగా గ్రామీణ ప్రాంతంలో కూలీలకు పని దొరకకుండా పోతుందన్నారు. ఇప్పటివరకు ఉన్న చట్టంలో

వంద రోజుల గ్యారెంటీ పని ఉండేదన్నారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి జాబ్ హోల్డర్ కు పని కల్పించని పదిహేను రోజుల్లో ఒక రోజు వేతనాన్ని చెల్లించే అ వకాశం ఉండేదన్నారు. కానీ నేడు ఈ స్కీమ్ లో ఆ అవకాశం లేదన్నారు. వ్యవసాయ పనులు జరుగుతున్న సమయంలో 60 రోజులు పనిని నిషేధించడం అంటే ఉపాధి పని దినాలను కోత పెట్టడమేనని విమర్శించారు. గ్రామీణ ప్రాంతంలోని ఉపాధి కార్మికులకు నష్టం కలిగించే స్కీమును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆధీనంలోని విద్యుత్ సంస్థలను ప్రైవేటు కంపెనీలకు అప్పగించే విధంగా నూతన సవరణ తెస్తున్నారని మండిపడ్డారు. దీనిలో భాగంగా స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసి కరెంటును కూడా రీఛార్జ్ చేసుకునే పద్ధతిని తీసుకువస్తుందన్నారు. దీన్ని వ్యతిరేకిస్తూ ఈ సమ్మె నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంతంలోని కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు ఈ సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీఐటీయూ మండల కన్వీనర్ సంపత్, మున్సిపల్ వర్కర్ యూనియన్ నాయకులు సతీష్, ప్రభాకర్. గ్రామపంచాయతీ యూనియన్ మండల అధ్యక్షుడు వేముగంటి మహేందర్, శ్రీకాంత్, అజయ్, తిరుమల, వెంకన్న, సంపత్, శ్రీనివాస్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



## బీజేపీ గెలిస్తే మున్సిపాలిటీల అభివృద్ధి

- **కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి**

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

బీజేపీ అభ్యర్థులను గెలిపిస్తే మున్సిపాలిటీలను అన్ని రంగాల్లో భివృద్ధి చేస్తామని కేంద్ర బొగ్గు శాఖ మంత్రి కిషన్ రెడ్డి హామీ ఇచ్చారు. గురువారం మెదక్ జిల్లా రామాయంపేటలో ఆయన ఎన్నికల ప్రచారం ర్వహించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి ముట్లాడుతూ మెదక్ జిల్లా నుంచి ముఖ్యమంత్రి అయిన కేసీఆర్ రామాయంపేటను మాత్రం అభివృద్ధి చేయలేదని ఆరోపించారు.

కేసీఆర్ ముఖ్యమంత్రి పదవిలో ఉన్నప్పుడు సైతం ఎక్కువ సమయం ఫామ్ హౌస్ లోనే ఉన్నారని విమర్శించారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో పది సంవత్సరాలు బీఆర్ఎస్ పాలించినా అభివృద్ధి చేయలేదని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ నాయకులు రాష్ట్రాన్ని దోచుకున్నారని విమర్శించారు. బీజేపీ ద్వారానే తెలంగాణలో అభివృద్ధి సాధ్యమని స్పష్టం చేశారు. మహిళలకు రూ.2,500 ఇస్తానన్న కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. ఆడపిల్లల పెళ్లికి తులం బంగారం ఇస్తామని, ఆడపిల్లలకు స్కూటీ ఇస్తామని మోసం చేశారన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ఒక్కటి కూడా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదని మండిపడ్డారు. నిరుద్యోగ భృతి ఇస్తామని యువకులను మోసం చేశారన్నారు. పన్నెండు సంవత్సరాలుగా దేశంలో బీజేపీ అభివృద్ధి, సంక్షేమ పథకాలను కొనసాగిస్తోందన్నారు. ప్రతి ఒక్కరికి నెలకు 5 కిలోల చొప్పున ఉచిత బియ్యం పంపిణీ చేస్తున్నామని గుర్తు చేశారు. రైతులకు కిసాన్ సమ్మాన్ నిధులు, సబ్సిడీపై యూరియా పంపిణీ చేస్తున్నామని చెప్పారు. మహిళా సంఘాలకు బ్యాంకుల ద్వారా రుణాలు అందించి ప్రోత్సహిస్తున్నామని వివరించారు. ప్రతి ఇంటికి గ్యాస్ సరఫరా చేస్తున్నామన్నారు. ఆయుష్మాన్ భారత్ పథకం తీసుకొస్తే గతంలో కేసీఆర్, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుకుంటుందన్నారు. ఎంపీ, ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఒక్క సీటు కూడా గెలవలేదన్నారు.

**కాంగ్రెస్, బీఆర్ఎస్ లు తోడు దొంగలు..**

కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు తోడు దొంగలని దుయ్యబట్టారు. గ్రామాల్లో మంచినీరు దొరకదు, కానీ అన్ని బెల్ట్ షాపుల ద్వారా మద్యం సరఫరా



చేస్తున్నారని ఏగతాళి చేశారు. మహిళల మీద దౌర్జన్యాలు జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. మద్యం వ్యాపారం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం దోచుకుంటుందన్నారు. కాళేశ్వరం ద్వారా బీఆర్ఎస్ లక్షల కోట్లు దోచుకుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ భూములు విక్రయించి డబ్బులు దోచుకుంటుందన్నారు. రాష్ట్రం అభివృద్ధికి మాత్రం కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రయత్నించడం లేదని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ రఘునందన్ రావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు వాళ్లను రాధా మల్లేశం గౌడ్, పార్టీ నాయకులు, అభ్యర్థులు పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని వినతి

**ముద్ర, హైదరాబాద్:**

సిద్ధిపేట జిల్లా రాయపోల్ మండలంలోని మంతూర్ లో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆ గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు ఇవాళ విద్యుత్ శాఖ అధికారులను కలిశారు. ఈ సందర్భంగా రాయపోల్ విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఏఈ శ్రీనివాస్‌ను కలిసిన వారిలో మంతూర్ గ్రామ సర్పంచ్ పర్వేజ్, ఉపసర్పంచ్ సంతోష్,మల్లన్న ఆలయ కమిటీ అధ్యక్షులు మహిపాల్‌తోపాటు కనక చంద్రం, నరసింహారెడ్డి, కనకరాజు, అశోక్, ప్రభాకర్ రెడ్డి ఉన్నారు. గ్రామంలో ముఖ్యంగా మల్లన్న గుడి పరిసర ప్రాంతంలో కొత్త విద్యుత్ స్థంభాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని, అలాగే కొన్నిచోట్ల వైర్లు సాగి వేలాడుతూ ప్రమాదకరంగా మారాయని వారు ఏఈ దృష్టికి తీసుకెళ్లారు.ఈ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఏఈని కోరారు. దీనిపై స్పందించిన ఏఈ శ్రీనివాస్ సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.





## హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

- **ఎమ్మెల్యే కొనింటి మాణిక్యరావు**

**ముద్ర, హైదరాబాద్:**

శాసనసభ ఎన్నికల్లో సాధ్యంకాని హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్యరావు విమర్శించారు. గురువారం పట్టణంలోని 15, బసవేశ్వర్ స్ట్రీట్ , 28 వ వార్డుల్లోని ఆర్యనగర్‌లల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు ఉల్లిగడ్డ పద్మజా, మడపతి శివ కుమార్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ మున్సిపాలిటీని మరోసారి బీఆర్ఎస్ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఓట్లకోసం వచ్చే కాంగ్రెస్ నాయకులను ఆరు గ్యారెంటీలు ఎక్కడ అని నిలదీయాలన్నారు. కాంగ్రెస్ నాయకుల మాయమాటలు నమ్మి మరోసారి మోసపోయి గోసపడొద్దన్నారు.బీఆర్ఎస్ పాలన ఎట్లుండే.. ఇప్పుడెట్లున్నది ఒకసారి ఆలోచించాలన్నారు. కాంగ్రెస్ పాలనలో పట్టణ అభివృద్ధికి విధులు కేటాయించలేదన్నారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన పనులకు రంగులేసి మేమే చేసినామని గప్పాలు కొడుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎన్నికల ఇన్‌చార్జి దేవి ప్రసాద్, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను వేగవంతం చేస్తా

**ముద్ర, హైదరాబాద్:**

మరోసారి గెలిపించి తనకు అవకాశం ఇస్తే మిగతా అభివృద్ధి పనులను వేగవంతం చేస్తానని నర్సాపూర్ మున్సిపల్ బీఆర్ఎస్ అభ్యర్థి నయిమొద్దీన్ తెలిపారు. గురవారం నయిమొద్దీన్ 6వ వార్డులో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కారు గుర్తుకు ఓటేసి తనను గెలిపిస్తారని.. ప్రజలు ఆదరిస్తున్నారని వెల్లడించారు. 6వ వార్డును ఎంతో అభివృద్ధి చేశానని, మరో మారు అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేస్తానన్నారు. 6వ వార్డులో సీసీ రోడ్లు, అండర్ డ్రైనేజ్, 40 ఎలక్ట్రికల్ పోల్స్, ఇరిగేషన్ కాలువ, ముస్లింల స్మశాన వాటికలో ట్రాన్స్‌ఫార్మర్, 18 పోల్స్ తదితర అభివృద్ధి పనులు చేయడం జరిగిందని గుర్తు చేశారు. మరోసారి గెలిపించి నాకు అవకాశం ఇస్తే ముస్లింలకు స్మశాన వాటికకు ఐదు ఎకరాల స్థలాన్ని కేటాయించడానికి కృషి చేస్తానని తెలిపారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
06.02.2026 శుక్రవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



దేశంలోని టాప్
10 రాజకీయ పార్టీలు
ద్రవిడ మున్నేట్ర కజగం (DMK): తమిళనాడులో కీలక పార్టీ; ద్రవిడ సిద్ధాంతం, సామాజిక సంస్కరణలపై దృష్టి.



# కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావును అరెస్ట్ చేయాలి





- కాంగ్రెస్ ను దెబ్బతీసేందుకు బీజేపీ, బీఆర్ఎస్ ల కుమ్మక్కు రాజకీయాలు
- కాళేశ్వరం, ఈ కార్ రేసింగ్ కేసులపై చర్యలకు బీజేపీ అనాసక్తి
- మరో ఎనిమిదేళ్లు మాదే అధికారం
- వరంగల్, కరీంనగర్ జంట నగరాలుగా అభివృద్ధి
- బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి పరివాహక ఆలయాల అభివృద్ధి
- పాలమూరుకు జాతీయ హోదా ఇవ్వని బీజేపీ అగ్రనేతలు ఇక్కడికి ఏ ముఖం పెట్టుకుని వస్తున్నారు..?
- చొప్పదండి బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి

**ముద్ర, కరీంనగర్ :**

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, తెలంగాణలో ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీలది ఫెవికాల్ బంధమని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ను దెబ్బతీసేందుకు ఆ రెండు పార్టీలు కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నాయని మండిపడ్డారు. ఒకవేళ బీఆర్ఎస్, బీజేపీ బంధం నిజం కాకపోతే మున్సిపల్ ఎన్నికలు ముగిసేలోపు కాళేశ్వరం, ఈ కార్ రేసింగ్ కేసుల్లో కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావును అరెస్ట్ చేయాలని సవాల్ చేశారు. గురువారం కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం గుమ్లాపూర్ లో ఏర్పాటు చేసిన ప్రజా పాలన ప్రగతి బాటలో భాగంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. రూ.45.15 కోట్లతో రామడుగు వెదిరలో నిర్మించనున్న అడ్వాన్స్ డ్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. అనంతరం రూ. 5 కోట్లతో గంగాధర మండలం మధురానగర్ చేపట్టనున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగిస్తూ ర్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ అవయవ దానం చేసి రాష్ట్రంలో బీజేపీని ఎనిమిది స్థానాల్లో గెలిపించిందని ఆరోపించారు. పదేళ్ల తమ పాలనలో రాష్ట్రాన్ని నిలువునా దోచుకున్న బీఆర్ఎస్ నేతలు నిరుద్యోగులు, మహిళలు, రైతులు అందరినీ ఇబ్బందులకు గురిచేశారని మండిపడ్డారు. బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి పరివాహక ఆలయాలను అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. ఎకో టూరిజంను అభివృద్ధి చేసి పర్యాటక క్షేత్రంగా తీర్చి దిద్దుతామని వెల్లడించారు.

గతంలో పాలమూరుకు వచ్చిన ప్రధాని మోదీ పాలమూరు రంగారెడ్డిని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటిస్తామని ఇచ్చిన హామీని సీఎం గుర్తు చేశారు. రెండు రోజుల క్రితం అదే ప్రాంతానికి వచ్చిన జాతీయ అధ్యక్షుడు ఆ విషయాన్ని ఎందుకు ప్రస్తావించలేదని నిలదీశారు. కనీసం మెట్రో రైలు రెండో విడత, కాళేశ్వరం విచారణపై మాట్లాడలేదని మండిపడ్డారు. మూసీ ప్రక్షాళన నిధుల ఊసు ఎత్తని బీజేపీ జాతీయ అధ్యక్షుడు.. ఏం మొహం పెట్టుకుని రాష్ట్రానికి ప్రచారానికి వచ్చారని నిలదీశారు. . రెండేళ్ల తమ పాలనలో రాష్ట్రంలో 70 వేల మందికి ఉద్యోగాలు ఇచ్చామని చెప్పారు. ఇందులో ఎవరికైనా అనుమానం ఉంటే.. ఎల్బీ స్టేడియానికి రావాలని సూచించారు. అక్కడే వివరంగా చెబుతా అని సవాల్ చేశారు.

రాష్ట్రానికి బీజేపీ చేసింది ఏమీ లేదని విమర్శించారు. మున్సిపల్ ఎన్నికలు రాగానే.. జాతీయ అధ్యక్షుడిని తీసుకొచ్చి ప్రచారం చేయిస్తున్నారని ఆ పార్టీ నేతలపై మండిపడ్డారు. ఇటీవల ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు గాడిద గుడ్డు ఇచ్చాం.. ఈ ప్రాంత ప్రజలు మనకు ఓట్లు వేయరని కనీసం ఆ అధ్యక్షుడికైనా తెలియాలి కదా అని సెటైర్లు వేశారు. కాళేశ్వరం కేసీఆర్ కు ఏటీఎంగా మారిందన్న ప్రధాని ఎందుకు సీబీఐ విచారణ చేపట్టలేదని నిలదీశారు. ఫార్ములా ఈ రేసు కేసులో ఐఏఎస్ అధికారిపై విచారణకు అనుమతి కోరుతూ లేఖ రాస్తే, ఇప్పటికీ కేంద్రం నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు. బీఆర్ఎస్ ఎన్ని శాపనార్థాలు పెట్టినా మరో ఎనిమిదేళ్లు అధికారం తమదేనన్నారు. తెలంగాణను దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దే వరకు అధికారంలో కొనసాగుతామని జోస్యం చెప్పారు. . వరంగల్, కరీంనగర్ జంట నగరాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. రెండింటి మధ్యలో డంప్ యార్డు ఏర్పాటు చేసి విద్యుత్ ఉత్పత్తి చేస్తామని ప్రకటించారు. బండి గుండు తెచ్చేదేం లేదు.. మోదీ ముందు మాట్లాడే ధైర్యం వాళ్లకు లేదని కేంద్రమంత్రి బండి సంజయ్ కు చురకలంటించారు. బండి సంజయ్ మాపై రంకెలేయడం కాదు.. కాళేశ్వరంపై సీబీఐ విచారణ చేసి కేసీఆర్ ను బొక్కలో వేయించాలని డిమాండ్ చేశారు. ఢిల్లీ నుంచి కరీంనగర్ మున్సిపల్ అభివృద్ధికి ఏం నిధులు తెచ్చారో బండి సంజయ్ చెప్పాలని డిమాండ్ చేశారు. తమ ప్రభుత్వం ఆడబిడ్డలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కోసం రెండేళ్లల్లో రూ. 9 వేల కోట్లు ఖర్చు చేసిందన్నారు. రెండేళ్లలో రూ. 27 కోట్లు మహిళలకు రుణాలు అందించి వ్యాపారంలో ప్రోత్సహిస్తున్నామన్నారు. ఆడబిడ్డలను ఆర్టీసీ బస్సులకు యజమానులను చేశామని వివరించారు. ప్రధాన ప్రతిపక్ష నేతలుగా చెప్పుకుంటోన్న కేసీఆర్, కేటీఆర్, హరీశ్ మేడారం సమ్మక్క సారలమ్మ దర్శనానికి రాలేదని విమర్శించారు. పేదోళ్ల దేవుళ్లను మొక్కేందుకు వాళ్లకు వారికి నామోషీ అన్నారు. ఈ నెల 11న జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో ప్రజా సంక్షేమం, అభివృద్ధిని కాంక్షించే మంచి వారినే ఎన్నుకోవాలని ఓటర్లకు పిలుపునిచ్చారు. ఈ ఎన్నికల్లో కరీంనగర్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమన్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత కరీంనగర్ కు మళ్లీ వస్తాననీ, మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసుకుందామని సీఎం చెప్పారు.

**అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన సీఎం..**

వ్యవసాయ శాఖ మంత్రి, కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన ఘనత ముఖ్యమంత్రికే దక్కుతుందని పేర్కొన్నారు. కులగణన ద్వారా అన్ని వర్గాలకు న్యాయం చేశారన్నారు. రైతులు, నేత కార్మికుల సంక్షేమానికి వేల కోట్ల రూపాయలు కేటాయించారని చెప్పారు. పెండింగ్ అభివృద్ధి పనులను ప్రాధాన్యతను బట్టి పూర్తి చేస్తామని తెలిపారు. కరీంనగర్ అభివృద్ధికి నిరంతరం పాటు పడతామన్నారు. కరీంనగర్ జిల్లా అంటే ముఖ్యమంత్రికి ఎనలేని అభిమానమన్నారు.

**70 వేలకు పైగా ఉద్యోగాలు భర్తీ చేశాం**

ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ టీఎస్ పీఎస్సీ ద్వారా దాదాపు 70 వేలకుపైగా ఉద్యోగాలు భర్తీ చేశామని తెలిపారు. రాష్ట్రంలో ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఉచిత సన్నబియ్యం వంటి పథకాలు అమలవుతున్నాయని చెప్పారు. ముఖ్యమంత్రి రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడుతున్నారని పేర్కొన్నారు.

**జిల్లాను అగ్రగామిగా నిలిపేందుకు కృషి**

రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ సాగునీరు, విద్య, వైద్య రంగాల్లో జిల్లాను అగ్రగామిగా నిలిపేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ప్రజాపాలన - ప్రగతి బాట కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోందని పేర్కొన్నారు. పేద ప్రజల సంక్షేమ లక్ష్యంగా ప్రజాపాలన ప్రభుత్వం ముందుకు సాగుతోంన్నారు. సబ్బండ వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు.

**ఆలయాల అభివృద్ధికి నిధులివ్వాలి**

ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రిని కోరారు. ధర్మపురి, కొండగట్టు ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపాలని పేర్కొన్నారు ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల సంక్షేమానికి యంగ్ ఇండియా మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

# మున్సిపల్ బరిలో ఒకే కుటుంబ సభ్యులు

- ఎన్నికల్లో చిత్ర విచిత్రాలు

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

మున్సిపల్ ఎన్నికల్లో ఈసారి కుటుంబ సభ్యులు, రక్త సంబంధీకులు వేర్వేరు వార్డుల్లో బరిలో నిలిచారు. ఓటరు దేవుళ్ల ప్రసన్నం కోసం చేయరాని ప్రయత్నాలు చేస్తున్నారు. గెలుపు కోసం తీవ్రంగా శ్రమస్తున్నారు.

**బీఆర్ఎస్ తరపున తల్లి, తనయుడు**

మెదక్ మున్సిపాలిటీలో బీఆర్ఎస్ తరపున 17వ వార్డులో మున్సిపల్ మాజీ చైర్మన్ బట్టి జగపతి సతీమణి లలిత, 29వ వార్డులో తనయుడు ఉదయ్,, తల్లీకొడుకులు పోటీలో ఉన్నారు. లలిత గతంలో 18వ వార్డు నుంచి కౌన్సిలర్ గా గెలుపొందగా, తనయుడు ఉదయ్ 5వ వార్డులో పోటీ చేసి ఓటమిపాలయ్యారు. ఈసారి ఫలితం కోసం ఎదురు చూడాలి.

**కాంగ్రెస్ తరపున తల్లి, కొడుకు**

మెదక్ మున్సిపాలిటీలోని 14వ వార్డులో దొంతి లక్ష్మి మూడోసారి పోటీ చేస్తున్నారు. 15వ వార్డులో ఆమె తనయుడు నరేష్ గౌడ్ పోటీలో ఉన్నారు. ఇక్కడ మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లిఖార్జున్ గౌడ్ సతీమణి ఆరెళ్ల గాయత్రీ మూడోసారి పోటీ చేస్తున్నారు. వీరిద్దరూ సమీప బంధువులే కావడం విశేషం.

**బీఆర్ఎస్ తరపున తోడి కోడళ్లు**

మెదక్ మున్సిపాలిటీలో బీఆర్ఎస్ తరపున తోడి కోడళ్లు రెండు వార్డుల్లో బరిలో నిలవడం విశేషం. 7వ వార్డులో మాయ అనురాధ శ్రీనివాస్, 8వ వార్డులో గంగామణి మల్లేశం పోటీ చేస్తున్నారు. గత ఎన్నికల్లో వీరిద్దరూ ఇదే వార్డుల్లో పోటీ చేసి ఓటమి పాలయ్యారు.

**బీఆర్ఎస్ తరపున వదిన, మరదలు**

మెదక్ మున్సిపాలిటీలోని 3, 4 వార్డుల్లో వదిన, మరదలు బీఆర్ఎస్ తరపున పోటీ చేస్తున్నారు. 3వ వార్డులో కొట్టాల లలిత బరిలో ఉన్నారు. లలిత గతంలో మండల పరిషత్ ఉపాధ్యక్షురాలిగా పనిచేశారు. గత ఎన్నికల్లో ఆమె భర్త విశ్వం కౌన్సిలర్ గా పనిచేశారు. 4వ వార్డులో ధర్మిశెట్టి స్వరూప పోటీ చేస్తున్నారు. ఈమె విశ్వం సోదరి.

**రెండు పార్టీల తరపున అబ్బాయ్, బాబాయ్**

29వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థిగా బొద్దుల కృష్ణ పోటీ చేస్తున్నారు. గత ఎన్నికల్లో కృష్ణ సతీమణి రాధా కౌన్సిలర్ గా ఉన్నారు. కాగా అతని అన్న కొడుకు బొద్దుల నవీన్ 20వ వార్డులో బీఆర్ఎస్ తరపున బరిలో నిలిచారు.

**రామాయంపేటలో భార్యభర్తలు**

రామాయంపేటలో కాంగ్రెస్ పార్టీ తరపున భార్యభర్తలు పోటీ చేస్తున్నారు. 1వ వార్డు నుంచి గజవాడ లావణ్య, 7వ వార్డు నుంచిఆమె భర్త నాగరాజు బరిలో నిలిచారు. గతంలో నాగరాజు 4వ వార్డు నుంచి బీఆర్ఎస్ తరపున పోటీ చేసి విజయం సాధించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత హస్తం పార్టీలో చేరారు. ప్రస్తుతం రిజర్వేషన్ అనుకూలించక ఏడో వార్డుకు మారారు.



బాబాయ్, అబ్బాయ్, కృష్ణ, నవీన్



తోటి కోడళ్లు అనురాధ, గంగమణి



తల్లి, తనయుడు బట్టి లలిత ఉదయ్



తల్లి, తనయుడు దొంతి లక్ష్మి, నరేష్ గౌడ్



వదిన, మరదలు లలిత, స్వరూప



రామాయంపేటలో భార్య భర్తలు నాగరాజు, లావణ్య



# ఖర్గే, నడ్డా మధ్య వాగ్వాదం..

- రాజ్యసభలో హోరాహోరీ

**ముద్ర న్యూస్:**

పార్లమెంటరీ విధానంపై రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మల్లిఖార్జున ఖర్గే, కేంద్ర మంత్రి జేపీ నడ్డా మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. బుధవారం లోక్‌సభలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేయాల్సిన ప్రసంగం ఆగిపోయిన సంగతి తెలిసిందే. గురువారం రాజ్యసభలో కూడా అధికార, ప్రతిపక్ష నాయకుల మధ్య మాటల యుద్ధం మొదలైంది. పార్లమెంటులో జాతీయ ప్రయోజన అంశాల గురించి మాట్లాడటంపై ఆంక్షలు విధిస్తున్నారని ఖర్గే ఆరోపించడంపై, కేంద్ర మంత్రి జేపీ నడ్డా అభ్యంతరం వ్యక్తం చేశారు. పార్లమెంట్ అంటే లోక్ సభ, రాజ్యసభ రెండూ ఉంటాయి. లోక్ సభలో ప్రతిపక్ష నాయకుడు దేశ ప్రయోజనాల గురించి మాట్లాడాలనుకున్నారు. కానీ అలా చేయడానికి ప్రభుత్వం అనుమతించలేదు. మీరు సభను ఇలా ఎలా నడపగలరు అని ఖర్గే ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు జేపీ నడ్డా స్పందిస్తూ.. లోక్‌సభ కార్యకలాపాలను రాజ్యసభలో చర్చించలేము. నా గౌరవనీయ సహోద్యోగి ఈ విషయాన్ని తెలుసుకోవాలలని సమాధానమిచ్చారు. ప్రధాని మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం దేనిపైనా చర్చ నిర్వహించడానికైనా ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని నడ్డా అన్నారు. లోక్‌సభలో ఏ ప్రశ్నకైనా సమాధానం ఇవ్వడానికి ప్రధాని మోదీ ఎప్పుడూ సిద్ధంగా ఉంటారు. కానీ ప్రతిపక్షం సభా కార్యకలాపాలను ముందుకు సాగనివ్వడం లేదు. ప్రతిపక్షాలు అడిగినట్లుగా కేంద్ర మంత్రి పియూష్ గోయల్ భారత్‌అమెరికా వాణిజ్య ఒప్పందాలపై ఒక ప్రకటన చేశారని జేపీ నడ్డా గుర్తు చేశారు. తీవ్ర వాగ్వాదం అనంతరం ప్రతిపక్ష ఎంపీలు రాజ్యసభ నుంచి వాకౌట్ చేశారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
06.02.2026 శుక్రవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



దేశంలోని టాప్ 10 రాజకీయ పార్టీలు

బిజు జనతా దళ్ (BJD): ఒడిశాలో దీర్ఘకాల పాలన చేసిన పార్టీ: అభివృద్ధి, సంక్షేమంపై ఫోకస్.



# గద్వాల రాజకీయం గందరగోళం

- ఎమ్మెల్యే బండ్ల, కాంగ్రెస్ జిల్లా ఇంచార్జి సరిత రాజకీయ రచ్చ
- ఇంతకాలం కాంగ్రెస్ కు సేవాలందించిన సరిత, బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లో చేరిన ఎమ్మెల్యే బండ్ల
- బండ్ల చేరికను మొదటి నుంచి వ్యతిరేకిస్తున్న సరిత వర్గం
- ఎమ్మెల్యే గా అనర్హత వేటుపడుతుందని బీఆర్ఎస్ లో ఉన్నానని ఎమ్మెల్యే ప్రకటన
- ప్రస్తుత మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల తరపున ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే
- కాంగ్రెస్ అధిష్టానం ఎమ్మెల్యేకు మద్దతు ఇవ్వడంతో అలకబూనిన సరిత
- గందరగోళంలో కాంగ్రెస్ కార్యకర్తలు... రోజు రోజుకు హీట్ ఎక్కుతున్న గద్వాల రాజకీయం



బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి కి కండువా వేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి



ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, సరిత

**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి :**

గద్వాలలో మున్సిపల్ రాజకీయం రోజురోజుకు వేడెక్కుతోంది. ఎప్పటి నుంచో ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, గద్వాల కాంగ్రెస్ ఇన్చార్జి సరిత మధ్య రాజకీయ వివాదం రాజుకొంటోంది. ప్రస్తుతం జరుతున్న మున్సిపల్ ఎన్నికల్లో ఇద్దరి మధ్య పచ్చగడ్డి వేసినా భగ్గుమనే పరిస్థితి వచ్చింది. వీరిద్దరి మధ్య కాంగ్రెస్ శ్రేణులు ఎవరి వైపు ఉండాలో ఎటు తేల్చుకోలేక పోతున్నారు. ఎమ్మెల్యే బండ్ల బీఆర్ఎస్ నుంచి గెలుపొందిన కొద్ది రోజులకు కాంగ్రెస్లో చేరారు. సీఎం రేవంత్ రెడ్డి కండువావేసి పార్టీలోకి ఆహ్వానించారు. తరువాత పార్టీ మారిన ఎమ్మెల్యే లపై బీఆర్ఎస్ కోర్టు తలుపు తట్టింది. ఇక పార్టీ మారిన ఎమ్మెల్యేలు అనర్హత వేటు పడుతుందని బీఆర్ఎస్లోనే ఉన్నామని కొందరు ఎమ్మెల్యే లు ప్రకటించారు. ఇందులో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి సైతం ఉన్నారు. కానీ ప్రస్తుతం జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల్లో మాత్రం కాంగ్రెస్ తరపున చక్రం తిప్పుతున్నారు. కాంగ్రెస్ అధిష్టానం కూడా బండ్ల వైపే మొగ్గుచూపింది. అధిక మున్సిపల్ కౌన్సిలర్ స్థానాలు బండ్ల వర్గీయులకే కేటాయించింది. దీంతో సరిత వర్గం కాంగ్రెస్ అధిష్టానంపై కన్నెర్ర చేసింది. బండ్ల తీరుపై మండిపడుతూ ఏఐసీసీకి ఫిర్యాదు చేశారు. అయినా ఎలాంటి మార్పు జరగలేదు. వారు కూడా బండ్లకే మద్దతు పలకడంతో సరితకు దిక్కుతోచని పరిస్థితి వచ్చింది. తప్పని స్థితిలో ఇచ్చిన కొన్ని మున్సిపల్ స్థానాలతో సరిపెట్టుకుని అరకొరగా ప్రచారం చేస్తోంది. ఎమ్మెల్యే బండ్ల మాత్రం కేటాయించిన మున్సిపల్ స్థానాల అభ్యర్థుల తరపున ప్రచారంలో ముందున్నారు. బీఆర్ఎస్ అని ప్రకటించి కాంగ్రెస్ అభ్యర్థులకు ప్రచారం చేయడం సిగ్గుచేటని సరిత ఆరోపిస్తోంది. తాను మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు, పార్టీ లైన్కు కట్టుబడి క్రమశిక్షణతో పనిచేస్తున్నానని ఎవరు ఎన్ని ఇబ్బందులు పెట్టినా కాంగ్రెస్ పార్టీని వీడే ప్రసక్తే లేదని సరిత అంటున్నారు. రాష్ట్రమంతా ఒక రకమైన రాజకీయాలు ఉంటే గద్వాలలో మాత్రం రాజకీయ వ్యభిచారం నడుస్తోందని సరిత ధ్వజమెత్తుతున్నారు. తనపై నమ్మకం ఉంచుకున్న అభ్యర్థులందరినీ గెలిపించుకుంటానని, వారికి పూర్తి అండగా ఉంటానని సరిత భరోసా కల్పిస్తున్నారు. ఒక బహుజన బిడ్డను రాజకీయంగా అణగదొక్కాలని చూస్తున్న శక్తులపై, వారి కుయుక్తులపై రాష్ట్ర పార్టీ నాయకత్వానికి ఫిర్యాదు చేయనున్నట్లు సరిత అంటున్నారు. పూటకో మాట మారుస్తున్న స్థానిక ఎమ్మెల్యే బండ్ల అసలు ఏ పార్టీలో ఉన్నారో ఎవరికీ అర్థం కాని పరిస్థితి నెలకొందని ఆమె విమర్శలు చేస్తున్నారు. కష్టకాలంలో పార్టీని ఎవరు కాపాడారో రాష్ట్ర నాయకత్వానికి పూర్తి అవగాహన ఉందని, త్వరలోనే నిజానిజాలు బయటకు వస్తాయన్నారు. ఎమ్మెల్యే బండ్ల మాత్రం సరిత వ్యాఖ్యలను పట్టించుకోవడం లేదు.

**ఇద్దరికీ సవాల్ గా మారిన మున్సిపల్ ఎన్నికలు..**

ఏ ఎన్నికలు వచ్చినా గద్వాల రాజకీయం రసవత్తరంగా.. రంజుగా సాగుతుంది. ప్రస్తుతం మున్సిపల్ ఎన్నికలు రణరంగాన్ని తలపించే విధంగా జరుగుతున్నాయి. మొత్తం 37మున్సిపల్ కౌన్సిల్ వార్డులకు ఎన్నికలు జరుగుతున్నాయి. ఇందులో జనరల్ స్థానాలు 9కాగా జనరల్ మహిళలకు 10స్థానాలు కేటాయించారు. బీసీ జనరల్ కు 7, బీసీ మహిళలకు 6, ఎస్సి జనరల్ కు 2, ఎస్సి మహిళలకు 2, ఎస్టీ జనరల్ కి ఒక స్థానం రిజర్వు అయ్యాయి. ఇందులో అత్యధికంగా ఎమ్మెల్యే బండ్ల వర్గానికి టిక్కెట్లు రావడంతో సరిత వర్గం వారు ఇచ్చిన స్థానాలతో సరిపెట్టుకుని ప్రచారం పెద్దగా చేయడం లేదనే ఆరోపణలు కూడా వస్తున్నాయి. ఏది ఏమైనా గద్వాల రాజకీయం ఇంకా ఎన్ని మలుపులు తిరుగుతుందో వేచిచూడాలి.




# గాంధీ పేరును చెరిపేసే కుట్ర

- మహాత్మా గాంధీ ఏ పాపం చేశారూ..?
- ఉపాధి పథకంలో ఆయన పేరు తొలగించాల్సిన అవసరం ఏంటీ.?
- ఆ పథకాన్ని తిరిగి తెచ్చే వరకు పోరాటం
- బలమైన బ్రిటిష్ పాలకులు కూడా గాంధీని ముట్టుకోలేకపోయారు
- దేశానికి చెందిన మతతత్వ శక్తులు ఆయన్ని కాల్చి చంపాయి
- చెన్నై బహిరంగ సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**ముద్ర, చెన్నై :**

కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వం, దేశాన్ని తెల్లదొరల పాలన నుంచి విముక్తి చేసిన జాతిపిత మహాత్మా గాంధీ పేరును చరిత్ర నుంచి చెరిపేసే కుట్రకు పాల్పడుతోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆరోపించారు. ఉపాధి హామీ పథకం నుంచి గాంధీ పేరును తొలగించడంపై కేంద్రాన్ని తీవ్రంగా ప్రశ్నించారు. గురువారం సాయంత్రం చెన్నై నగరంలో, ఉపాధి హామీ పథక నిబంధనల మార్పులు మరియు పథకం నుంచి మహాత్మా గాంధీ పేరు తొలగింపును నిరసిస్తూ తమిళనాడు ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన పాదయాత్ర, భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఉపాధి హామీ పథకాన్ని కనుమరుగుచేయాలనే ఉద్దేశంతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కొత్త చట్టాన్ని తీసుకొచ్చిందని భట్టి విమర్శించారు. ఈ చట్టంలో మహాత్మా గాంధీ పేరును తొలగించడమే కాకుండా, వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీ కల్పించాలన్న పథకం యొక్క మౌలిక ఆత్మనే హరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కోట్లాది వ్యవసాయ కార్మికులు ఏం పాపం చేశారని పథకంలో మార్పులు చేశారని నిలదీశారు. గతంలో కూలీ ధరల పెరుగుదల కోసం దేశవ్యాప్తంగా జరిగిన ఆందోళనలు, లాఠీచార్జీలు, రక్తపాతాన్ని గుర్తుచేస్తూ, ఆ దుస్థితులకు ముగింపు పలకాలన్న మానవీయ దృక్పథంతో యూపీఏ ప్రభుత్వం మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకాన్ని తీసుకొచ్చిందన్నారు. వంద రోజుల పని హామీతో ఉపాధి అనేది వ్యవసాయ కార్మికుల హక్కు అని నిర్ధారించిన ఈ పథకం, కోట్లాది కూలీల జీవితాల్లో నిశ్శబ్ద విప్లవంగా నిలిచిందని భట్టి అన్నారు. ఉన్న ఊరిలోనే ఉపాధి పొందుతూ ఆత్మగౌరవంతో జీవించే అవకాశాన్ని ఈ పథకం కల్పించిందని పేర్కొన్నారు. ఇంత గొప్ప పథకాన్ని బలహీనపరుస్తూ చివరకు మహాత్మా గాంధీ పేరును కూడా తొలగించడం దురదృష్టకరమన్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పిలుపుమేరకు దేశవ్యాప్తంగా పీసీసీ కమిటీల ఆధ్వర్యంలో వ్యవసాయ కార్మికుల పక్షాన ఉద్యమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకాన్ని పునరుద్ధరించే వరకు కాంగ్రెస్ శ్రేణులు అలుపెరుగని పోరాటం చేస్తాయని స్పష్టం చేశారు. సభలో తమిళనాడు పిసిసి అధ్యక్షుడు సెల్వ, ఏ సి సి సెక్రటరీ చోలాంకర్ జి తదితరులు పాల్గొన్నారు.



# ‘ఎన్నికల్లో ఎలాంటి లోపాలకు చోటు ఇవ్వొద్దు’

**ముద్ర ప్రతినిధి, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా :**

ఫిబ్రవరి 11న జరగనున్న మున్సిపల్ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పక్కాగా చేయాలని జిల్లా ఎన్నికల పరిశీలకుడు మయాంక్ మిట్టల్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని సూచించారు. గురువారం శంకర్పల్లి మున్సిపాలిటీ పరిధిలోని స్ట్రాంగ్రూమ్, కౌంటింగ్ సెంటర్, పోలింగ్ కేంద్రాలను ఆయన జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి. నారాయణరెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల ఏర్పాట్లు, సామగ్రి నిల్వలు, భద్రతా చర్యలను పరిశీలిస్తూ అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఎన్నికలకు సంబంధించిన స్టేషనరీ సామగ్రిపై మున్సిపల్ కమిషనర్ యోగేష్ను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి అవసరమైన అన్ని వసతులు కల్పించాలని, స్ట్రాంగ్రూమ్, కౌంటింగ్ హాల్, పోలింగ్ నిర్వహించే పాఠశాలలను సమగ్రంగా తనిఖీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. డిస్ట్రిబ్యూషన్ ఏర్పాట్లు, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, కౌంటింగ్ నిర్వహణపై మున్సిపల్ కమిషనర్ వివరించారు. ఈ పరిశీలనలో శంకర్పల్లి తహశీల్దార్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.






# పోటాపోటీగా వార్డుల్లో ఎన్నికల ప్రచారం

- రోజు రోజుకు పుంజుకుంటున్న బీజేపీ, టీఆర్ఎస్
- కాంగ్రెస్ అభ్యర్థులకు వార్డుల్లో సీనియర్ నాయకులకు సఖ్యత కరువు
- పరిస్థితి ఇట్లానే ఉంటే కాంగ్రెస్ మూడో స్థానానికి...!
- కాంగ్రెస్ చైర్పర్సన్ అభ్యర్థి పేరును ప్రకటించి తప్పు చేసిందా?



**ముద్ర, నారాయణ పేట :**

నారాయణపేట పట్టణంలో ఎలాగైనా ఈ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ సొంతం చేసుకోవాలని పై స్థాయి నుంచి కింది స్థాయి వరకు కాంగ్రెస్ శ్రేణులు తీవ్రస్థాయిలో శ్రమిస్తున్నారు. అభ్యర్థుల పేర్ల ఖరారు, బీఫామ్ ల అందజేత తర్వాత రోజురోజుకు కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థుల గ్రాఫ్ పడిపోతుంది. ఇందుకు గల ప్రధాన కారణం ఏమిటంటే.. కాంగ్రెస్ పార్టీలో చాలామంది కౌన్సిలర్ టికెట్ కోసం పోటీపడ్డారు. చివరి నిమిషం వరకు టికెట్టు వస్తుందని ఆశించిన కాంగ్రెస్ పార్టీని అంటిపెట్టుకొని ఉన్న పలువురికి చేదు అనుభవం ఎదురయింది. దీంతో వార్డుల్లో ప్రచారంలో కొంత జోష్ తగ్గిందని చెప్పవచ్చు. కేవలం మాజీ డిసిసి అధ్యక్షులు కుంభం శివకుమార్ రెడ్డి, చిట్టెం అభిజయ్ రెడ్డి లు వార్డుల్లో పర్యటనలు చేస్తున్న సమయంలోనే వార్డులలో జనాల సందడి కనిపిస్తుంది. ఈ జనాలు అంతా కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా ఉన్నారా అని అంటే వారంతా ఎన్నికల ప్రచార కూలీలు అని చెప్పవచ్చు. సామాన్య ప్రజలు ఎన్నికల సందర్భంగా అన్ని పార్టీలకు ప్రచారంలో పాల్గొంటున్న విషయం తెలిసినదే. ఏది ఏమైనాప్పటికీ కాంగ్రెస్ కు మాత్రం మ్యాజిక్ ఫిగర్ వచ్చే అవకాశం అయితే ప్రస్తుతానికి కనిపించడం లేదు. ఇప్పటికే కాంగ్రెస్ కు ఎంఐఎం మద్దతుగా ఉంది. కాంగ్రెస్ కు ప్రస్తుత పరిస్థితుల్లో ఎంత కష్టపడ్డా ఏడు స్థానాలకు మించే పరిస్థితి అయితే కనిపించడం లేదు. వీరికి ఎంఐఎం మద్దతు తెలిపిన కాంగ్రెస్ కౌన్సిలర్ల సంఖ్య పది దాటే పరిస్థితి లేదు. మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్ రెడ్డి సైతం పట్టణంలో రోజు నాలుగు వార్డుల చొప్పున జోరుగా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాన్ని ప్రజలకు వివరిస్తున్నారు. ఎంపీ డీకే అరుణ సైతం జిల్లా కేంద్రంలో మున్సిపల్ పీఠం బిజెపి సొంతమయ్యేలా పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేస్తూ గురువారం జిల్లా కేంద్రంలో నీ సత్యనారాయణ చౌరస్తాలో జరిగిన కార్నర్ మీటింగ్ లో ప్రసంగించారు. కాంగ్రెస్ కు మ్యాజిక్ ఫిగర్ రాకపోతే బిజెపి, టిఆర్ఎస్ లు ఒకటైతే మాత్రం జిల్లా కేంద్రంలో అనుకున్నదొకటి అయినది మరొకటి అనే చందంగా పరిస్థితులు ఉండే అవకాశాలు బాగా కనిపిస్తున్నాయి.

**నాయకుల మధ్య కుదరని సఖ్యత..**

కాంగ్రెస్లో చాలామంది ఏళ్లుగా పార్టీ కోసం కష్టపడి పని చేశారు. వీరిలో కొంతమందికి కౌన్సిలర్ టికెట్ ఇవ్వకుండా పక్కన పెట్టింది. ఇతర పార్టీ నుంచి ఈ మధ్యనే కాంగ్రెస్లో చేరిన వారికి కౌన్సిలర్ టికెట్ ఇవ్వడంతో ఏళ్లుగా కష్టపడి పని చేసిన వారికి ఇచ్చిన గుర్తింపు ఇదేనా అని కొంతమంది కాంగ్రెస్ అభ్యర్థులకు లోలోపల వ్యతిరేకంగా పనిచేస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. తమను కాదని ఇతరులకు టికెట్ ఇస్తే ఎలా పనిచేస్తామని కొంతమంది పార్టీకి దూరంగా కూడా ఉంటున్నారు. ఈ పరిస్థితి మరికొన్ని వార్డులలో ఇలాగే కొనసాగితే మాత్రం కాంగ్రెస్ మున్సిపల్ ఎన్నికల్లో ఇబ్బందులు తప్పవు.

**చైర్ పర్సన్ అభ్యర్థి పేరును ప్రకటించి తప్పు చేసిందా..?**

వాస్తవానికి బిజెపి టీఆర్ఎస్ తమ పార్టీ నుంచి చైర్పర్సన్ అభ్యర్థి పేరును అధికారికంగా నేటికీ ప్రకటించలేదు. కేవలం కాంగ్రెస్ మాత్రమే చైర్పర్సన్ అభ్యర్థి పేరును ప్రకటించింది. ఈ ప్రకటించిన నాటి నుంచే కాంగ్రెస్ కు సొంత పార్టీలోనే వ్యతిరేకత మొదలైందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పార్టీని అంటిపెట్టుకున్న వారిని కాదని ఇతరులకు టికెట్ ఇవ్వడం.. పైగా చైర్ పర్సన్ అభ్యర్థిని పేరును ప్రకటించడం కాంగ్రెస్ కు మున్సిపల్ ఎన్నికల్లో కొంత నష్టం చేకూర్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.



# మోదీని పార్లమెంట్ కు రావొద్దని చెప్పా: స్పీకర్

**ముద్ర న్యూస్ :**

లోక్సభలో ప్రధాని మోదీని చుట్టుముట్టేందుకు కాంగ్రెస్ సభ్యులు ప్లాన్ చేసినట్లు స్పీకర్ ఓంబిర్లా వెల్లడించారు. విపక్షాల నిరసనల దృష్ట్యా ఆయన్ను సభకు రావొద్దని సూచించానని పేర్కొన్నారు. ‘‘నిన్న పార్లమెంట్ లో చోటుచేసుకున్న పరిణామాలు దురదృష్టకరం. కాంగ్రెస్ మహిళా ఎంపీల ప్రవర్తనను ఖండిస్తున్నాను. విపక్షాల తీరు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు’’ అని వెల్లడించారు. తనకు అందిన సమాచారం ఆధారంగా, ప్రధాని భద్రతను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందన్నారు. ఆ కారణం వల్లే ప్రధాని సభలో ప్రసంగించలేకపోయారని తెలిపారు. సభకు రాకుండా ఉండేందుకు అంగీకరించిన ప్రధాని.. అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం ఇవ్వలేదన్నారు. అందుకు ప్రధానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ మేరకు పీటీఐ కథనం వెల్లడించింది.

**-రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదాలు..**

ప్రధాని ప్రసంగం లేకుండానే రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని లోక్సభ గురువారం ఆమోదించింది. ‘‘ఈ తీర్మానంపై ప్రధాని మోదీ మాట్లాడకపోవడం అరుదైన అంశం. ప్రసంగించేందుకు మోదీ అందుబాటులోనే ఉన్నప్పటికీ.. కాంగ్రెస్ సభ్యుల ప్లాన్కు సంబంధించిన సమాచారం రావడంతో బుధవారం సభను వాయిదా వేయాలని స్పీకర్ నిర్ణయించారు’’ అని లోక్సభ వర్గాలు పేర్కొన్న సంగతి తెలిసిందే.

**రాహుల్ గాంధీ ప్రసంగంతో సభలో గందరగోళం..**

లద్దాఖ్ ఘర్షణపై భారత సైన్యం మాజీ అధిపతి నరవణె రాసిన పుస్తకం గురించి కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ప్రస్తావించడంలో సభలో గందరగోళ వాతావరణం కొనసాగుతోంది. మరోవైపు, నిన్న అమెరికాతో ఒప్పందాన్ని వ్యతిరేకిస్తూ విపక్ష మహిళా ఎంపీలు ప్రధాని స్థానం వద్దకు బ్యానర్లతో వెళ్లేందుకు సిద్ధమైన సమయంలో సభ వాయిదాపడిన సంగతి తెలిసిందే. అయితే, ఆ సమయంలో మోదీ సభలో లేరు.

**ఆ ఆరోపణలు అవాస్తవం : ప్రియాంకాగాంధీ**

అయితే, స్పీకర్ వ్యాఖ్యల్లో ఎలాంటి వాస్తవం లేదని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకగాంధీ అన్నారు. ‘‘మీ సభ్యులు (అధికారపక్షం) ఏదైనా పుస్తకాన్ని ప్రస్తావించడానికి, అనుచితమైన వ్యాఖ్యలు చేయడానికి మీరు అనుమతిస్తే.. విపక్ష సభ్యులు కూడా ఇకపై నిరసన వ్యక్తం చేస్తారు. లోకసభలో ప్రతిపక్ష నేత మాట్లాడేందుకు ఎందుకు అనుమతించడం లేదో ప్రధానిని, ప్రభుత్వాన్ని మీడియా ప్రశ్నించాలి’’ అని ఆమె స్పందించారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
06.02.2026 శుక్రవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



దేశంలోని టాప్ 10 రాజకీయ పార్టీలు
సీపీఐ (ఎం) (CPI-M) : వామపక్ష రాజకీయాల్లో కీలక శక్తి; కార్మిక, రైతు హక్కులే లక్ష్యం.
C. P. I. (M)

# మరో రెండు రోజుల్లో పొట్టి కప్పు పోరు






- **రికార్డుల ముంగిట భారత్... సెంటిమెంట్ చెరిపే ఛాన్స్ సూర్య సేనకేనా?**

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్**

క్రికెట్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 మరో రెండు రోజుల్లో ఆరంభం కానుంది. ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు భారత్, శ్రీలంక సంయుక్త ఆతిథ్యంతో ఈ మెగా టోర్నీ జరగనుంది. మొత్తం 20 జట్లు టైటిల్ కోసం బరిలోకి దిగుతుండగా, అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం ఫైనల్‌కు వేదిక కానుంది. పాకిస్థాన్ ఫైనల్‌కు చేరితే తుదిపోరు శ్రీలంకకు మారనుంది.
ముంబయి, దిల్లీ, చెన్నై సహా పలు నగరాల్లో మ్యాచ్‌లు జరుగుతుండగా, గ్రూప్ దశ నుంచి సూపర్-8 వరకు పోరు ఉత్కంఠగా సాగనుంది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా భారత్ ఈ టోర్నీలో అడుగుపెడుతోంది. ఈ నేపథ్యంలో పాత రికార్డులను బద్దలు కొట్టి సరికొత్త చరిత్ర సృష్టించే అవకాశాలు టీమిండియాకు కనిపిస్తున్నాయి.

**రెండు టైటిళ్ల చరిత్ర... మూడో కప్పుపై దృష్టి**

టీ20 ప్రపంచకప్ చరిత్రలో భారత్ ఇప్పటికే రెండుసార్లు విజేతగా నిలిచింది. 2007లో ఎంఎస్ ధోనీ నాయకత్వంలో యువ జట్టు సంచలన విజయం సాధించగా, 2024లో రోహిత్ శర్మ సారథ్యంలో అజేయంగా కప్ గెలుచుకుంది. ఇప్పుడు మూడోసారి టైటిల్ సాధిస్తే, ఈ ఫార్మాట్‌లో అరుదైన ఘనతను సొంతం చేసుకునే అవకాశం భారత్‌కు దక్కనుంది.
ఇప్పటివరకు వెస్టిండీస్, ఇంగ్లాండ్, భారత్ మాత్రమే రెండుసార్లు టైటిల్ గెలిచిన జట్లుగా ఉన్నాయి. అయితే మూడు సార్లు కప్పు నెగ్గిన జట్టు ఇప్పటిదాకా లేదు. ఈసారి భారత్, ఇంగ్లాండ్, వెస్టిండీస్ మూడో టైటిల్ కోసం బరిలోకి దిగుతున్నాయి. మరి చరిత్ర ఎవరికి అనుకూలిస్తుందో చూడాలి.

**సొంతగడ్డపై చెరగని సెంటిమెంట్**

**టీ20 ప్రపంచకప్‌లో ఇప్పటివరకు ఏ జట్టూ సొంతగడ్డపై టైటిల్ గెలవలేకపోయింది. ఆస్ట్రేలియా, వెస్టిండీస్, శ్రీలంక, భారత్ లాంటి జట్లు కూడా తమ దేశాల్లో జరిగిన టోర్నీల్లో విఫలమయ్యాయి. 2016లో భారత్ సెమీఫైనల్ వరకే పరిమితమైంది. ఇప్పుడు మళ్లీ భారత్ ఆతిథ్యమిస్తున్న వేళ ఈ ప్రతికూల సెంటిమెంట్‌ను చెరిపేయాలని సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలోని జట్టు పట్టుదలతో ఉంది.**

**బ్యాలెన్స్‌తో బలమైన భారత జట్టు**

ప్రస్తుత భారత జట్టు సమతూకంగా కనిపిస్తోంది. టాప్ ఆర్డర్‌లో అభిషేక్ శర్మ, తిలక్ వర్మ దూకుడు ఇవ్వగల సామర్థ్యం కలిగి ఉండగా, వికెట్ కీపర్లుగా సంజు శాంసన్, ఇషాన్ కిషన్ మ్యాచ్ మలుపుతిప్పే ఇన్నింగ్స్ ఆడగలరు. ఆల్‌రౌండర్లుగా హార్దిక్ పాండ్య, శివమ్ దూబే జట్టుకు కీలకంగా మారనున్నారు.
బౌలింగ్ విభాగంలో జస్ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్ వేగంతో బెదిరిస్తుండగా, స్పిన్ విభాగంలో కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి, అక్షర్ పటేల్ కీలక పాత్ర పోషించనున్నారు. హోమ్ అడ్వాంటేజ్‌తో పాటు బలమైన కాంబినేషన్ భారత్‌కు కలిసొస్తే, మూడోసారి పొట్టి కప్పు ముద్దాడే అవకాశం లేకపోలేదు.ఇప్పుడు అందరి చూపూ ఒక్కటే ప్రశ్నపై ఉంది...ఈసారి సూర్య సేన రికార్డులు, సెంటిమెంట్ రెండింటినీ చెరిపేస్తుందా?

## టీమిండియాతో మ్యాచ్ ఆడం: పాక్ ప్రధాని

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్**



టీ20 ప్రపంచకప్2026 టోర్నమెంట్లో టీమిండియాతో తమ జట్టు మ్యాచ్ ఆడబోదని పాకిస్తాన్ ప్రధాని షెబాజ్ షరీఫ్ పునురుద్ఘాటించారు. క్రీడల్లో రాజకీయ జోక్యం ఉండకూడదని.. అందుకే తాము ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఇస్లామాబాద్‌లో ఫెడరల్ క్యాబినెట్‌ను ఉద్దేశించి ప్రసంగిస్తూ..

**అందుకే టీమిండియాతో మ్యాచ్ ఆడము**

"టీ20 ప్రపంచకప్ టోర్నీలో ఇండియాతో మ్యాచ్ ఆడవద్దని నిర్ణయించుకున్నట్లు మరోసారి స్పష్టం చేస్తున్నాం. ఎందుకంటే.. క్రీడా మైదానంలో రాజకీయాలకు తావు ఉండకూడదనేది మా వాదన. అందుకే మేము కచ్చితమైన నిర్ణయం తీసుకున్నాం.
బంగ్లాదేశ్‌కు మద్దతుగా మేము ఈ పని చేస్తున్నాం. ఇది అత్యంత గొప్ప, సరైన నిర్ణయమని నేను భావిస్తున్నాను" అని షెబాజ్ షరీఫ్ పేర్కొన్నారు. కాగా పాక్ క్రికెట్ బోర్డు చైర్మన్‌గా పాక్ మంత్రి మొహ్సిన్ నక్వీ ఉన్న సంగతి తెలిసిందే.

**మీ వేషాలు మామూలుగా లేవండి!**

ఇప్పుడు వరల్డ్‌కప్‌లో భారత్‌తో మ్యాచ్ బహిష్కరణ గురించి ఏకంగా ప్రధాని ప్రకటన చేశారు. ఈ నేపథ్యంలో రాజకీయాలను క్రీడలతో కలగలిపి దౌత్యపరంగా లబ్ది పొందాలని చూస్తుంది మీరేనంటూ షెబాజ్ షరీఫ్‌పై నెటిజన్లు వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారు.
బంగ్లాదేశ్‌కు లేని బాధ మీకు ఎందుకని.. ఉద్దేశపూర్వకంగా భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరిస్తే నష్టపోయేది మీరేనంటూ చురకలు అంటిస్తున్నారు. ఏదేమైనా.. "మీ వేషాలు మామూలుగా లేవండి" అంటూ సెటైర్లు వేస్తున్నారు.

**తటస్థ వేదికపై దాయాదుల పోరు**

కాగా ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ 2025 టోర్నీకి పాక్ ఆతిథ్యం ఇవ్వగా.. టీమిండియా తటస్థ వేదికైన దుబాయ్‌లో మ్యాచ్‌లు ఆడింది. ఈ నేపథ్యంలో అప్పుడే భారత్ పాక్‌లలో ఒకటి ఆతిథ్య దేశంగా ఉంటే.. తటస్థ వేదికను ఏర్పాటు చేయాలనే ఒప్పందం జరిగింది. అందుకు తగ్గట్లే టీ20 ప్రపంచకప్2026 టోర్నీకి భారత్ ఆతిథ్యం ఇస్తుండగా.. పాక్ శ్రీలంకతో తమ మ్యాచ్‌లు ఆడనుంది.
ఇదిలా ఉంటే.. బంగ్లాదేశ్ కొన్నాళ్లుగా భారత్‌ను రెచ్చగొట్టేలా కవ్వింపు చర్యలకు పాల్పడింది. ఈ నేపథ్యంలో ఐపీఎల్ నుంచి బంగ్లా క్రికెటర్ ముస్తాఫిజుర్ రహమాన్‌ను బీసీసీఐ తొలగించింది. దీంతో భారత్‌తో తమకు భద్రత లేదని.. తమ వేదికను శ్రీలంకకు మార్చాలని బంగ్లా బోర్డు ఐసీసీ దగ్గర పట్టుపట్టింది.

**బంగ్లాదేశ్‌కు గట్టిగానే షాక్ తగిలింది**

అయితే, భారత్‌లో భద్రత విషయంలో బంగ్లా జట్టుకు వచ్చిన ఎలాంటి ముప్పేమీ లేదని ఐసీసీ చెప్పగా.. బంగ్లా మొండివైఖరి వీడలేదు. దీంతో ఆ జట్టును టోర్నీ నుంచి తప్పించింది. అయితే, పాకిస్తాన్ మాత్రం తమకు తటస్థ వేదిక ఉన్నా.. లంకలో భారత్‌తో మ్యాచ్‌కు భద్రతా సమస్యలు ఉన్నాయంటూ కొత్తరాగం ఎత్తుకుంది. అయితే, లీగ్ దశలో మిగిలిన మ్యాచ్‌లకు లేని భద్రతా కారణాలు.. భారత్‌తో మ్యాచ్‌కు మాత్రమే ఎందుకు ఉంటాయనే ప్రశ్నలు వస్తున్నాయి. ఇలాంటి తరుణంలో పాక్ ప్రధాని స్వయంగా మరోసారి ఈ విషయం గురించి ప్రకటన చేయడం విశేషం. ఒకవేళ పాక్ టీమిండియాతో మ్యాచ్‌ను బహిష్కరిస్తే ఆర్థికంగా భారీగా నష్టపోయే అవకాశాలు ఉన్నాయి. ఇదే జరిగితే ఐసీసీ ఆదాయం తగ్గి.. ఇతర సభ్య దేశాల బోర్డులపై కూడా ప్రభావం పడుతుంది.



# భారత్ మ్యాచ్‌పై పాక్ కొత్త ఎత్తుగడ

- **ఐసీసీ ఆంక్షల నుంచి తప్పించుకునే ప్రయత్నం**

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్**

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో భారత్‌తో జరగాల్సిన మ్యాచ్‌ను బహిష్కరిస్తున్నట్లు పాకిస్థాన్ ప్రభుత్వం ప్రకటించడంతో వివాదం ముదిరింది. ఈ నిర్ణయంపై స్పందించిన ఐసీసీ, మ్యాచ్‌కు దూరంగా ఉంటే తీవ్ర పరిణామాలు తప్పవని పాకిస్థాన్ క్రికెట్ బోర్డుకు స్పష్టం చేసినట్లు సమాచారం. భారీ జరిమానాలు, నిధులపై ఆంక్షలు విధించే అవకాశం ఉందని హెచ్చరించింది.ఈ పరిస్థితుల్లో ఐసీసీ చర్యల నుంచి తప్పించుకునేందుకు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు చట్టపరమైన మార్గాలను పరిశీలిస్తోంది. అందులో భాగంగా 'ఫోర్స్ మజూర్' నిబంధనను ఉపయోగించి శిక్షలను తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది.

**'ఫోర్స్ మజూర్' నిబంధన ఇదే**

ఐసీసీ నియమావళి ప్రకారం, ఒక జట్టు కావాలని మ్యాచ్ ఆడకపోతే కఠిన చర్యలు తప్పవు. జరిమానాలు, టోర్నీ నిధుల నిలిపివేత వంటి శిక్షలు విధించే అధికారం ఐసీసీకి ఉంటుంది. అయితే, జట్టు నియంత్రణకు అతీతమైన పరిస్థితులు ఎదురైతే 'ఫోర్స్ మజూర్' నిబంధనను ప్రస్తావించవచ్చు.ప్రకృతి విపత్తులు, ప్రభుత్వ ఆంక్షలు, అనూహ్య పరిస్థితులు వంటి సందర్భాల్లో ఒప్పంద బాధ్యతల నుంచి మినహాయింపు కోరే అవకాశం ఈ నిబంధన ఇస్తుంది. భారత్‌తో మ్యాచ్ విషయంలో కూడా ఇదే వాదనను ఐసీసీ ముందు ఉంచాలని పాకిస్థాన్ భావిస్తోంది.
మ్యాచ్ ఆడేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, ప్రభుత్వ నిర్ణయం కారణంగానే మైదానంలోకి దిగలేకపోతున్నామని పేర్కొంటూ ఐసీసీ శిక్షలను తప్పించుకోవాలన్నది పాక్ వ్యూహంగా కనిపిస్తోంది.

# ప్రాక్టీస్‌లో అపశృతి

- **ఇంగ్లండ్ టెస్ట్ కెప్టెన్ బెన్ స్టోక్స్‌కు తీవ్ర గాయం**

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్**

ప్రాక్టీస్ సెషన్‌లో అనుకోని ఘటన చోటు చేసుకుంది. ఇంగ్లండ్ టెస్ట్ జట్టు కెప్టెన్ బెన్ స్టోక్స్ ముఖానికి బంతి తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ విషయాన్ని స్వయంగా స్టోక్స్ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా వెల్లడించాడు. గాయాల వల్ల కన్ను వాచిపోవడం, పెదవి ముక్కు ప్రాంతాల్లో గాయాల ముద్రలు కనిపించే ఫొటోను షేర్ చేశాడు. బంతి పరిస్థితి ఎలా ఉందో చూడాలంటూ సరదా వ్యాఖ్యతో ఎమోజీని జత చేశాడు.
ఇంగ్లండ్ మీడియా కథనాల ప్రకారం, ఈ గాయం బ్యాటింగ్ సమయంలో సంభవించలేదు. సహచర ఆటగాళ్లతో పక్కన నిల్చున్న సమయంలో ఒక్కసారిగా వచ్చిన బంతిని గమనించలేకపోవడంతో అది నేరుగా ముఖం కుడి భాగాన్ని బలంగా తాకినట్లు తెలుస్తోంది. ఇప్పటికే యాషెస్ సిరీస్ సమయంలో ఎదురైన గాయంతో ఇబ్బంది పడుతున్న స్టోక్స్‌కు ఇది మరో ఎదురుదెబ్బగా మారింది.
పరిమిత ఓవర్ల క్రికెట్‌కు ఇప్పటికే వీడ్కోలు పలికిన స్టోక్స్ ప్రస్తుతం టెస్ట్ ఫార్మాట్‌పైనే దృష్టి పెట్టాడు. జూన్‌లో న్యూజిలాండ్‌తో జరిగే టెస్ట్ సిరీస్‌తో మళ్లీ మైదానంలోకి అడుగుపెట్టనున్నాడు. తాజా గాయం నుంచి అతను త్వరగా కోలుకోవాలని అభిమానులు సోషల్ మీడియాలో కామెంట్లు చేస్తున్నారు.



# ఆ ఒక్కడే బౌలింగ్ చేయలేదు

- **సౌతాఫ్రికా మ్యాచ్‌లో సూర్య మాస్టర్ ప్లాన్**

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్**




ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026కు ముందు జరిగిన ఏకైక సన్నాహక మ్యాచ్‌లో టీమిండియా ఆధిపత్యం చాటింది. సౌతాఫ్రికాతో జరిగిన ఈ పోరులో భారత్ 30 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఇషాన్ కిషన్ మెరుపు బ్యాటింగ్‌తో ఆకట్టుకోగా, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ అమలు చేసిన బౌలింగ్ వ్యూహం మ్యాచ్ గమనాన్ని మార్చింది.
ఈ మ్యాచ్‌లో భారత్ వినూత్నంగా తొమ్మిది మంది బౌలర్లను ప్రయోగించింది. సూర్యకుమార్ యాదవ్, వికెట్ కీపర్ ఇషాన్ కిషన్ మినహా మిగతా ఆటగాళ్లందరికీ బంతి ఇచ్చారు. ప్రత్యర్థి బ్యాటర్లను నిరంతరం ఒత్తిడిలో ఉంచడమే లక్ష్యంగా ఈ ప్లాన్ పనిచేసింది.



## ప్రపంచకప్ ముందు ఆత్మవిశ్వాసం

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్**

సన్నాహక మ్యాచ్‌లోనే 240 పరుగుల భారీ స్కోర్ నమోదు కావడం, బౌలింగ్‌లో విభిన్న ప్రయోగాలు ఫలించడం టీమిండియాకు పెద్ద బలంగా మారింది. ముఖ్యంగా ఇషాన్ కిషన్ ఫామ్ టాప్ ఆర్డర్‌కు స్థిరత్వం ఇచ్చింది. కీలక ఆటగాళ్లు ఆడకుండానే వచ్చిన ఈ విజయం ప్రపంచకప్‌కు ముందు భారత జట్టు సిద్ధతను స్పష్టంగా చూపించింది. టోర్నీలో తొలి మ్యాచ్‌లో అమెరికాతో భారత్ తలపడనుంది.




# వర్షంతో రద్దైన పాక్ వామప్

- **ప్రపంచకప్‌లో కఠిన సమీకరణలు**

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్**

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026కు ముందు పాకిస్థాన్-ఐర్లాండ్ మధ్య జరగాల్సిన ఏకైక ప్రాక్టీస్ మ్యాచ్ వర్షానికి బలైంది. బుధవారం కొలంబోలో నిర్వహించాల్సిన ఈ వామప్ మ్యాచ్‌లో ఒక్క బంతి కూడా పడలేదు. నిరంతర వర్షం కారణంగా టాస్ కూడా వేయకుండానే అంపైర్లు మ్యాచ్ రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో ఇరు జట్లు నిరాశతో మైదానం విడిచాయి.ఈ మ్యాచ్ రద్దుతో పాకిస్థాన్ శిబిరంలో ఆందోళన పెరిగింది. ఇప్పటికే భారత్‌తో జరిగే మ్యాచ్‌ను బహిష్కరిస్తున్నామని పాకిస్థాన్ ప్రభుత్వం ప్రకటించడంతో పరిస్థితి మరింత క్లిష్టంగా మారింది. బంగ్లాదేశ్‌కు మద్దతుగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పాకిస్థాన్ ప్రధాని షెహ్‌బాజ్ షరీఫ్ వెల్లడించారు. ఈ నేపథ్యంలో పాకిస్థాన్ సూపర్-8 దశకు చేరాలంటే లీగ్‌లో మిగిలిన మ్యాచ్‌లన్నింటినీ గెలవాల్సిన పరిస్థితి ఏర్పడింది.




**భారత్ మ్యాచ్ కీలకం**

గ్రూప్-ఏలో భారత్, నమీబియా, నెదర్లాండ్స్, అమెరికాతో పాకిస్థాన్ ఉంది. టాప్-2లో నిలిచిన జట్లు సూపర్-8కు అర్హత సాధిస్తాయి. భారత్‌తో మ్యాచ్ ఆడకపోతే పాకిస్థాన్‌కు రెండు పాయింట్లు కోల్పోయే ప్రమాదం ఉంది. అలా జరిగితే మిగిలిన మూడు లీగ్ మ్యాచ్‌లలో తప్పనిసరిగా మూడు విజయాలు సాధించాల్సి ఉంటుంది. ఇక మరోవైపు శ్రీలంకలో కురుస్తున్న వర్షాలు పాకిస్థాన్‌కు కలవరపెడుతున్నాయి. టోర్నీలో పాకిస్థాన్ ఆడాల్సిన అన్ని మ్యాచ్‌లూ శ్రీలంక వేదికగానే జరగనున్నాయి. భారత్-పాకిస్థాన్ మధ్య ద్వైపాక్షిక ఒప్పందాల ప్రకారం తటస్థ వేదికలపైనే ఇరు జట్లు తలపడుతున్న విషయం తెలిసిందే. ఈ పరిస్థితుల్లో వాతావరణం, పాయింట్ల సమీకరణలు పాకిస్థాన్ ప్రయాణాన్ని మరింత సవాలుగా మారుస్తున్నాయి.

## ఓపెనర్‌గా ఇషాన్ దూకుడు

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్**

**నవీ ముంబైలో జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత్ ముందుగా బ్యాటింగ్‌కు దిగింది. ఓపెనింగ్ స్థానంపై ఉన్న చర్చకు ముగింపు పలుకుతూ సంజూ శాంసన్ బదులు ఇషాన్ కిషన్‌ను ఇన్నింగ్స్ ప్రారంభానికి పంపారు. తొలి బంతి నుంచే అతను దాడి మొదలుపెట్టాడు. అన్రిచ్ నోకియా వేసిన ఓవర్‌లో వరుస సిక్సర్లతో స్కోర్ వేగంగా పెరిగింది.**
**20 బంతుల్లోనే 7 సిక్సర్లు, 2 బౌండరీలతో 53 పరుగులు చేసిన ఇషాన్ కిషన్, ఇతరులకు అవకాశం ఇవ్వాలనే ఉద్దేశంతో రిటైర్డ్ ఔట్‌గా వెనుదిరిగాడు. అనంతరం తిలక్ వర్మ, సూర్యకుమార్ యాదవ్, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్ దూకుడుగా ఆడి భారత స్కోర్‌ను 240 పరుగుల వరకు తీసుకెళ్లారు.**

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
06.02.2026 శుక్రవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**దేశంలోని టాప్ 10 రాజకీయ పార్టీలు**

సీపీఐ (CPI): దేశంలోని పురాతన కమ్యూనిస్టు పార్టీ; ప్రజా ఉద్యమాలే రాజకీయ బలం.






# అదో మాలిన్య కుప్ప...

## సోషల్ మీడియా ట్రోల్స్ పై నటి అభిరామి ఆవేదన

లైవ్ మ్యూజిక్ షో అనంతరం సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియోలతో వందలాది అసభ్య వ్యాఖ్యలు, బాడీ షేమింగ్‌కు గురయ్యానని ప్రముఖ మలయాళ గాయని, నటి అభిరామి సురేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విమర్శల కారణంగా నిద్రలేని రాత్రులు గడిపానని, తీవ్ర మానసిక ఒత్తిడికి లోనయ్యానని వెల్లడించారు. ప్రదర్శన సమయంలో తన కదలికలు, శరీర భంగిమలపై దారుణమైన కామెంట్లు రావడంతో సోషల్ మీడియాను "మాలిన్యపు కుప్ప"గా అభివర్ణిస్తూ భావోద్వేగ పోస్ట్ చేశారు. తాను లైవ్ పెర్ఫార్మర్‌నని, స్టేజ్‌పై కదలడం, డ్యాన్స్ చేయడం తన కళలో భాగమేనని స్పష్టం చేశారు. తప్పు కెమెరా యాంగిల్స్‌తో తీసిన వీడియోల వల్ల తాను అపహాస్యానికి గురయ్యానని అభిరామి వాపోయారు. అయితే కొందరు అభిమానులు మద్దతుగా నిలిచి ధైర్యం చెప్పడం కొంత ఊరటనిచ్చిందన్నారు. గాయనిగా మాత్రమే కాకుండా వ్యక్తిగత జీవితంలోనూ తాను, తన సోదరి అమృత సురేష్ ఆన్‌లైన్ వేధింపులను ఎదుర్కొంటున్నామని పేర్కొన్న ఆమె, తాజా ఘటనతో సోషల్ మీడియాపై విరక్తి చెంది కొంతకాలం దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు.



RIDDHI KUMAR



# అందం–నటనతో ఫుల్ అట్రాక్షన్

## రిద్ధి కుమార్ రైజింగ్ స్టార్!

బహుభాషా చిత్రాల్లో తనదైన నటనతో గుర్తింపు తెచ్చుకుంటున్న నటి రిద్ధి కుమార్ మరోసారి తన అందాలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నది. సంప్రదాయ హంగులతో పాటు హై–ఫ్యాషన్ లుక్‌లోనూ మెరిసిపోతూ, స్టైల్ పరంగానూ తనకంటూ ప్రత్యేక గుర్తింపును సొంతం చేసుకుంది. చీరలో కనిపించినా, ఆధునిక దుస్తుల్లో దర్శనమిచ్చినా సహజమైన సొగసు, ఆత్మవిశ్వాసంతో కూడిన హావభావాలు ఆమెకు అదనపు ఆకర్షణగా నిలుస్తున్నాయి.నేటి తరం నటుల్లో విభిన్నమైన పాత్రలు ఎంచుకుంటూ, భాషా పరిమితులు దాటుతూ ముందుకు సాగుతున్న రిద్ధి, నటనతో పాటు లుక్, వ్యక్తిత్వంతోనూ ప్రత్యేకతను మరోసారి చాటుకుంది. సినిమాలకే పరిమితం కాకుండా ఫొటోషూట్లు, పబ్లిక్ అపియరెన్సులతోనూ అభిమానులను ఆకర్షిస్తూ, భవిష్యత్తులో మరింత పెద్ద అవకాశాలకు సిద్ధంగా ఉన్న నటిగా కనిపిస్తోంది.

# అందాలతో మత్తెక్కిస్తున్న మేధా శంకర్

'12th ఫెయిల్' చిత్రంతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న యువ నటి మేధా శంకర్ ఇప్పుడు బాలీవుడ్‌లో ఆశాజనక నటిగా నిలుస్తోంది. సహజమైన నటన, ఆత్మవిశ్వాసంతో కూడిన అభినయం ఆమెకు ప్రత్యేకతగా మారాయి. ఇటీవల సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫొటోలో మేధా స్టైల్‌తో పాటు చలాకీతనాన్ని ప్రదర్శిస్తూ అభిమానులను ఆకట్టుకుంది. సింపుల్ లుక్‌లోనూ సహజమైన చిరునవ్వుతో కనిపించిన ఆమె, నేటి తరం నటుల్లో తనదైన గుర్తింపును చాటుతోంది. సినిమాలతో పాటు ఫ్యాషన్, వ్యక్తిత్వంతోనూ యువతకు దగ్గరైన మేధా, భవిష్యత్తులో మరిన్ని విభిన్న పాత్రలతో ప్రేక్షకులను అలరించనున్నదన్న అంచనాలు ఉన్నాయి. నటనకు ప్రాధాన్యం ఉన్న కథలను ఎంచుకుంటూ ముందుకు సాగుతున్న ఆమె, బాలీవుడ్‌లో తన స్థానం మరింత బలపరుచుకునే దిశగా అడుగులు వేస్తోంది.





# ఘజియాబాద్ స్టూడెంట్స్ ఘటనపై స్పందించిన సోనూసూద్

సోషల్ మీడియా, ఆన్‌లైన్ గేమింగ్ వ్యసనం యువతతో పాటు చిన్నారులను కూడా తీవ్రమైన ప్రమాదంలోకి నెడుతున్నదని మరోసారి రుజువైంది. ఉత్తరప్రదేశ్ ఘజియాబాద్‌లో ఆన్‌లైన్ గేమింగ్ ఒత్తిడితో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అక్కాచెల్లెళ్లు ఆత్మహత్య చేసుకోవడం దేశవ్యాప్తంగా కలకలం రేపింది. ఈ హృదయ విదారక ఘటనపై బాలీవుడ్ నటుడు సోనూ సూద్ తీవ్రంగా స్పందించారు.ఈ సందర్భంగా ఎక్స్ వేదికగా స్పందించిన ఆయన, ఈ పిల్లలు హింసకు లేదా పేదరికానికి కాదు.. డిజిటల్ వ్యసనం సృష్టించిన కనిపించని ఒత్తిడికి బలయ్యారని పేర్కొన్నారు. చదువు అవసరాలకే పరిమితంగా ఉంచి, 16 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియా, ఆన్‌లైన్ గేమింగ్‌ను నిషేధించాలని మరోసారి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. బాల్యానికి అవసరమైంది ప్రేమ, సరైన మార్గనిర్దేశమే తప్ప స్క్రీన్లు, అల్గారిథమ్స్ కాదని స్పష్టం చేసిన సోనూ సూద్, ఈ ఘటనను మరో వార్తలా మర్చిపోకుండా ఇప్పుడైనా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.

# కావాలని చేసింది కాదు.. క్షమించండి

**బరాబర్ ప్రేమిస్తా నిర్మాతలు**

టాలీవుడ్ బుల్లితెర నటుడు ప్రభాకర్ కుమారుడు చంద్రహాస్ హీరోగా నటిస్తున్న చిత్రం 'బరాబర్ ప్రేమిస్తా' ప్రీ-రిలీజ్ వేడుక అనుకోని వివాదానికి దారి తీసింది. ఈ కార్యక్రమంలో చంద్రహాస్ స్టేజ్‌పై అసభ్య పదజాలం ఉన్న పాటను పాడటంతో అక్కడున్న ప్రేక్షకులు, సినీ వర్గాలు ఆశ్చర్యానికి గురయ్యాయి. ఈ ఘటనపై సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తడంతో చిత్ర బృందం స్పందించింది.వివాదంపై నిర్మాత చిన్ని మాట్లాడుతూ, సినిమాలో చంద్రహాస్ పాత్ర స్వభావాన్ని వివరించాలన్న ఉద్దేశంతోనే అతడు ఆ పాట పాడాడని తెలిపారు. అయితే పాటలో అనుకోకుండా పదాలు జారిపోతాయని తామెవ్వరూ ఊహించలేదన్నారు. ఇది కావాలనే చేసిన పని కాదని, ఈ ఘటనపై తాము విచారం వ్యక్తం చేస్తున్నామని చెప్పారు. పాట అనంతరం చంద్రహాస్‌ను పిలిచి, ఇలాంటి విషయాలు మళ్లీ జరగకుండా సూచనలు ఇచ్చామని వెల్లడించారు. దర్శకుడు సంపత్ రుద్ర కూడా స్పందిస్తూ, ఈ ఘటన తమను బాధించిందని, సినిమాలో ఎలాంటి అభ్యంతరకరమైన లేదా వివాదాస్పద అంశాలు లేవని స్పష్టం చేశారు.



# ఎప్‌స్టీన్ ఫైల్స్ లో మన దర్శకులు

ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణం ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా సంచలనం రేపుతున్న విషయం తెలిసిందే. ఈ కేసుకు సంబంధించిన ఫైల్స్ బయటకు రావడంతో అంతర్జాతీయంగా రాజకీయ, వ్యాపార, వినోద రంగాలకు చెందిన పలువురు ప్రముఖుల పేర్లు వెలుగులోకి వచ్చాయి. తాజాగా ఈ వివాదం బాలీవుడ్‌ను కూడా తాకడం గమనార్హం. ఎప్‌స్టీన్ నిర్వహించిన పార్టీలకు గతంలో కొందరు బాలీవుడ్ సెలబ్రిటీలు హాజరయ్యారన్న కథనాలు రావడంతో సినీ వర్గాల్లో చర్చ మొదలైంది. ఇటీవల విడుదలైన ఎప్‌స్టీన్ ఫైల్‌స్‌లో కొందరు బాలీవుడ్ నటీనటులు, దర్శక నిర్మాతలు ఎప్‌స్టీన్‌కు పంపిన ఈమెయిల్స్ ఉన్నట్లు బాలీవుడ్ మీడియా కథనాలు ప్రచురిస్తోంది. ఈ వివరాలు వెలుగులోకి రావడంతో ఆ పేర్ల చుట్టూ అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే, ఈమెయిల్స్ ఉండటం మాత్రాన నేరానికి సంబంధం ఉన్నట్లు కాదని కొందరు విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు.ఈ నేపథ్యంలో తన పేరు ఎప్‌స్టీన్ ఫైల్‌స్‌లో ఉన్నట్లు వచ్చిన వార్తలపై ఆధ్యాత్మిక గురువు, రచయిత దీపక్ చోప్రా స్పందించారు. ''నేనెప్పుడూ ఎలాంటి నేరపూరిత కార్యకలాపాల్లో పాల్గొనలేదు. ఎప్‌స్టీన్‌తో నా పరిచయం చాలా పరిమితమైనది మాత్రమే. అతనిపై ఉన్న వివాదాస్పద లైంగిక నేరాల ఘటనలతో నాకు ఎలాంటి సంబంధం లేదు'' అని స్పష్టంగా చెప్పారు. తన పేరును అనవసరంగా ఈ వివాదంలో లాగుతున్నారని ఆయన అసహనం వ్యక్తం చేశారు.మొత్తానికి ఎప్‌స్టీన్ కేసుకు సంబంధించిన ఫైల్స్ ఒక్కొక్కటిగా బయటకు వస్తుండటంతో, ఇంకా ఎవరెవరి పేర్లు వెలుగులోకి వస్తాయన్న ఉత్కంఠ నెలకొంది. మరోవైపు, ఆరోపణలు ఎదుర్కొంటున్న పలువురు ప్రముఖులు తమపై వచ్చిన కథనాలను ఖండిస్తూ వివరణలు ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఈ వ్యవహారం బాలీవుడ్‌లో ఎంతవరకు ప్రభావం చూపుతుందన్నది వేచి చూడాల్సిందే.



Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013.
Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com